
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 274
సోమవారం 25-12-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'





కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

జమ్మూకశ్మీర్‌లోని ఓ మసీదులో ప్రార్థనల వేళ ఉగ్రవాదులు ఓ మాజీ పోలీసు అధికారిని తుపాకీతో కాల్చిచంపారు.

వివరాలు 6లో ▸



అన్నీ మంచి శకునములే!

విద్యుత్ వాహనాల పెరుగుదల సహా పర్యావరణపరంగా 2023 సంవత్సరం పలు సానుకూల పరిణామాలకు కూడా వేదికైంది.

వివరాలు 6లో ▸



మళ్లీ కోరలు చాస్తున్న కరోనా

గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 656 కేసులు నమోదయ్యాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 3,742కు చేరుకుంది.

వివరాలు 6లో ▸



అవినీతికి దూరంగా ఉండండి

అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా నాయకులకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సూచించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రవాణాశాఖ కమిషనర్‌గా జ్యోతి బుద్ధప్రకాశ్



రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు ముగియగానే ఆరుగురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను రవాణాశాఖ కమిషనర్‌గా, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఈ.శ్రీధర్‌ను ఎక్సైజ్ కమిషనర్‌గా నియమించింది.

- వివరాలు 3లో▶

గురుకుల కొలువుల భర్తీ ప్రక్రియ షురూ



గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి జిల్లాల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు బోర్డు ప్రత్యేకంగా అధికారులను నియమించింది.

- వివరాలు 3లో▶



ఆసీస్‌ను ఓడించాం

సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. పటిష్టమైన ఆస్ట్రేలియా జట్టును టెస్టు ఫార్మాట్‌లో తొలిసారి ఓడించింది. ముంబైలో జరిగిన 4రోజుల ఏకైక టెస్టులో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘనవిజయం సాధించింది. గతంలో ఆస్ట్రేలియాతో పది టెస్టులు ఆడిన భారత్ నాలుగింటిలో ఓడిపోయి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది.

- వివరాలు 12లో▶


ఆదివారం సచివాలయంలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, భట్టి, సీఎస్, డీజీపీ

భారమైతే బదిలీ!

18 గంటల పని భారమనుకుంటే చెప్పేయండి.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరవేయడానికి కష్టపడాలి
- రూల్స్ కన్నా మానవీయ కోణంలో పనిచేయాలి
- సమస్యల పరిష్కారంలో పాజిటివ్ దృక్పథంతో ఉండాలి
- పని విషయంలో ఇబ్బంది అనిపిస్తే చెప్పండి
- అలాంటి వారిని వేరే చోటికి బదిలీ చేస్తాం
- ప్రజలతో శభాష్ అనిపించుకున్నంత కాలం మీతో ఫ్రెండ్లీగానే ఉంటాం
- పోస్టింగ్‌లకు నిజాయితీ, పనితీరే కొలమానం
- 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన నిర్వహించాలి
- ఈ కార్యక్రమం కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారి
- ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించాలని సూచన

2లో

తెల్ల కార్డే ప్రామాణికం



- 6 గ్యారంటీలకు అదే కీలకం
- త్వరలో ధరణి ప్రక్షాళన...
- కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి వెల్లడి

3లో

డ్రగ్స్ మహమ్మారిని పెకలించాలి

2లో

- గంజాయి అనే మాట రాష్ట్రంలో వినిపించకూడదు
- సన్‌బర్న్ పార్టీలు, బుక్‌మైషోలో టికెట్ల విక్రయాలపై దృష్టి పెట్టాలి..
- దీని వెనుక ఎవరున్నా వదలొద్దు: సీఎం రేవంత్


ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ క్యాథడ్రల్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఆదివారం రంగురంగుల విద్యుద్దీపాలతో వెలుగులు విరజిమ్మింది. - మెదక్

దివిలోను.. భువిలోనా... సంబరం
క్రిస్మస్ పర్వదినం

- వివరాలు 11లో

జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

- ఉమ్మడి పది జిల్లాలవారీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. సీఎం, డిప్యూటీ సీఎం మినహా మిగతా మంత్రులకు ఇన్‌చార్జి పగ్గాలు
- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్
- త్వరలోనే జిల్లా సమీక్షామండళ్ల పునరుద్ధరణ?
- మూడు నెలలకోసారి జిల్లాల్లో అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో సమీక్షలకు అవకాశం

2లో

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కేటీఆర్


శ్వేతపత్రం అబద్ధాల పుట్ట

కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

- తమ పాలనలో సాధించిన విజయాలతో 'స్వేద పత్రం'విడుదల
- శ్వేతపత్రం తప్పుల తడక.. అంకెల గారడీ
- అప్పుల పేరిట అభాండాలు వేసే ప్రయత్నం
- తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,17,015 కోట్లే
- ప్రభుత్వ గ్యారంటీ ఉన్న, లేని రుణాలనూ కలిపేసి రూ.6,71,757 కోట్లుగా చూపారు
- మా పాలనలో తెలంగాణకు రూ.50లక్షల కోట్ల ఆస్తులు సాధించిపెట్టాం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పుల పేరుతో బీఆర్‌ఎస్ పాలనపై అభాండాలు వేసిందని.. శ్వేతపత్రం పేరిట అంకెల గారడీ చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మండిపడ్డారు. శ్వేతపత్రం అంతా తప్పుల తడక అని, అబద్ధాల పుట్ట అని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణకు రూ.50 లక్షల కోట్ల ఆస్తులు సాధించి పెట్టిందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, రాష్ట్రాన్ని పలు అంశాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా

మిగతా 3వ పేజీలో ▶

ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటాం: కేటీఆర్

3లో

ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని..



ఐదుగురి దుర్మరణం

- కర్ణాటకకు వెళ్తూ ఓ కుటుంబం, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తూ మరో కుటుంబం ప్రమాదానికి బలి
- నారాయణపేట జిల్లా జక్లేర్ సమీపంలో ఘటన

5లో

డబ్ల్యూఎఫ్‌ఐపై సస్పెన్షన్ వేటు



భారత రెజ్లింగ్ సమాఖ్యకు ఎన్నికలు జరిగి, కొత్త కార్యవర్గం ఏర్పాటైందన్న ముచ్చట మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. డబ్ల్యూఎఫ్‌ఐపై కేంద్ర క్రీడా శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్‌కు విధేయుడైన సంజయ్ సింగ్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అండర్-15, అండర్-20 జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలను బ్రిజ్‌భూషణ్ హవా నడిచే గోండా (ఉత్తర్‌ప్రదేశ్) పట్టణంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఏకపక్ష విధానంపై కేంద్ర క్రీడా శాఖకు డబ్ల్యూఎఫ్‌ఐ కార్యదర్శి ప్రేమ్‌చంద్ ఫిర్యాదు చేయడంతో వెంటనే సమాఖ్యను సస్పెండ్ చేసింది. -12లో


హిందీ మాట్లాడేవాళ్లు... టాయిలెట్లు కడుగుతున్నారు




- తమిళంతోపాటు ఆంగ్లాన్ని మా పార్టీ ప్రోత్సహిస్తోంది
- సుందర్ పిచాయ్ హిందీ నేర్చుకొని ఉంటే కార్మికుడయ్యేవాడు.. గతంలో పేర్కొన్న డీఎంకే ఎంపీ దయానిధి మారన్
- మళ్లీ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన వీడియో క్లిప్.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు
- ఉత్తరాదివారిని అవమానించేలా మాట్లాడుతున్నారని ధ్వజం

- వివరాలు 6లో

ఇంతంజుగేత్



కిడ్నీ రాళ్ల 'గుట్ట'




ఈ ఫొటోలో కనిపిస్తున్న అతని పేరు ఇస్లావత్ మోతీలాల్. రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయం చేయలేక ఇంటికే పరిమితమయ్యాడు. వారంలో రెండుసార్లు దేవరకొండకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈయన అక్క ముడావత్ రాజీ గత నెల 30వ తేదీన మరణించింది. అందుకు కారణం రెండు కిడ్నీలు పాడైపోవడమే.



ఈ చిత్రంలో ఉన్న పాప పేరు ముడావత్ స్వప్న. వయస్సు పదేళ్లు. నాలుగడుగులు కూడా నడవలేని పరిస్థితిలో ఉంది. కారణం..కిడ్నీలు దెబ్బతినడమే. కొద్ది దూరం నడిస్తే చాలు నొప్పితో కూలబడిపోతుంది.

ఈ ఇద్దరే కాదు..ఇంటికొకరు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారు. కృష్ణమ్మ చెంతనే ఉన్నా తాగడానికి గుక్కెడు రక్షిత నీరు లేకపోవడమే వీరి దుస్థితికి ప్రధాన కారణం.


నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో కృష్ణా నది పక్కనే ఉన్న గువ్వలగుట్ట గ్రామం

నల్లగొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్ట దుస్థితి

- కళ్లెదుటే కృష్ణానది.. తాగడానికి మంచినీరేది?
- విషంలా భూగర్భ జలాలు
- ఇంటికో కిడ్నీ వ్యాధి బాధితుడు
- ప్రాణాలు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు

(చింతకింది గణేశ్)

గువ్వల గుట్టకు మూడు వైపులా కృష్ణానది ఉంది...పచ్చదనం పరుచుకున్నట్టుగా ఆహ్లాదకర వాతావరణం కనిపించే నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని ఈ గ్రామ ప్రజల జీవితాలను కిడ్నీ సంబంధ వ్యాధులు చిన్నాభిన్నం చేశాయి...ఇంకా చేస్తూనే ఉంది. భూగర్భ జలాలు కాలకూటవిషంగా మారడమే ఇందుకు ప్రధాన కారణం. 40 ఏళ్లుగా పుట్టిన ప్రతి బిడ్డది అక్కడ అదే దుస్థితి. ఆరేళ్ల చిన్నారుల నుంచి ఎనభై ఏళ్ల వృద్ధుల వరకు అంతా కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. దీని కారణంగా కొందరు తీవ్ర

మిగతా 5వ పేజీలో ▶

రాష్ట్రంలోనూ పంటల బీమా!

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా పథకాన్ని అమలు చేసే యోచనలో ఉంది. రైతు యూనిట్‌గా దీని రూపకల్పనకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చాక పంటల బీమా పథకంపై ఒక నిర్ణయానికి వస్తామని అధికారులు చెబుతున్నారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఈ పథకం అమలు జరిగేలా కార్యాచరణ ఉంటుందన్నారు. పంటల బీమా అమలులోకి వస్తే ప్రకృతి విపత్తులతో పంట నష్టం జరిగే రైతులకు ఆర్థికసాయం చేసేందుకు వీలుంటుంది. పంటల బీమాలో రైతులు కొంత ప్రీమియం భరిస్తే, ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో తన వాటాగా చెల్లిస్తుంది. పంటల బీమాను అమలు చేసే కంపెనీలతో ఒప్పందం చేసుకుంటారు. ఆ ప్రకారం కంపెనీలు పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం ఇవ్వాలి. అయితే రైతులపై ఏమాత్రం ప్రీమియం భారం పడకుండా ప్రభుత్వమే అంతా చెల్లిస్తేనే ప్రయోజనముంటుందని అధికారులు అంటున్నారు.

పంటల బీమా లేక రైతుల అవస్థ: కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఉంది. ఇది 2016–17 రబీ నుంచి ప్రారంభమైంది. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు దీనిని ఏర్పాటు చేశారు. 2019–20 వరకు ఈ పథకంలో తెలంగాణ కొనసాగింది. ... ప్రభుత్వం 2020లో ఫసల్ బీమా ... అప్పటి నుంచి విపత్తులకు పంట నష్టపోయిన రైతులు ఆర్థిక సాయం అందే అవకాశమే లేకుండా పోయింది.

- కేంద్రంతో సంబంధం లేకుండా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- రైతు యూనిట్‌గా పరిహారం
- 2020లో ఫసల్ బీమా నుంచి వైదొలగిన రాష్ట్రం



- 2020–21 వానాకాలం, యాసంగి సీజన్లు కలిపి 9 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.
- 2021–22లోనూ 12 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కానీ రైతులకు ఒక్కపైసా నష్టపరిహారం అందలేదు. ఈ ఏడాది

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తాం: కిషన్‌రెడ్డి



కాచిగూడ (హైదరాబాద్): వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలలో గెలుస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అధ్యక్షతన జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీ చరిష్మా కొనసాగుతుందని, దేశ ప్రజలందరూ మోదీ పాలనను అంగీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఊహకందని రీతిలో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎంతో మంది ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

మున్షీకి స్వాగతం.. ఠాక్రేకు కృతజ్ఞతలు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మార్పుపై సీఎం ట్వీట్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ నియామకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారు. ఆమె అంకితభావం, చిత్తశుద్ధితో రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ఇన్‌చార్జిగా పనిచేసిన మాణిక్‌రావ్ ఠాక్రే తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం తన వంతు సహకరించారని, కొత్త బాధ్యతల్లో కూడా ఆయన రాణించాలని ఆ ట్వీట్‌లో రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నోరి దత్తాత్రేయుడు



సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత ఆంకాలజిస్టు నోరి దత్తాత్రేయుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి ఆదివారం వచ్చిన దత్తాత్రేయుడు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వైద్య రంగంలో సంస్కరణలకు తన వంతుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని సీఎంతో జరిగిన చర్చల్లో ఆయన వెల్లడించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అమెరికాలోని మెమోరియల్ స్లోన్ కేటరింగ్ ఆస్పత్రిలో కేన్సర్ విభాగాధిపతిగా దత్తాత్రేయుడు పనిచేస్తున్నారు.

28న నాగ్‌పూర్‌కు సీఎం రేవంత్

కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈనెల 28న నాగ్‌పూర్ వెళ్లనున్నారు. డిసెంబర్ 28న కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగసభలో ఆయన పాల్గొంటారని సీఎంవో కార్యాలయ వర్గాల సమాచారం. సోమవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని సీఎం భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఏదో ఒక చర్చిలో జరిగే ప్రార్థనలకు ఆయన హాజరయ్యే అవకాశముంది. ఆయన స్వల్ప గొంతు నొప్పితో బాధపడుతున్న నేపథ్యంలో చర్చికి వెళ్లి వేడుకల్లో పాల్గొంటారా? లేక తన నివాసంలో జరిగే వేడుకలకు పరిమితమవుతారా? అన్న దానిపై సోమవారం స్పష్టత రానున్నట్టు సమాచారం.

రెండు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారు

కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: గతంలోని కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ విజయశాంతి వ్యాఖ్యానించారు. 'పనిదినాలను సెలవు దినాలుగా, సెలవు దినాలనూ సెలవు దినాలు గా గతంలో కేసీఆర్ ప్రభుత్వం నడిపించింది. కానీ రేవంత్ ప్రభుత్వం ఇప్పుడు పనిదినా లను పనిచేసే దినాలుగా, సెలవు రోజులను కూడా ప్రజల కోసం అవసరమైనప్పుడు పనిచేసేలా నడిపిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ స్థానాలు గెలిచినప్పుడు ప్రజల పరిశీలన ప్రభావం అర్థమవుతుంది' అని ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించాలి

గంజాయి అనే మాట రాష్ట్రంలో వినిపించకూడదు

- అవసరమైన మేరకు అన్ని వ్యవస్థలను బలోపేతం చేయాలి
- దీని వెనుక ఎంత పెద్దవారు ఉన్నా, ఎవరినీ వదలొద్దు
- కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ' జూనియర్ కాలేజీలు, స్కూళ్లలోనూ ఇప్పుడు మత్తు పదార్థాలు అందుబాటులోకి వచ్చాయి. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి..దీనిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదు. మీరు గతంలో తీవ్రవాదులు, ఐఎస్ఐలాంటి వారిని కూకటివేళ్లతో పెకలించడానికి ఏ రకంగా అయితే కఠినమైన చర్యలు తీసుకున్నారో, వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నారో, ఈ డ్రగ్ మహమ్మారినికి కూడా నిర్మూలించేందుకు అంతే కృషి చేయాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీస్ అధికారులకు దిశానిర్దేశనం చేశారు. ఉక్కుపాదంతో గంజాయిని అణచివేయాలని, గంజాయి అనే పదం రాష్ట్రంలో వినిపించకూడదన్నారు. ఆదివారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టత ఇచ్చారు.

నార్కోటిక్ బ్యూరో కీలకపాత్ర పోషించాలి

నార్కోటిక్ బ్యూరో అనేది అత్యంత కీలకమైన పాత్ర పోషించాలని, మత్తుపదార్థాల వినియోగంలో పంజాబ్‌లా తెలంగాణ మారకుండా నిర్మూలించాల్సిన బాధ్యత పోలీసులదే సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 'ఉద్యమ నేపథ్యం ఉన్న తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ ఇక్కడి యువతను ఆక్రమించుకుంటున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరం.సైబరాబాద్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నా.. సన్‌బర్న్ పార్టీకి సంబంధించి డిజిటల్ మార్గంలో కొన్ని టికెట్లు అమ్ముతున్నారు. బుక్ మైషో లాంటి కొన్నింటిని నేను స్వయంగా గమనించినా.. వారు ప్రభుత్వ అనుమతి పొందలేదు.. అనుమతి పొందకుండా 31 రాత్రి సన్‌బర్న్ పార్టీకి సంబంధించి టికెట్లు విక్రయిస్తున్నారు.18 సంవత్సరాలలోపు వారికి అనుమతి లేదు. అండర్ 18 వారికి మద్యం అమ్మడానికి లేదు. ఈ రోజు స్కూల్ పిల్లలకు కూడా దొరుకుతున్నాయి. బుక్ మైషో ప్లాట్‌ఫాం ఏదైతో ఉందో దానిమీద విచారణ చేయండి.. అనుమతి లేకుండా పార్టీలు చేసుకోవడానికి వీలు లేదు. పోలీసుల అనుమతి లేకుండా టికెట్లు అమ్మడానికి లేదు. ఈవెంట్స్‌ను జల్లెడ పట్టండి..వాటిని ఆదాయవనరుగా చూడకండి. అలాంటివి యువతను పెడద్రోవకు మళ్లిస్తున్నాయి. హుక్కా సెంటర్స్, పబ్స్‌లో జరిగే వ్యవహారాలుగానీ, ఇట్లాంటి సన్‌బర్న్ పార్టీలను గోవా, కర్ణాటక, మహారాష్ట్రలు నిషేధించాయి. ప్రస్తుతం చాలా కఠినంగా వ్యవహరించండి. గంజాయి ఏఓబీ సప్లయ్ అవుతుందా? మన దగ్గర పండించేది చాలా తక్కువగా ఉండొచ్చు..కానీ వినియోగించేది ఎక్కువైంది. ఏఓబీ నుంచి మన ప్రాంతానికి ఏ రకంగా వస్తుంది? క్షుణ్ణంగా చూడండి ' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

సైబర్ నేరాలే ఇప్పుడు బిగ్‌టాస్క్

గతంలో ఉన్న సంప్రదాయ నేరాలన్నీ ఇప్పుడు సైబర్‌నేరాలుగా మారిపోయాయని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇప్పుడు సైబర్ క్రైమ్ బిగ్గెస్ట్ టాస్క్ అని అన్నారు. 'సైబర్ క్రైమ్ నేరగాళ్లు పెరిగిపోయారు. దీనిపై కూడా పోలీసులు ప్రత్యేకమైన దృష్టి పెట్టండి. మతాల మధ్య, కులాల మధ్య వైషమ్యాలు పెంచేలా సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

నకిలీ విత్తనాలు టెర్రరిజం కంటే ప్రమాదకరం

నకిలీ విత్తనాల అంశం టెర్రరిజం కంటే ప్రమాదకరమైందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతులకు నష్ట పరిహారం ఇవ్వడానికి నకిలీ విత్తనాల కంపెనీల ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్టు కింద జప్తు చేయాలన్నారు. నకిలీ విత్తనాల మీద ఉక్కుపాదంతో అణచివేయాలి' అన్నారు. నకిలీ విత్తన కంపెనీల ఆస్తులు ఎందుకు సీజ్ చేయడం లేదు? చట్టంలో సీజ్ చేసే అవకాశం లేకుంటే చట్టాన్ని సవరించుకోవాలని అధికారులకు నేను ఆదేశిస్తున్నా. నకిలీ విత్తనాలను క్షమించే సమస్యనే లేదు' అని స్పష్టం చేశారు.

పౌరులకే ఫ్రెండ్లీ పోలీస్.. క్రిమినల్స్‌కు కాదు

ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని తప్పుడు పద్ధతుల్లో వాడితే ప్రభుత్వం క్షమించదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'గంజాయి, హెరాయిన్, కొకైన్ వాడే వారితో ఫ్రెండ్లీగా ఉండమని కాదు..ఫ్రెండ్లీ పోలీసింగ్ అర్థం. నేరాలు, హత్యలు చేసిన వారు పోలీస్‌స్టేషన్‌కు వస్తే..వారిని ఫ్రెండ్స్‌లా ట్రీట్ చేయమని కాదు ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే..సామాన్యమైన పౌరుడు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వస్తే వారిని మర్యాదగా కూర్చోబెట్టి వారు ఏం చెబుతున్నారో అడిగి తెలుసుకోవాలి' అని అన్నారు.

భారమైతే బదిలీ!

18 గంటల పని భారమనుకుంటే చెప్పేయండి

- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రితో జరిగిన సమావేశానికి హాజరైన కలెక్టర్లు, ఎస్పీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ఎనిమిది పనిదినాల్లో 'ప్రజాపాలన'కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్లు, ఎస్పీలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ శాఖ గ్రామసభలను నిర్వహిస్తుందని, పోలీసుశాఖ వాటిని గాడిలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం అమల్లో ఏవైనా ఇబ్బందులుంటే సీఎస్, డీజీపీకి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. పని చేయడానికి ఇబ్బందిగా ఉన్నా, ఇష్టం లేకపోయినా చెప్పాలని.. వేరే చోటికి బదిలీ చేయడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఉండి ఏమీ చేయబోమంటే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ''ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరవేయడం ఎవరికైనా ఇష్టం లేకున్నా.. ఎక్కువగా పనిచేయాల్సి వస్తోందని, 18 గంటలు పనిచేయాల్సి వస్తోందని, మానసికంగా, శారీరకంగా ఇబ్బంది ఎందుకని అనిపించినా చెప్పండి. అలాంటి వారిని వేరే చోటికి బదిలీ చేస్తాం. 18 గంటల పని ఉండని ప్రాంతానికి బదిలీ చేయడంలో అభ్యంతరం లేదు. అధికారుల సూచనలు, సలహాలను ఓపెన్ మైండ్‌తో స్వీకరిస్తాం. అధికారుల పనితీరుకు నీతి, నిజాయతీలే పెద్ద కొలమానం. పోస్టింగ్స్‌లో వాటినే పరిగణనలోకి తీసుకుంటాం..''అని రేవంత్ చెప్పారు.

ప్రజా పాలనకు ప్రత్యేకాధికారులు

ప్రజాపాలనలో భాగంగా ప్రతి మండలంలో రోజూ రెండు గ్రామాల్లో సభలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. మండలంలో రెండు బృందాలుంటే ఒక బృందానికి ఎమ్మార్వో, మరో బృందానికి ఎంపీడీవో బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం కోసం 119 నియోజకవర్గాలకు 119 మంది ప్రత్యేకాధికారులను నియమిస్తామని చెప్పారు. ముందుగా గ్రామాలకు వెళ్లి ప్రణాళికతో సభ నిర్వహించాలని.. మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ సందేశాన్ని చదివి వినిపించిన తర్వాత కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నిరక్షరాస్యుల దరఖాస్తులను నింపించడానికి అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. దరఖాస్తులకు అవసరమైన డేటా, ఆధార్‌కార్డు, ఫోటో వంటివి తేవాలని ప్రజలకు ముందే తెలియజేయాలని ఆదేశించారు. అమరవీరులు, ఉద్యమకారులపై ఎఫ్ఐఆర్, కేసుల వివరాలను సేకరించాల్సి ఉంటుందని, ముందే అప్లికేషన్లు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజాపాలన కింద సేకరించిన దరఖాస్తులను డిజిటలైజ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తే.. వాటిని స్క్రూటినీ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పారు. ప్రతి నాలుగు నెలలకోసారి గ్రామసభలు, ప్రజాపాలన పరిస్థితిని సమీక్షించుకుందామన్నారు.

అద్దాల మేడలు కట్టి అభివృద్ధి అంటే ఎలా?

''అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుల నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని అంబేడ్కర్ ఎప్పుడో చెప్పారు. అద్దాల మేడలు, రంగుల గోడలు చూపించి అభివృద్ధి జరిగిందని ఎవరైనా భ్రమపడితే పేద ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. చివరి వరసలోని పేదలకు సంక్షేమ పథకాలు అందినప్పుడే ఈ రాష్ట్రం గానీ, దేశం గానీ అభివృద్ధి చెందినట్టు కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది..''అని రేవంత్ చెప్పారు. ఆరు గ్యారంటీల అమలుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలపైనే పూర్తి బాధ్యత పెట్టామని, వారిపై నమ్మకంతో దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.

ప్రజలతో జాగ్రత్తగా వ్యవహరించాలి

''తెలంగాణ ప్రజలు గౌరవంగా, మర్యాదగా వ్యవహరిస్తారు. అభివృద్ధిని విస్మరిస్తే వారి ప్రతిస్పందన చాలా కటువుగా ఉంటుంది. అది మీరంతా ఇటీవలే చూశారు..''అని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఉద్దేశిస్తూ సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలను అర్థం చేసుకోకుంటే ఎంతటి వారినైనా ఇంటికి పంపించగలరని.. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మాది ఫ్రెండ్లీ ప్రభుత్వమే.. కానీ..

తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమేనని.. అయితే ప్రజలతో శభాష్ అనిపించుకున్నంత వరకే ఈ ప్రభుత్వం అధికారులతో ఫ్రెండ్లీగా ఉంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించినా, ఉద్దేశపూర్వకంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా ప్రభుత్వం సమీక్షిస్తుందని చెప్పారు. అధికారుల్లో మానవీయ కోణం ఉంటే ప్రజల సమస్యల్లో 90శాతం సమస్యలు అక్కడే పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు. రూల్స్‌ను అమలు చేస్తున్నామని అనుకోవడం కంటే, ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ఉన్నామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో సానుకూల (పాజిటివ్) దృక్పథం, ధోరణితో ముందుకెళ్లాలన్నారు. అలా కాకుండా ఏ కాగితం వచ్చినా ఎలా తిరస్కరించాలన్న ఆలోచనా ధోరణి ఉంటే అభివృద్ధి, సంక్షేమం సరైన దిశగా ప్రయాణించవని స్పష్టం చేశారు.

పాత ప్రభుత్వ పద్ధతులను మానుకుంటే మంచిది

డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు అనుగుణంగా అధికారుల పనితీరు ఉండాలని.. విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్లు, ఎస్పీలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లడంలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ వచ్చిన దశాబ్దకాలం తర్వాత ప్రజల ప్రభుత్వం ఏర్పడిందని.. ఈ ప్రభుత్వం తమదేనన్న నమ్మకం, భరోసాను ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అందుకు తగ్గట్టుగా అధికార యంత్రాంగం పనితీరు ఉండాలని సూచించారు. పాత ప్రభుత్వ పద్ధతులను అధికారులు మార్చుకోవాలని, ఆ మైండ్‌సెట్ ఇక ముందు ఉండకూడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు అమలు చేశామని.. మిగతా గ్యారంటీలను కూడా వంద రోజుల్లో కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి లబ్ధిదారుకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఠాక్రేకు టీపీసీసీ వీడ్కోలు

త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్న మున్షీ



ఠాక్రేకు వీడ్కోలు పలుకుతున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి అధిష్టానం తప్పించిన నేపథ్యంలో మాణిక్‌రావ్ ఠాక్రే తన సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. గోవా ఇన్‌చార్జిగా నియమితులైన ఆయనకు ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పలువురు టీపీసీసీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు హర్కర వేణుగోపాల్, అంజన్‌కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ఏఐసీసీ సభ్యుడు ఎం.ఎ.ఫహీం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు భూపతిరెడ్డి నర్సారెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆయనను కలిసి వీడ్కోలు పలికారు. ఠాక్రేకు టీపీసీసీ పక్షాన జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలోనే మహారాష్ట్రకు వెళ్లినట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన దీపాదాస్ మున్షీ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

- ఉమ్మడి పది జిల్లాలవారీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- త్వరలోనే జిల్లా సమీక్షామండళ్ల పునరుద్ధరణ?



ఏ మంత్రి ఏ జిల్లాకు..

జిల్లా	మంత్రి
కరీంనగర్	ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
మహబూబ్‌నగర్	దామోదర రాజనర్సింహ
ఖమ్మం	కోమటిరెడ్డి వెంకటరెడ్డి
రంగారెడ్డి	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
వరంగల్	పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
హైదరాబాద్	పొన్నం ప్రభాకర్
మెదక్	కొండా సురేఖ
ఆదిలాబాద్	ధనసరి అనసూయ
నల్లగొండ	తుమ్మల నాగేశ్వర్‌రావు
నిజామాబాద్	జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. కేబినెట్‌లోని మంత్రులందరికీ ఉమ్మడి పది జిల్లాలవారీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మినహా మిగతా 10 మంది మంత్రులను తలా ఓ జిల్లాకు ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కని హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్, ఆదిలా బాద్‌కు సీతక్క, నిజామాబాద్‌కు జూపల్లి కృష్ణా రావు, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను ఇన్‌చార్జి మంత్రులుగా బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో త్వరలోనే జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) లను కూడా పునరుద్ధరించనున్నట్టు తెలుస్తోంది. ఈ మండళ్ల పునరుద్ధరణ ద్వారా ప్రతి మూడు నెలలకోసారి ఆయా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో సమీక్షలు నిర్వహించనున్నట్టు సమాచారం. అయితే, ఇన్‌చార్జి మంత్రులను ప్రజాపాలన కార్యక్రమాల అమలును సమన్వయం చేసేందుకు నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం.

ప్రజాపాలనకు రూ.22.93 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.22.93 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ నిధులను రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు పరిధిలో గ్రామ సభల నిర్వహణ కోసం వినియోగించనున్నారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలుండగా, ప్రతి పంచాయతీకి గ్రామసభ నిర్వహణ ఖర్చుల కింద రూ.10వేల చొప్పున రూ.12.77 కోట్లు కేటాయించారు. ఇక, రాష్ట్రంలోని 3,658 మున్సిప ల్ వార్డులకు రూ.3.66 కోట్లు, జిల్లాల్లో ఇతర ఖర్చుల కోసం రూ.3.30 కోట్లు కేటాయిస్తు న్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక, ఈ గ్రామ సభల నిర్వహణ కోసం వెళ్లే అధికారుల బృందాల ఖర్చుల కోసం ప్రతి బృందానికి రూ.20 వేలు చొప్పున రూ.3.20 కోట్లు కేటాయించారు. ఈ నిధులన్నింటినీ ఆయా గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా జిల్లా కలెక్టర్లు పంపిణీ చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

5 పథకాలు.. 4 నెలలకోసారి

ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు కార్యక్రమాలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ముందస్తు సమావేశాలు
- నియోజకవర్గ స్థాయిలోనూ సమావేశాలు..అన్నింటికీ ఒకటే దరఖాస్తు ఫారం
- మహిళలకు ప్రత్యేక కౌంటర్లు.. రోజువారీ దరఖాస్తుల వివరాలు పంచాయతీరాజ్ శాఖకు
- ప్రజాపాలన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ సూచనలు

సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీలు సమర్థవంతంగా అమలు...క్షేత్రస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నాలుగునెలలకోసారి ప్రభుత్వం 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహించనుంది. అయితే ఈ కార్యక్రమాన్ని ఐదు పథకాలకు మాత్రమే వర్తింపజేస్తామని ప్రభుత్వవర్గాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆదివారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రజాపాలన కార్యక్రమ అమలు విధివిధానాలపై మార్గదర్శకాలు విడుదల చేశారు. దీని ప్రకారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ఎనిమిది పనిదినాల్లో (డిసెంబర్31, జనవరి1 మినహాయించి) నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షిఫ్టుల్లో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామపంచాయతీలోనూ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి మున్సిపల్ వార్డులోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

షెడ్యూల్, నిబంధనలు

- ఈ నెల 25వ తేదీలోపు అధికారుల బృందాల ఏర్పాటు, గ్రామాల వారీగా విజిట్ షెడ్యూల్ తయారీ (మంగళవారం సాయంత్రం ఆరు గంటలకల్లా ఈ వివరాలు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది)
- ఈ నెల 26న అధికారుల బృందాలకు శిక్షణ, అవగాహన
- ఈ నెల 26,27 తేదీల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయిలో అధికారులకు అవగాహన కార్యక్రమం , పథకం ఉద్దేశాల వివరణ
- ఈ నెల 28న గ్రామ, వార్డు సదస్సులు ప్రారంభం..సాయంత్రం 8 గంటల కల్లా డైలీ రిపోర్టు ఆన్‌లైన్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి.
- సదస్సు ఏర్పాటుకు ఒక రోజు ముందే గ్రామాలు, వార్డుల్లో టాంటాం వేయించడంతో పాటు కౌంటర్లు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలి.
- రాష్ట్ర స్థాయిలో ఒక ఉమ్మడి దరఖాస్తు ఫారం రూపొందించి కలెక్టర్లకు పంపిస్తారు. వీటిని ఈ నెల 27వ తేదీ రాత్రికల్లా గ్రామాలు, వార్డులకు పంపించాలి. ముందు రోజే గ్రామాలు, వార్డుల్లో దరఖాస్తులు పంపిణీ చేసి వాటిని ప్రజలతో నింపించాలి.
- సభలు సజావుగా నిర్వహించడానికి తాగునీరు, టెంట్లు, కౌంటర్ల కోసం టేబుళ్లు, క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలి.
- గ్యారంటీల అమలుతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు ఈ సభలకు హాజరు కావాలి. నియోజకవర్గస్థాయిలో నోడల్ అధికారులను నియమించి కార్యక్ర మాన్ని పర్యవేక్షించాలి. ప్రతి గ్రామపంచాయతీ / వార్డుకు ప్రత్యేక అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించాలి.
- ఇతర గ్రామ స్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో సమన్వయం చేసుకొని కార్యక్రమం నిర్వహించాలి.
- గ్రామ పంచాయతీ సర్పంచ్/కౌన్సిలర్/కార్పొరేటర్, ఇతర ప్రజాప్రతినిధులను సదస్సులకు ఆహ్వానించాలి.
- సభ ప్రారంభానికి ముందు ప్రభుత్వ సందేశాన్ని చదివి వినిపించాలి.
- దరఖాస్తులతో పాటు అవసరమైన ఆధార్, తెల్లరేషన్ కార్డు సమర్పించేలా కౌంటర్లలో ఉండే సిబ్బంది జాగ్రత్త తీసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణకు మహిళలకు ప్రత్యేక కౌంటర్లు, స్త్రీ, పురుషులకు విడివిడిగా క్యూలైన్లు ఏర్పాట్లు చేయాలి. దరఖాస్తుదారులు భారీ సంఖ్యలో ఉంటే టోకెన్ విధానం అమలు చేయాలి.
- దరఖాస్తుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలి.
- స్వీకరించిన ప్రతి దరఖాస్తు వివరాన్ని పంచాయతీరాజ్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి. ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్య కేటాయించాలి.
- పట్టణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లేదా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.
- స్వీకరించిన అన్ని దరఖాస్తులు టీం లీడర్ అధీనంలో ఉంచాలి. వాటిని భద్రపర్చడంతో పాటు కంప్యూటరీకరించేందుకు అవసరమైన కార్యాలా యాన్ని జిల్లా కలెక్టర్ కేటాయించాలి.
- ప్రతి అధికారుల బృందం రోజుకు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించాలి. జనవరి ఆరో తేదీ నాటికి పూర్తి చేసుకోవాలి. ప్రతి 100 కుటుంబాలకు కనీసం ఒక కౌంటర్ ఉండేలా చూసుకోవాలి.
- దరఖాస్తుల వెరిఫికేషన్/ప్రాసెసింగ్‌కు సూచనలు ప్రభుత్వం త్వరలోనే జారీ చేస్తుంది.
- అధికారుల బృందాలు విజిట్ షెడ్యూల్‌కు 10 అంశాలతో, డైలీ రిపోర్టు కోసం 11 అంశాలతో ప్రత్యేక ఫార్మాట్ రూపొందించారు.

దరఖాస్తులు స్వీకరించే పథకాలు

- మహాలక్ష్మి
- రైతుభరోసా
- గృహజ్యోతి
- ఇందిరమ్మ ఇళ్లు
- చేయూత

గ్రామాలు లేదా వార్డులకు వచ్చే అధికారులు వీరే

- తహసీల్దారు లేదా రెవెన్యూ శాఖ ప్రతినిధి
- ఎంపీడీఓ లేదా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధి
- మండల పంచాయతీ అధికారి లేదా పంచాయతీరాజ్ ప్రతినిధి
- మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ శాఖ ప్రతినిధి
- పౌరసరఫరాల శాఖ ప్రతినిధి
- పీహెచ్‌సీలోని వైద్యాధికారి లేదా వైద్య శాఖ ప్రతినిధి
- మండల విద్యాధికారి లేదా విద్యాశాఖ ప్రతినిధి
- ఏఈ (డిస్కం) లేదా విద్యుత్‌శాఖ ప్రతినిధి
- సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి
- ఇతర సంబంధిత అధికారులు. (వీరిలో అవసరమైన అధికారులను గ్రామాల వారీగా నియమించుకోవాల్సి ఉంటుంది.)



అన్నపూర్ణకు అండగా నిలిచిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కూతురు చదువు కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఇల్లందు పట్టణం ఆజా ద్‌నగర్‌కి చెందిన అన్నపూర్ణ తన ఆర్థిక కష్టా లను ప్రభుత్వం దృష్టికి తెచ్చి సాయం పొందేందుకు ప్రజావాణి లో దరఖాస్తు చేసేందుకు నగరానికి వచ్చింది. ప్రజావాణి లో దరఖాస్తు చేసుకున్నా అధికారులు సరిగా స్పందించకపోవడం, అసెంబ్లీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఆమె ఆదివారం తెలంగాణ భవన్ వెళ్లి కేటీఆర్‌ని కలిసి తన పరిస్థితిని చెప్పింది. అన్నపూర్ణ కష్టాలు తెలుసుకున్న కేటీఆర్, ఆమె కూతురు నర్సింగ్ చదువు కోసం లక్ష రూపాయల చెక్కును ఇచ్చారు. తన కూతురు విద్య కోసం, కుటుంబ ఆర్థిక సహాయం కోసం సహకారం అందించిన కేటీఆర్‌కి అన్నపూర్ణ ధన్యవాదాలు తెలిపింది.

ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటాం

ఉద్యోగులు, నిరుద్యోగులకు ఎంతో చేసినా చెప్పకోలేక వెనుకబడ్డాం: మీడియాతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రతి గెలుపులో పాఠాలుంటే.. ఓటమిలో గుణపాఠాలు ఉంటాయని.. ఆ గుణపాఠాలు నేర్చుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. దేశంలోనే ఉద్యోగులకు అత్యధిక జీతాలు ఇచ్చామని, నిరుద్యోగులకు అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని.. కానీ సరైన విధంగా ప్రచారం చేసుకోలేకపోయామని పేర్కొన్నారు. 'నిజం గడప దాటే లోపల.. అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంద'న్న సామెత నిజమైందని.. కాంగ్రెస్ అబద్ధాలు, అలవి గాని హామీలను ప్రజలు నమ్మారని వ్యాఖ్యానించారు. యూట్యూబ్‌లో కొందరు బట్టగాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే నివారించలేకపోయామని, దానితోనూ కొంత నష్టం జరిగిందన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో 'స్వేద పత్రం' పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమే..

కేవలం 1.85శాతం ఓట్లతో తాము ఓడిపోయామని.. ఏడెనిమిది సీట్లు నాలుగైదు వేల ఓట్ల తేడాతో కోల్పోయామని చెప్పారు. ఇది ఘోర పరాజయం కాదని, ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చిందన్నారు. "రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నా. మీరు విజయవంతం కావాలని మేం కోరుకుంటున్నాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని కోరుతున్నాం. వందరోజుల్లో చాలా చేస్తామని చెప్పారు. వందరోజుల కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తప్పకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. మొన్ననే నాలుక మడతేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టినా.. ఉప ముఖ్యమంత్రి తాము ఆమాటే అనలేదన్నారు. ఇలా ఎన్నో ఉన్నాయి. ఆరు గ్యారంటీలు కాదు. 142 హామీలున్నాయి. వాటిని లెక్కతీశాం. మా పార్టీ తరఫున శాఖల వారీగా షాడో టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. వేరే దేశాల్లో వాటిని షాడో కేబినెట్ అంటారు. అలాంటిదే మా లెజిస్లేచర్‌లో ఏర్పాటు చేసుకుంటాం. ప్రతి ప్రభుత్వ శాఖలో, ప్రతిరంగంలో సర్కారు పనితీరు.. వారు ఏం చేస్తున్నారు? ఏ నిర్ణయాలు తీసుకుంటున్నారు? తదితర అంశాలన్నింటినీ నిశితంగా గమనించి ప్రజలకు వివరిస్తాం.." అని కేటీఆర్ చెప్పారు. దీప స్తంభంగా మారిన తెలంగాణను ఆరనివ్వబోమని, పడిపోనివ్వబోమని పేర్కొన్నారు.

ఏ విచారణకైనా మేం సిద్ధం

రాజకీయాల్లో పోటీకి వెళ్లిన ప్రతిసారీ గెలుస్తామనే ఆశిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, వారికి కృతజ్ఞతలు చెప్తున్నామని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడుతామని, ప్రతి అంశంపై రివ్యూ చేస్తామని చెప్పారు. "అధికారాన్ని ప్రజలకు సేవ చేసేందుకు, హామీలను నెరవేర్చేందుకు వినియోగిస్తారా? కక్ష సాధింపు కోసం వినియోగిస్తారా? అనేది వారి విజ్ఞత. ఏ విచారణ అయినా.. ఏ కమిషన్ అయినా.. ఏ రకమైన ఆదేశాలు ఇచ్చినా మాకు అభ్యంతరం లేదు. కావాలంటే విచారణ చేయాలని మేమే సభలో డిమాండ్ చేశాం. అన్నింటినీ న్యాయపరంగా ఎదుర్కొంటాం.." అని కేటీఆర్ స్పష్టం చేశారు. యువత విపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మినట్టు అనిపించిందని.. అప్పుడే స్పందించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం కూడా ఉందని చెప్పారు. తమ తరఫున చిన్నచిన్న తప్పులు, పొరపాట్లు జరిగాయని.. సవరించుకొని ముందుకెళ్తామని వివరించారు. ఉద్యోగుల జీతాల విషయంలో కరోనా ఆర్థిక ప్రతిష్టంభన తర్వాతే కొంత ఇబ్బంది వచ్చిందని.. దాన్ని కూడా అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఊహించని వాళ్లు ఓడిపోయారు!

మీడియాతో లంచ్ సందర్భంగా కూడా కేటీఆర్ పలు అంశాలపై చిట్‌చాట్ చేశారు. "ప్రజల తీర్పును అర్థం చేసుకోలేకపోతున్నాం. ఇంత చేసినా ఎలా ఓడిపోయాం? ఇక్కడ ఎమ్మెల్యే ఓడిపోవాలి, అక్కడ కేసీఆర్ సీఎంగా ఉండాలని ప్రజలు ఓట్లేసినట్టు చెపుతున్నారు. కోనేరు కోనప్ప, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ధర్మారెడ్డి, సింగిరెడ్డి, ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి వంటి వారు ఓడిపోతారని ఎవరైనా అనుకుంటారా? వారికి రెండు సార్లు అవకాశం ఇచ్చాం కదా.. ఓసారి వీళ్లకు ఇద్దామని ప్రజలు భావించారని అనిపిస్తోంది.." అని పేర్కొన్నారు.

గురుకుల కొలువుల భర్తీ ప్రక్రియ షురూ!

- అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కోసం గురుకుల బోర్డు సన్నాహాలు
- పరిశీలనాధికారులకు రెండ్రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఈనెల 28, 29 తేదీల్లో శిక్షణ పూర్తి చేశాక విధుల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. దాదాపు 9వేల ఉద్యోగాలకు సంబంధించి అర్హత పరీక్షలను నిర్వహించిన తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) మూడు కేటగిరీల్లో మినహా మిగతా అన్ని పరీక్షల తాలుకూ ప్రశ్నాపత్రాల కీలను సైతం విడుదల చేసింది. అయితే మహిళా రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉండడంతో నియామకాల ప్రక్రియలో కొంత గందరగోళం ఏర్పడింది. ప్రస్తుతం నియామకాల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా అతి త్వరలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సిద్ధమవుతున్నారు.

ఎల్బీనగర్‌లోని కళాశాలలో శిక్షణ తరగతులు

గురుకుల కొలువులకు సంబంధించి 9 రకాల నోటిఫికేషన్లు జారీ చేయగా... ఇందులో దాదాపు 54 రకాల ఉద్యోగాలున్నాయి. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి జిల్లాల వారీగా ధ్రువపత్రాల పరిశీలన చేపట్టేందుకు ఇప్పటికే బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ధ్రువపత్రాల పరిశీలనను నిశితంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించింది. వీరికి ధ్రువపత్రాల పరిశీలనపై ముందుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పరిశీలనాధికారులకు ఈనెల 28, 29 తేదీల్లో ఎల్బీనగర్‌లోని గురుకుల కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. రెండ్రోజులు శిక్షణలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలనపై అవగాహన కల్పిస్తారు.

వచ్చే నెల నుంచి పరిశీలన మొదలు

మరోవైపు మహిళా రిజర్వేషన్లు, ఒకట్రెండు కేటగిరీల్లోని ఉద్యోగాల విషయంలోని అంశాలు కోర్టు పరిధిలో ఉండగా... వాటికి నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో వచ్చే నెల రెండో వారం కల్లా 1:2 జాబితాలు విడుదల చేసి... ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పత్రాలు విడుదల చేసే హక్కు ఇరువురికీ ఉంది

విలేకరులతో చిట్‌చాట్‌లో గుత్తా



నల్లగొండ: శ్వేతపత్రం విడుదల చేసే హక్కు కాంగ్రెస్‌కు, స్వేదపత్రం విడుదల చేసే హక్కు బీఆర్ఎస్‌కూ ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. ప్రభుత్వం అప్పులు మాత్రమే చూపుతూ ఆస్తులను చూపకపోవడంతో ఆస్తులు, అప్పులను ప్రజలకు తెలిసే విధంగా బీఆర్ఎస్ స్వేద పత్రాన్ని విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత అంతగా లేదని, అలా అని కాంగ్రెస్‌కు కూడా రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు లేవన్నారు. ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత ఉందని కొందరు ఓడిపోతారని అంతా అనుకున్నారుకానీ, కేసీఆర్ ప్రభుత్వమే పడిపోతుందని ఎవరూ ఊహించలేదని చెప్పారు. నూతన ప్రభుత్వానికి ఇంకా రైతు బంధుపై స్పష్టత రాలేదని అనిపిస్తోందన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా అమిత్ పోటీ

అధిష్టానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో ఎక్కడ నుంచి పోటీ చేసేందుకైనా తన తనయుడు అమిత్‌రెడ్డి సిద్ధమే అని గుత్తా పేర్కొన్నారు. భద్రతా లోపం వల్లే పార్లమెంట్‌పై దాడి జరిగిందని, మరోసారి అలాంటివి ఉత్పన్నం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

శ్వేతపత్రం అబద్ధాల పుట్ట

▶ మొదటి పేజీ తరువాయి

నిలిపిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తగ్గిన పేదరికాన్ని చూపించకుండా, అప్పులను రెండింతలు పెంచి చూపిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఇటీవల శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలను ఖండిస్తూ.. బీఆర్ఎస్ రూపొందించిన 'స్వేద పత్రం'ను ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎత్తిచూపేందుకు, వాస్తవాలను ప్రజల ముందు పెట్టేందుకే 'స్వేద పత్రం'ను విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

"అధికార కాంగ్రెస్ శ్వేతపత్రంలో చెప్పిన ప్రకారం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి లోబడి మా ప్రభుత్వ హయంలోని అప్పులు రూ.3,89,673 కోట్లే. అంతకుముందే ఉన్న అప్పులు రూ.72,658 కోట్లుపోగా.. మా ప్రభుత్వం తెచ్చిన అప్పులు రూ.3,17,015 కోట్లే. కానీ వాళ్లు దీనిని రూ.6,71,757 కోట్లుగా చూపారు. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన 'స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)ల'అప్పులు రూ.1,27,208 కోట్లుకాగా, ఎస్పీవీల సొంత రుణాలు రూ.1,18,557 కోట్లు. ప్రభుత్వ హామీ లేని రుణాలు మరో రూ.59,414 కోట్లు. ఈ రూ.3,05,179 కోట్లు సొంత పరపతితో ఆయా సంస్థలు తెచ్చుకున్నవే. అవి ప్రభుత్వ అప్పులు కావు. కానీ మేం తెచ్చిన రూ.3.17 లక్షల కోట్ల అప్పులకు వీటిని కూడా కలిపేసి.. మొత్తం రూ.6,71,757 కోట్ల అప్పుగా చూపారు.

పేదరికం బాగా తగ్గింది

ఎన్ఎఫ్‌హెచ్ఎస్ డాటా ప్రకారం తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో పేదరికం 21.92 శాతం. అది 2023 నాటికి 5.8 శాతానికి తగ్గిపోయింది. దేశంలోని ఇంత వేగంగా పేదరికం తగ్గిన రాష్ట్రం మరొకటి లేదు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. కానీ కేంద్రం ఇవ్వలేదు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

పౌరసరఫరాల సంస్థకు రూ.56వేల కోట్ల అప్పు అవాస్తవం

ప్రభుత్వం శ్వేతపత్రంలో చూపిన లెక్కలు తప్పుల తడక అనడానికి పౌరసరఫరాల సంస్థ అప్పులే ఉదాహరణ. ప్రస్తుతం ఆ సంస్థ ఆధీనంలో ఉన్న ధాన్యాన్ని అమ్మితే రూ.30 వేల కోట్లు వస్తాయి. ఇప్పటికే అమ్మిన ధాన్యానికి ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన మొత్తం రూ.16 వేల కోట్లు. వీటిని లెక్కలోకి తీసుకోకుండా పౌరసరఫరాల సంస్థ అప్పులు రూ.56 వేల కోట్లు అని ప్రభుత్వం చెప్పింది. పౌరసరఫరాల సంస్థ వెబ్‌సైట్‌లోని తాజా లెక్క ప్రకారం ఆ సంస్థ అప్పులు రూ.24,600 కోట్లు మాత్రమే. అలాగే ఆర్టీసీకి వేల కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఆర్టీసీ తన ఆస్తులను తనఖా పెట్టుకొని అప్పు తెచ్చుకుంటే దాన్ని కూడా ప్రభుత్వ అప్పుగా చూపించారు.

రూ.4.98 లక్షల కోట్లు వెచ్చిస్తే ఉద్యమం ఎందుకొచ్చింది?

ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో తెలంగాణ కోసం రూ.4.98 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు శ్వేతపత్రంలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఖర్చును జనాభా ఆధారంగా తెలంగాణ వాటా కింద చూపి తప్పుడు లెక్కలు వేశారు. నిజంగా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కోసం అంత ఖర్చు చేస్తే.. 1969లో, 2001లో తొలి, మలి తెలంగాణ ఉద్యమాలు ఎందుకు వచ్చాయి? ఏ ప్రాంతంలో వచ్చిన ఆదాయాన్ని అక్కడే ఖర్చు చేయాలనే 1956 ఒప్పందానికి భిన్నంగా నాటి పాలకులు తెలంగాణలో వచ్చిన ఆదాయాన్ని ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేశారు. అందుకే ప్రజలు తిరగబడ్డారు. తెలంగాణవాదుల ఆరోపణల్లో నిజానిజాలు తేల్చడానికి నాటి కేంద్ర ప్రభుత్వం పలు కమిటీలు వేసింది. ప్రభుత్వం నియమించిన జస్టిస్ లలిత్‌కుమార్ కమిటీ, జస్టిస్ వశిష్ట భార్గవ కమిటీ రెండూ కూడా తెలంగాణ ఆదాయాన్ని ఆంధ్రాలో వినియోగించారన్న సంగతి నిజమేనని తేల్చాయి. కాబట్టి తెలంగాణలో రూ.4.98 లక్షల కోట్లు ఖర్చు చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తుండటం శుద్ధ అబద్ధం. వాళ్ల లెక్కలే చూసినా.. గత తొమ్మిదిన్నరేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.13,72,930 కోట్లు. అంటే వాళ్లు 60 ఏళ్లలో చేసిన ఖర్చుకు దాదాపు మూడింతల మేర బీఆర్ఎస్ సర్కారు పదేళ్లలోనే ఖర్చు చేసింది.."అని కేటీఆర్ వెల్లడించారు.

అస్తిత్వమే కాదు.. ఆస్తులు సృష్టించాం

తెలంగాణ సిద్ధించిన తర్వాత నాటి పరిస్థితులన్నీ బేరీజు వేసుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ప్రణాళికాబద్ధంగా పాలన సాగించాం. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మేరకు అప్పులు తెచ్చి అన్ని రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు వేల కోట్ల ఆస్తులు సృష్టించాం.

– విద్యుత్ రంగంలో పెట్టిన ఖర్చు రూ.1.37 లక్షల కోట్లు అయితే.. సృష్టించిన ఆస్తుల విలువ రూ.6.87 లక్షల కోట్లు. రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఎన్నికయ్యేదాకా ఆమె సొంత గ్రామంలో విద్యుత్ లేదు. కానీ తెలంగాణలో కరెంటు లేని పల్లె, గూడెం లేవు. వచ్చే ఏడాది నాటికి రాష్ట్రం 26 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యానికి చేరుకుంటుంది.

– సాగునీటి రంగంలో రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశాం. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులు చేశాం. 204 టీఎంసీల రిజర్వాయర్లు నిర్మించాం. కొత్తగా 50 లక్షల ఎకరాలకు సాగునీటితో ఆయకట్టును స్థిరీకరించాం. భూగర్భజలాలు పెరగడం వల్లే పదేళ్లలో బోర్లు కూడా పెరిగాయి.

– కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం. ఒక దగ్గర బ్యారేజీ కుంగితే మొత్తం ప్రాజెక్టునే బద్నాం చేసే ప్రయత్నం చేయొద్దు. పాలమూరు పథకానికి రూ.26,738 కోట్లు వెచ్చించాం.

– తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథకు రూ.37 వేల కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయ రంగంలో 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.36,899 కోట్లు, రుణమాఫీ కోసం రూ.30 వేల కోట్లు, రైతుబంధుకు రూ.75 వేల కోట్లు, రైతుబీమా ప్రీమియం కోసం రూ.6,861 కోట్లు వెచ్చించాం.

– సంక్షేమానికి రూ.2.86 లక్షల కోట్లు, పట్టణ ప్రగతికి రూ.1.21 లక్షల కోట్లు, పల్లెప్రగతికి రూ.70వేల కోట్లు, వైద్యరంగానికి రూ.61,650 కోట్లు, ఆధ్యాత్మిక రంగానికి రూ.2,800 కోట్లు ఖర్చు చేశాం.

– గత తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణలో చేసిన అభివృద్ధితో రూ.50 లక్షల కోట్లపైనే సంపద సృష్టించాం.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాం

ఇవాళ కొందరు నిర్బంధం, నియంతృత్వం అని మాట్లాడుతున్నారు. కానీ ఉద్యమ సమయంలోనే నిర్బంధం ఎదుర్కొన్నాం. నియంత పాలన అంటే సమైక్య పాలకులది. తెలంగాణ ఇస్తే అంధకారమే అని కట్టెలు పట్టుకొని కట్టుకథలు చెప్పినవారు, పెద్దపెద్ద మాటలు మాట్లాడినవారు, వారికి తొత్తులుగా పనిచేసినవారు ఇవాళ శ్వేతపత్రాల పేరుతో తెలంగాణను విఫల ప్రయోగంగా, విఫల రాష్ట్రంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోరాడి తెచ్చిన తెలంగాణకు ఎవరి చేతుల్లో న్యాయం జరుగుతుందని ప్రజలు భావించారో ఆ కేసీఆర్ చేతుల్లోనే పెట్టారు. కేసీఆర్ సీఎంగా బాధ్యలు చేపట్టిననాడు ఎన్నో రకాల ఆర్థిక చిక్కులు, రాజకీయ కుట్రలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు ఒక విఫల ప్రయోగం, ఇదో విఫల రాష్ట్రమని నిరూపించే కుట్రలు జరిగాయి. విద్యుత్, తాగు, సాగునీటి సమస్యలు ముసురుకుని ఉన్నాయి. కొందరు ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నాలు జరిగాయి. కానీ అన్నింటినీ తట్టుకుని తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం జరిగింది. పటిష్ట ఆర్థిక క్రమశిక్షణతో ప్రణాళికలు రూపొందించుకొన్నాం. బిహార్‌లో ఉండే తెలంగాణ బిడ్డ జీఆర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా, కోలిండియా సీఎండీగా ఉన్న నర్సింగరావును సీఎం కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పెట్టుకొన్నాం. క్రమశిక్షణతో పరిపాలన సంస్కరణలకు పెద్దపీట వేస్తూ ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లాం. రాష్ట్ర తలసరి ఆదాయంలో, జీఎస్‌డీపీలో అనూహ్య ప్రగతి సాధించాం. అప్పులు కాదు.. వెలకట్టలేని ఆస్తులు సాధించాం.

సెట్స్‌పై స్పష్టత దిశగా..

- ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై వచ్చే వారం ప్రకటన
- ఆ మేరకు అధికారులు సన్నాహాలు
- విద్యారంగంపై త్వరలోనే సీఎం సమీక్ష?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిధిలోని ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్)పై త్వరలోనే స్పష్టత రానుంది. ఇప్పటికే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతాధికారులు సమీక్ష చేపట్టి వివిధ రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణపై ఓ నివేదిక రూపొందించారు. సెట్స్‌కు కన్వీనర్లను నియమించే అంశాన్ని, ఏ పరీక్ష ఏ యూనివర్సిటీకి ఇవ్వాలనే దానిపై ప్రాథమిక అవగాహనకు వచ్చారు. వాస్తవానికి డిసెంబర్ చివరి నాటికే ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ప్రభుత్వం తొలగించడం, ఇంకా కొత్తవారి నియామకం జరగకపోవడంతో విశ్వవిద్యాల యాల అధికారులు సెట్స్‌పై తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

ఎంసెట్‌పై ప్రత్యేక దృష్టి: ఉన్నత విద్య పరిధిలో ఎంసెట్ ప్రధానమైంది. ఆ తర్వాత ఎడ్‌సెట్, ఐసెట్, ఈసెట్, లాసెట్ ఇలా అనేక ప్రవేశ పరీక్షలుంటాయి. ఎంసెట్ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. ఎంసెట్ షెడ్యూల్‌ను ఖరారు చేసిన తర్వాత యూనివర్సిటీలు కాలేజీల అనుబంధ గుర్తింపుపై దృష్టి పెడతాయి. కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ వంటి అంశాలను పరిశీలిస్తాయి. గతంలో ఈ ప్రక్రియ ఆలస్యమవ్వడం వల్ల కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇది అనేక ఇబ్బందులకు దారి తీస్తోంది. జేఈఈ కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే ఆఖరి దశ కౌన్సెలింగ్ చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత వరకూ మే మొదటి వారంలోనూ ఎంసెట్ నిర్వహణ పూర్తి చేయాలని, సరిగ్గా 15 రోజుల్లో ఫలితాలు వెల్లడించాలనే యోచనలో ఉన్నారు.

ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణలోనే...

ఉన్నత విద్యా మండలి చైర్మన్, సభ్యుల నియామకానికి మరికొంత సమయం పట్టే అవకాశం కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఎంసెట్, ఇతర సెట్స్‌పై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రభుత్వం నుంచి సంకేతాలు వచ్చాయి. పరీక్షల నాటికి నియామకాలు జరుగుతాయనీ, అప్పటి వరకూ నిర్ణయాలన్నీ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణలో ఉంటాయని ప్రభుత్వవర్గాలు స్పష్టం చేశాయి. కాగా, త్వరలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే వీలుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే అధికారులు శాఖాపరమైన పూర్తి సమాచారంతో సిద్ధమయ్యారు. సీఎం సమీక్షా సమావేశంలో సెట్స్‌పై స్పష్టత వస్తుందనీ, వచ్చే వారంలో సెట్స్ తేదీలను ప్రకటించే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

రవాణాశాఖ కమిషనర్‌గా జ్యోతి బుద్ధప్రకాశ్

- ఎక్సైజ్‌కు ఈ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖకు నర్సింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ ముగిసిన వెంటనే ఆరుగురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను రవాణాశాఖ కమిషనర్‌గా బదిలీ చేయగా, గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఈ.శ్రీధర్‌ను ఎక్సైజ్ కమిషనర్‌గా నియమించింది. ఆయనకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్ఐఐసీ) వైస్ చైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టును అదనంగా అప్పగించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్‌ను పౌర సరఫరాల బాధ్యతల నుంచి తప్పించింది. ఆ స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేందర్‌సింగ్ చౌహాన్‌ను నియమించింది. మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రుకు రంగారెడ్డి కలెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న శృతి ఓజాను ఇంటర్‌విద్య కార్యదర్శిగా, ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటివరకు ఆ బాధ్యతలను సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ అదనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టియానా జెడ్ చొంగ్తు స్థానంలో ఈవీ నర్సింహారెడ్డిని డైరెక్టర్‌గా నియమించింది.



లిఫ్ట్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్యే లాస్య నందిత

ఎమ్మెల్యే లాస్యకు తప్పిన ముప్పు

- ఆస్పత్రి లిఫ్ట్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్యే
- పరిమితికి మించడంతో కూలిన లిఫ్ట్
- క్షేమంగా బయటికి తీసుకొచ్చిన సిబ్బంది

కంటోన్మెంట్ (హైదరాబాద్): ఎమ్మెల్యే జి.లాస్య నందితకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బోయిన్‌పల్లిలో ఆదివారం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. తక్షణమే స్పందించిన ఆసుపత్రి సిబ్బంది, ఎమ్మెల్యే అనుచరులు లిఫ్ట్ తలుపును తెరిచి ఆమెను బయటకు క్షేమంగా తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవలే ఆధునీకరించిన బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆసుపత్రిలోని నూతన విభాగాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.లాస్య నందిత హాజరయ్యారు. ఈ మేరకు ఆసుపత్రిలోని నాలుగో అంతస్తులోకి వెళ్లేందుకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో లిఫ్ట్ ఎక్కారు. ఆమెతో పాటు అనుచరులు పెద్ద సంఖ్యలో లిఫ్ట్ ఎక్కారు. పరిమితికి మించి లిఫ్ట్‌లోకి ఎక్కడంతో అది అదుపు తప్పి ఒక్కసారిగా సెల్లార్‌లోకి పడిపోయింది. ఎమ్మెల్యే సహా లిఫ్ట్‌లోని వారి హాహాకారాలు విన్న ఆసుపత్రి సిబ్బంది హుటాహుటిన సెల్లార్‌లోకి పరుగెత్తారు. లిఫ్ట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో సెల్లార్‌లోని వంట సామగ్రితో లిఫ్ట్ తలుపును ధ్వంసం చేసి అందులో చిక్కుకుపోయిన ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులను బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగారు. ఆమె సోదరి నివేదిత ఆసుపత్రి నూతన విభాగాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

6 గ్యారంటీలకు తెల్ల కార్డే కీలకం

- త్వరలో ధరణి ప్రక్షాళన...
- కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- మీడియా సమావేశంలో వెల్లడించిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీల కింద లబ్ధి దారుల ఎంపికకు అర్హతగా తెల్లరేషన్‌కార్డును ప్రామాణికం(థంబ్‌రూల్)గా పెట్టుకుంది. 'ప్రజాపాలన'పేరుతో కార్యక్రమం నిర్వహించి ప్రజల గుమ్మం దగ్గరే గార్యంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర కేబినెట్ మంత్రులతో కలిసి ఆదివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయ మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆ వివరాలు వెల్లడించారు. గార్యంటీలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను 28వ తేదీకి ముందే స్థానిక అధికారులు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. తక్కువ సమయం ఉందని, రద్దీ ఎక్కువగా ఉందని, దరఖాస్తు ఇవ్వలేదని ఆందోళన అక్కర్లేదన్నారు. అందరి దరఖాస్తులను ప్రభుత్వం చిత్తశుద్ధితో తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు.

వన్‌సైడ్ బ్యాటింగ్ చేయం.. సలహాలు స్వేచ్ఛగా ఇవ్వండి

ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలో అన్న అంశంపై వారి ఆలోచనలు, అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకున్నారని పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం తరహాలో వన్‌సైడ్ బ్యాటింగ్ చేయమని, ఏదైనా ఇబ్బందులు, సలహాలుంటే స్వేచ్ఛగా తెలియజేయాలని కలెక్టర్లు, ఎస్పీలను కోరినట్టు చెప్పారు. అధికారులు కూడా మంచి సలహాలు ఇచ్చారన్నారు. ఈ ప్రభుత్వానికి కళ్లు, చెవులు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులే అని స్పష్టం చేశామన్నారు. విద్య వైద్యం, ఇతర రంగాల్లో ప్రభుత్వ ఆలోచనలను, విధానాలను వారికి వివరించామన్నారు. చాలా సౌకర్యవంతంగా అధికారులు ఫీల్ అయ్యారని, ప్రజల కోసం ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందో అర్థం చేసుకున్నారన్నారు. వ్యక్తులు, వ్యవస్థల పట్ల కక్షపూరితంగా వ్యవహరించమని, తప్పు చేస్తే ఎంత పెద్ద వారినైనా ఉపేక్షించేది ఉండదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం కబ్జా చేసిన భూములను ప్రజలకు పంచిపెడతాం

ధరణి పోర్టల్‌ను అడ్డంపెట్టుకుని గత ప్రభుత్వంలోని పెద్దలు, తొత్తులు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, ఇంకా కొన్ని భూములకు సంబంధించిన ఫైల్స్ సర్క్యులేషన్‌లో ఉన్నాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. ధరణిలో ఒకటే కాలమ్ ఇచ్చారని, ఒక సారి కలెక్టర్/ సీసీఎల్ఏ లాగిన్ అయితే పోర్టల్‌లో ఐటం కనబడదన్నారు. "ధరణి పోర్టల్ ప్రక్షాళన చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించడంతో పాటు గత ప్రభుత్వం కబ్జా చేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచిపెడ్తాం. ధరణిలో తప్పులను సరిదిద్ది సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. ఆరు గ్యారంటీలతో పాటు ధరణిపై కసరత్తు ప్రారంభించాం.. స్పష్టత వచ్చాక ప్రక్షాళన చేస్తాం. అన్ని ఆధారాలతో ఒక రోజు ధరణిపై మీడియా ముందుకు వస్తాం"అని పొంగులేటి ప్రకటించారు.





అందమైన పిల్లులు..ఆకర్షణీయమైన పెట్ డాగ్స్... పాములు, మకావా పక్షులు, వింత వింత జంతువులతో కొలువుదీరిన పెట్ కార్నివాల్ అలరించింది. తెలంగాణ కెనైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన ఈ కార్నివాల్‌ను ఆదివారం పెద్ద ఎత్తున పిల్లలు, పెద్దలు సందర్శించారు. అరుదైన జంతువులను చూసి మురిసిపోయారు. ముఖ్యంగా వివిధ వేషధారణలో ఉన్న పిల్లులు, పెట్ డాగ్స్ చిన్నారులను ఆకర్షించాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.
పాపులారా! మీ చేతులను శుభ్రము చేసికొనుడి;
ద్విమనస్కులారా! మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి.
– క్రైస్తవ ధర్మం

సాక్షి
సోమవారం, 25 డిసెంబర్ 2023

సినిమా రక్తం

'టప్'మంటూ లైట్ వెలుగుతుంది. ఆగంతకుడు ఛాతీ మీద రక్తంతో నేలకొరిగి ఉంటాడు. హీరోయినో, హీరో చెల్లెలో 'కెవ్వు'మని నోటికి చెయ్యడ్డం పెట్టుకుంటూ కేక వేసి 'రక్తం... రక్తం' అని పరిగెడుతుంది. లేదా స్పృహ తప్పి పడిపోతుంది. అందరూ చేరుతారు. పోలీసులు వస్తారు. రక్తం బయటకు వస్తే రక్తం బయటకు రావడానికి కారకులను పట్టుకోవాలి. శిక్షించాలి. అది చట్టం. సమాజానికి వహించవలసిన బాధ్యత. అక్కడి నుంచి సినిమా కథంతా నడుస్తుంది. బ్లాక్ అండ్ వైట్ సినిమాలో రక్తం నల్లగా ఉంటుంది. పైగా కొంచెమే కనిపిస్తుంది. అయినా సరే డైరెక్టర్‌గాని, సినిమా రచయితగాని, హీరోగాని హంతకుణ్ణి క్లయిమాక్స్‌లో పోలీసులకు అప్పజెప్పకుండా ఊరుకునేవారు కాదు.

హిందీలో 'దుష్మన్' అనే సినిమా పెద్ద హిట్. రాజేష్‌ఖన్నా హీరో. లారీ డ్రైవర్. నిర్లక్ష్యంగా లారీ నడిపి గొడ్లు కాచే వ్యక్తి చావుకు కారణం అవుతాడు. జడ్జిగారు అతణ్ణి జైల్లో మగ్గమని తీర్పు చెప్పకుండా, ఏ వ్యక్తి చావుకైతే కారణమయ్యాడో ఆ వ్యక్తి ఊరికెళ్లి, అతడి పొలం పండించి, పిల్లల, ముసలి తల్లిదండ్రుల బాగోగులు చూడమని ఆదేశిస్తాడు. రాజేష్ ఖన్నా ముందు నిరాకరించినా కాలక్రమంలో పరివర్తన చెందుతాడు. ఊరికి ఇలవేల్పుగా మారి క్షమార్హుడవుతాడు. టైరుకు అంటిన రక్తం ఒక మనిషిని చేర్చాల్సిన గమ్యం అది. ఈ సినిమాను తెలుగులో 'ఖైదీ బాబాయ్'గా తీస్తే హిట్ అయ్యింది. ఇదే రాజేష్ ఖన్నా 'రోటీ'లో ఒక వ్యక్తి అకారణ చావుకు కారణమై పశ్చాత్తాపం చెందడమే కథ. గతంలో అలా ఉండేది. హీరో నేరం చేస్తే పశ్చాత్తాపం చెందేవాడు. ప్రాయశ్చిత్తం చేసుకునేవాడు. తప్పు దారి పట్టి ఏ దొంగో, స్మగ్లరో, హంతకుడో అయితే క్లయిమాక్స్‌లో మరణించేవాడు. జైలుకు వెళ్లేవాడు. అట్టి హీరోకు హీరోయిన్ దక్కే అవకాశం లేదు. పోలీస్‌జీపులో వెళ్లిపోతున్న హీరోని గుడ్ల నీరు కక్కుకుంటూ చూడాల్సిందే. 'దీవార్'లో అమితాబ్ చచ్చిపోతాడు. 'ఖైదీ'లో చిరంజీవి జైలుకెళ్లిపోతాడు.

'మల్లీశ్వరి', 'బంగారు పాప' వంటి క్లాసిక్స్ తీసిన బి.ఎన్.రెడ్డి కాసింత కత్తి యుద్ధాలు వగైరా ఉండే 'రాజమకుటం' తీస్తే 'ఈయనకేం పోయేకాలం వచ్చింది' అన్నారట ప్రేక్షకులు హిట్ చేస్తూ కూడా! 'తమరు కూడా రక్తపాతం తీయాలా మహాశయా' అన్నారట సినిమా మిత్రులు. ఆయన బాధపడి, ఇదేదో చెడ్డపేరు వచ్చేలా ఉందని తర్వాత అలాంటి సినిమాల జోలికి పోలేదు. సృజించబడే కళ, సృజిస్తున్న కళాకారుడు వేరువేరు కాదు అనుకునేవారు పూర్వం. కళాకారుడి వ్యక్తిత్వమే కళ వ్యక్తిత్వంగా జనం గుర్తించే వారు. దర్శకులుగాని, హీరోలుగాని తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ వస్తే తలవంపులుగా భావించేవారు. 'ఏ సర్టిఫికెట్ వచ్చిందట' అనేది పెద్ద వార్త.

ఎన్.టి.రామారావు 'బొబ్బిలిపులి'లో హింస ఎక్కువైందని సెన్సార్ వారు పేచీ పెట్టారు. కారణం హీరోయే దుర్మార్గులను తుదముట్టిస్తున్నాడు. స్వీయకోర్టు నిర్వహిస్తున్నాడు. రక్తపాతం సృష్టిస్తున్నాడు. దాసరి దర్శకత్వం వహించిన 'తాండ్ర పాపారాయుడు' చారిత్రక చిత్రమే అయినా, బొబ్బిలి యుద్ధమే కథాంశమైనా రక్తం ఎక్కువ కనిపిస్తున్నదని కొన్ని కట్స్ చెప్పారు. 1990ల ముందు వరకూ రక్తం ఎక్కువ కనిపించరాదనే సెన్సార్ నియమం ఉండేది. అంతెందుకు? చచ్చీ చెడీ 'షోలే' సినిమాను తయారు చేసి సెన్సార్‌కు పంపితే క్లయిమాక్స్‌లో సంజీవ్ కుమార్ గబ్బర్ సింగ్‌ను ఎలా చంపుతాడు... సెన్సార్ ఇవ్వం అని గట్టిగా చెప్పారు అధికారులు. దాంతో క్లయిమాక్స్ రీషూట్ చేసి గబ్బర్‌ను పోలీసులకు అప్పజెప్పడం చూపారు. చెడ్డపాత్రలు ఎంత మందినైనా చంపొచ్చు. మంచిపాత్రలు చంపుతూ పోతే సమాజం ఏం నేర్చుకోవాలి? సమాజం మీద ఏర్పడే ప్రభావం ఎట్టిది?

రామ్‌గోపాల్ వర్మ వచ్చి 'శివ' సినిమాతో రక్తపాతాన్ని పెంచాడనే విమర్శలు వచ్చాయి గాని, సినీ హింసలో 'శివ' నేడొక చిన్నగీత. కాలం మారింది. 'మనుషులను చంపుకుంటూ వెళితే ఎవరూ మిగలరు' అని అంటూనే చాలామందిని చంపుకుంటూ వెళ్లడమే హీరోయిజం అయ్యింది. 'ఒక్కొక్కరిని కాదు షేర్‌ఖాన్... వందమందిని పంపు' అని కత్తికొక కండగా నరుకుతుంటే రక్తం ఎగజిమ్మేకొద్దీ కలెక్షన్లు వచ్చిపడ్డాయి. సినిమా ఒప్పుకున్న హీరో కాస్ట్యూమ్స్‌తోపాటు డైరెక్టర్, ఆర్ట్ డైరెక్టర్లతో కూర్చొని పోస్టర్‌లో మెరిసే సరికొత్త మారణాయుధాన్ని తయారు చేయించుకుంటున్నాడు. చాలక భారీ మిషన్‌గన్‌లను కూడా తయారు చేయించుకుంటున్నాడు. పేలుస్తున్నాడు. హీరో ఇంతమందిని చంపుతున్నా సినిమా పోలీసులు ఏమవుతున్నారో ఎందుకు కానరావడం లేదో వారిపైన ఏ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలో తెలియని అయోమయ స్థితి.

రక్తం మనిషికి జీవధార. చాలా ప్రమాదాల్లో, దాడుల్లో మనుషులు చనిపోయేది ప్రమాద తీవ్రత వల్ల కాదు. రక్తం పోయి. రక్తం అందక. ధర్మరాజు రక్తమే కాదు, ఏ అమాయకుడి నెత్తురు నేల మీద పడ్డా... ఆ నేలకు అది శుభసూచకం కాదు. రక్తాన్ని చూసి చలించని, రక్తాన్ని చూడటం అలవాటుగా మారిన సమాజం మానవీయంగా మనజాలదు. ఎన్ని బ్లడ్‌బ్యాంకులు పెట్టినా చాలనంత రక్తాన్ని ఇవాళ హీరోలు తెరల మీద పారిస్తూ ఉంటే... స్వయంగా కత్తి పట్టి క్రూరంగా గొంతులు కోస్తూ ఉంటే, ఈలలు వేస్తూ గోలలు చేస్తున్న మన ఇంటి పిల్లల్ని మనం ఎలా తయారు చేశామో తల్లిదండ్రులు ఆలోచించాలి.

సినిమా అయినా, సాహిత్యమైనా జంతువును మనిషిగా చేయాలి. మనిషిని జంతువుగా కాదు! కమర్షియల్ కళకు కూడా ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దును సినిమావారు గుర్తెరిగితే మంచిది. లేదంటే ప్రేక్షకులే ఏదో ఒకనాడు గుర్తు చేస్తారు. ఫస్ట్‌హాఫ్‌లో కాకపోతే సెకండ్ హాఫ్‌లో! ఏ సినిమాకైనా 'ది ఎండ్' పడవలసిందే కదా!!

ఇక్కడ ముస్లిమ్ కావడం నేరమా?

కామెంట్



కరణ్ థాపర్

భారత రాజ్యాంగం భారతదేశాన్ని లౌకికరాజ్యంగా నిర్వచించింది. అందులోని లౌకిక భావానికి తీవ్రమైన సవాలుగా పరిణమిస్తున్న ఘటనలు నేడు దేశంలో అనేకచోట్ల సంభవిస్తున్నాయి. అధిక సంఖ్యాకుల ప్రాధాన్యాలకు కట్టుబడి అల్పసంఖ్యాకులు, ముఖ్యంగా ముస్లింలు జీవించక తప్పదనే వాస్తవాన్ని పాలనాపరమైన నిర్ణయాలు బలపరుస్తున్నాయి. దీనివల్ల 'అధిక సంఖ్యాకుల దేశంలో అల్పసంఖ్యాకులుగా ఉండటం అనేది ఎలాంటిది?' అనే ప్రశ్న రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, ఆ ప్రశ్న అడిగే భారతీయుల సంఖ్య నానాటికీ ఎక్కువవుతుండటం గురించే మనం ఆందోళన చెందాలి. ఆఖరికి, ఉనికి వంటి అతి ముఖ్యమైన గుర్తింపు నిరాకరణకు కూడా ఒక వర్గాన్ని గురి చేయడం సమ్మతం అవుతుందా?

వాదనలకిది తావులేని ప్రశ్న కాకున్నా, ''భారతదేశంలో ముస్లింగా ఉండటం ఎలాంటిది?'' అని మనం ఎక్కువగా అడుగుతుండటాన్ని అత్యంత దురదృష్టకరమైన అభియోగాలలో ఒకటిగా నేడు మనదేశం ఎదుర్కొంటూ ఉంది. ''భారతదేశంలో ముస్లింగా ఉండటమన్నది ఎలాంటిది?'' అనే ఈ ప్రశ్నకు జవాబు – ఒక హిందువు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ లేదా నాస్తికుడిగా ఉండటం ఎలాంటిది అనే ప్రశ్నకు వచ్చే సమాధానానికి భిన్నంగా ఏమీ ఉండనవసరం లేదు. కానీ ఉంటోంది! అలా ఎందుకు ఉంటున్నదో... జియా ఉస్ సలామ్ తాజా పుస్తకం 'బీయింగ్ ముస్లిం ఇన్ హిందూ ఇండియా: ఎ క్రిటికల్ వ్యూ'... కలవరపాటును కలిగించే వివరాలతో విశదీకరిస్తోంది.

కాస్త వెనక్కెళ్లి ముందుకొస్తాను. కానీ ఒకటి గుర్తుంచుకోవాలి. గత దశాబ్ద కాలంలో పరిస్థితి ఇంతని అంతని చెప్పలేనంతగా దిగజారిపోయింది. దేశంలో ముస్లింల జనాభా 15 శాతం. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో వారి వాటా కేవలం 4.9 శాతం. పారామిలిటరీ సైనిక దళాల్లో 4.6 శాతం. ఐయ్యేఎస్‌లు, ఐఎఫ్ఎస్‌లు, ఐపీఎస్‌లలో 3.2 శాతం. సైన్యంలో బహుశా తక్కువలో తక్కువగా 1 శాతం. 2006 సచార్ కమిటీ నివేదిక ప్రకారం... ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా షెడ్యూల్డు కులాలు, తెగల కంటే కూడా మరీ అధ్వాన్నమైన జీవన స్థితిగతులలో ఉన్నారన్నది మనకు తెలిసిన విషయమే.

రాజకీయాలలో సైతం, ఒకప్పుడు వారి స్వరం వినిపించిన చోట ఇప్పుడది క్షీణిస్తూ ఉండటం మాత్రమే కాదు, కొన్ని చోట్ల వెనక్కు మళ్లుతూ కూడా ఉంది. దామాషా ప్రకారం ముస్లింలకు లోక్‌సభలో 74 సీట్లు ఉండాలి. కానీ ఉన్నది 27 మంది. మన 28 రాష్ట్రాలలో ఒక్క రాష్ట్రానికి కూడా ముస్లిం ముఖ్యమంత్రి లేరు. 15 రాష్ట్రాలలో ముస్లిం ఎంపీలే లేరు. 10 రాష్ట్రాలలో మాత్రమే మైనారిటీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఒక ముస్లిం ఉన్నారు. అదేమీ విశేషం కాదు కదా!

నిజానికి ఏ పార్టీ కూడా భారతీయ జనతాపార్టీ అంత కరాఖండిగా ముస్లింలకు ముఖం చాటేయలేదు. 2014లో గానీ, 2019లో గానీ బీజేపీ ఒక్క ముస్లింను కూడా లోక్‌సభ ఎంపీగా ఎన్నికలకు ఎంపిక చేసుకోలేదు. నేటికీ ఆ పార్టీ కనీసం రాజ్యసభకు ఎంచుకున్న ముస్లిం ఎంపీ ఒక్కరు కూడా లేరు. కర్ణాటకలో 14 శాతం మంది, ఉత్తర ప్రదేశ్‌లో 19 శాతం మంది ముస్లింలు ఉన్నప్పటికీ బీజేపీకి ఆ రాష్ట్రాలలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేరు. గుజరాత్‌లో 1998 నుండి ఏ లోక్‌సభకు, లేదా ఏ విధాన సభకు కూడా ముస్లిం అభ్యర్థిని నిలబెట్టలేదు. అంతెందుకు, గత ఏప్రిల్‌లో కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి కె.ఎస్. ఈశ్వరప్ప బీజేపీకి ముస్లింల ఓట్లే అవసరం లేదన్నారు.





పాలకపక్ష నాయకులు, వారి సన్నిహిత మద్దతుదారులు ముస్లింల గురించి ఏదైతే మాట్లాడుతుంటారో ఆ ప్రకారం ముస్లింల పరిస్థితి మన దేశంలో దిగజారిపోతూ ఉంటుంది. వారిని 'బాబర్ కీ ఔలాద్' (బాబర్ సంతానం) అంటుంటారు. 'అబ్బా జాన్'లు అంటూ అవహేళన చేస్తుంటారు. 'పాకిస్తాన్‌కు వెళ్లిపొండి' అని పదే పదే చెబుతుంటారు. వారి ఊచకోతకు పిలుపు అందినప్పుడు – అయితే గియితే, కొన్ని బీజేపీ గొంతులు ఆ పిలుపును ఖండిస్తూ మాట్లాడతాయి. వారు అల్లర్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తే నేర నిర్ధారణ కాకముందే వారి ఇళ్లు నేలమట్టం అవుతాయి. తరచూ వారు లవ్ జిహాద్, పశువుల అక్రమ రవాణా ఆరోపణలతో హత్యకు గురవుతుంటారు.

2019 జూన్‌లో జార్ఖండ్‌లో ఒక ముస్లిం వ్యక్తికి ఏం జరిగిందనే దాని గురించి జియా ఉస్ సలామ్ పుస్తకం నుంచి నేనొక ఉదాహరణ ఇస్తాను. ఏదో ఒక ఉదంతాన్ని ప్రత్యేకంగా పేర్కొనడం ముస్లింలపై కనబరుస్తున్న అసహనాన్ని వేలెత్తి చూపడం కోసమేనని అనిపించవచ్చు కానీ, అటువంటి అనేక ఘటనలకు ఇదొక దృష్టాంతం. ''విధ్వంసకరమైన ఆ హింసాత్మక సమూహం... అతడిని దీపస్తంభానికి కట్టివేసి ఇనుప కడ్డీలు మొదలు... కర్రలు, టైర్లు, బెల్టుల వరకు... చేతిలో ఏది ఉంటే అది తీసుకుని చావబాదింది. ఆ వ్యక్తి తల, చేతులు, ముఖం రక్తం ఓడుతున్నాయి. అతని కాళ్లు వాచిపోయాయి. చాలాచోట్ల ఎముకలు విరిగిపోయాయి. ఆ దెబ్బలకు నిలబడలేక మనిషి కూలిపోయాడు. అతడు చేసిన నేరం ఏమిటి? నేటి కొత్త భారతదేశంలో అతడొక ముస్లిం అవడమేనా?''

ఇదేమీ నూటికో కోటికో ఒకటిగా జరిగిన ఘటన కాదని పుస్తకంలో జియా పొందుపరిచిన వాస్తవాలు సూచిస్తున్నాయి. ''ముస్లింలపై ఇటువంటి ద్వేషపూరితమైన నేరాలు 2014–2017 మధ్య కాలంలో 30 శాతం పెరిగాయి. అనంతరం, 2019లో మోదీ రెండోసారి ప్రధానమంత్రి అయ్యాక లెక్కకు మిక్కిలిగా పెరిగిపోయాయి. మతవిద్వేష నేరాలు రెట్టింపు అయ్యాయి.

ఉనికి వంటి అతి ముఖ్యమైన గుర్తింపు నిరాకరణకు కూడా ముస్లింలు గురయ్యారు. ఆరెస్సెస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్... ''ప్రతి భారతీయుడూ హిందువే'' అని అన్నారు. ఈ మాటను ముస్లింలు మాత్రమే కాదు, సిక్కులు కూడా సమ్మతించరు. అయినప్పటికీ ఆయన మరికాస్త ముందుకు వెళ్లి... ''ఈ రోజున భారత దేశంలో ఉన్నవారంతా హైందవ సంస్కృతికి, హిందూ పూర్వీకులకు, హిందూ భూభాగానికి చెందినవారు. ఇందులో రెండో మాటే లేదు'' అన్నారు.

''భారతదేశంలో ముస్లింగా ఉండటం ఎలాంటిది?'' అనే ప్రశ్నకు వచ్చే సమాధానం ఎందుకని మన దేశ సమగ్రతకూ, భవిష్యత్తుకూ ముప్పు కలిగించేలా ఉంటుందో వివరించేందుకు చాలినంతగా చెప్పాననే నేను భావిస్తున్నాను. ఇది చాలా స్పష్టమైన సమాధానమని నేను చెప్పగలను. కానీ ఈ సమాధానం మన ముస్లిం సోదరులకు, సోదరీ మణులకు ఎలా అనిపిస్తుందో ఒక్కక్షణం ఆలోచించండి. తక్కిన మనందరికీ ఇది మనదికాని సమస్యపై ఒక విశ్లేషణ. వారికి మాత్రం వారి జీవన్మరణ సమస్య. సమస్య గురించి మనం ఆశాజనకమైన రీతిలో లోతుగా ఆలోచిస్తాం. కానీ వారు ఆ పరిస్థితిలో జీవిస్తారు. అది మరింత దారుణంగా తయారవదు కదా అని బిక్కుబిక్కుమంటుంటారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఎండినదే నింపుతుంది!

రుతువులతో ముడిపడిన సంప్రదాయ ఆహార అలవాట్ల పరంగా చూస్తే – చారిత్రకంగా విస్మృత వర్గాలు ఆర్థికంగానే కాక అనేక సవాళ్లు ఎదుర్కొంటూ ఉంటాయి. కాబట్టి ఎండబెట్టిన మాంసం అనేది మంచి ఎంపిక అవుతుంది. అది మన్నిక కాలాన్ని పెంచుతుంది. ఆహార భద్రతను కల్పిస్తుంది.

– సదాఫ్ హుస్సేన్, షెఫ్



నో మాస్టర్?

2016లో యేల్, హార్వర్డ్ యూనివర్సిటీలు రెండూ 'మాస్టర్' అనే పదాన్ని పక్కనపెట్టాయి. ఆ శబ్దంలోని 'అండర్‌టోన్'(తక్కువతనం) వల్ల. బదులుగా యేల్ 'హెడ్ ఆఫ్ కాలేజ్', హార్వర్డ్ 'ఫ్యాకల్టీ డీన్' అనే మాటల్ని వాడుతున్నాయి. కానీ ఆసక్తికరమైన విషయం ఏమంటే, రెండింట్లోనూ మాస్టర్స్ డిగ్రీలు ఇంకా కొనసాగుతున్నాయి.

– రాబ్ హెండెర్‌సన్, నటుడు



భిన్న భారతం

మా అమ్మ మరాఠా. మా నాన్న కేరళ రోమన్ కేథలిక్. నేను ముంబయిలో పుట్టాను. చెన్నైలో పెరిగాను. ఎక్కువ కాలం పశ్చిమ బెంగాల్‌లో గడిపాను. నా భార్యది డెహ్రాడూన్ (ఘఢ్‌వాల్ బ్రాహ్మణ్). మాకు కాబోయే కోడలు మార్వాడీ. కాబోయే అల్లుడు సింధీ. నేను హిందీ, మలయాళం, ఇంగ్లీష్, మరాఠీ ధారాళంగా; బెంగాలీ, పంజాబీ, కన్నడ, తెలుగు కొద్దిగా మాట్లాడతాను; తమిళంలో ఆలోచిస్తాను.

– ఎం.జె. అగస్టిన్ వినోద్, గ్రూప్ కెప్టెన్ (రిటైర్డ్)



ఎవరికి చెప్పుకోను?

పుణె వెళ్తున్న స్లీపర్ బస్సులో ఇద్దరు పిల్లలు పదేపదే పరుగెత్తుతున్నారు. నేను ఆఫీసులో అలసిపోయినందువల్ల ప్రశాంతంగా నిద్రపోవాలనుకున్నాను. కానీ ఈ పిల్లలేమో అరుస్తున్నారు, నవ్వుతున్నారు, బస్సులో బీభత్సం సృష్టిస్తున్నారు. వీళ్ల మీద ఎవరికైనా ఫిర్యాదు చేద్దామని చూస్తే... వాళ్లు నా పిల్లలే!

– కస్తూరీ సనప్, ఆర్థికాంశాల సలహాదారు



మళ్లీ కోలుకుంటుందా?

నాకు మొదటి నుంచీ అనుమానాలు ఎక్కువే. కానీ కోవిడ్ దాదాపుగా ప్రతిదాని పట్ల నా విశ్వాసాన్ని దెబ్బకొట్టింది. యావత్ సమాజం ఒక్కసారిగా తన వివేకాన్ని కోల్పోయింది. ఇప్పటికి కూడా అది కోలుకోలేదు.

– టోబీ రోజర్స్, పరిశోధకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విలువల శిఖరం

సందర్భం




నందిరాజు రాధాకృష్ణ

కవి, గాయకుడు, ద్రష్ట, మేధావి, భాషా ప్రవీణుడు, సంఘ్ కార్యకర్త, సాత్వికుడు, సంస్కృతీ సంప్రదాయ విలువలకు పట్టం కట్టిన రాజకీయ వేత్త, పాలక పక్షం ప్రశంసలందుకున్న ప్రతిపక్ష నేత, ముమ్మారు ప్రధాని... అన్నీ కలగలిపిన ఒక అరుదైన రాజనీతిజ్ఞుడు అటల్ బిహారి వాజ్‌పేయి! 1967 ఎన్నికల్లో 'భారతీయ జనసంఘ్' అభ్యర్థులకు ప్రచారం చేసే క్రమంలో ఆయనకు అతి దగ్గరగా కూర్చున్న అదృష్టం నాది.

పాత్రికేయంలో ప్రవేశించిన తరువాత విజయవాడ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో బహిరంగ సభలో ప్రసంగాన్ని వార్తగా మలచాను. ఖమ్మం పర్యటన సందర్భంగా ముందుగానే బీజేపీ నాయకులు దారపునేని కోటేశ్వర రావు, డాక్టర్ జయచంద్రారెడ్డి, మురళీధర్‌ల సహకారంతో ప్రత్యేక ఇంటర్వ్యూ కోసం అనుమతి పొంది గంటసేపు భేటీ అయ్యే అవకాశం చిక్కింది. ప్రభుత్వ అతిథి గృహంలో ఆయనతో సంభాషించి ప్రత్యేక ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆయన, నేను, దారపునేని మాత్రమే ఉన్నాం.

ఆయన హిందీలో మొదలెట్టేసరికి. కళ్ళు తేలేసి దారపునేని గారి వైపు చూశాను. ఆయన జోక్యం చేసుకుని 'వీరికి హిందీ రాదు, ఇంగ్లీష్‌లో మొదలెట్టండి' అనగానే ఆశ్చర్యంతో చూసి, 'పాత్రికేయులు, చదువుకున్నవారు, హైదరాబాద్‌లో పని చేశారు.. హిందీ రాదా? మీ స్వస్థలం తమిళనాడా! వారు హిందీ ఇష్టపడరులే' అన్నారు. నేను 'తెలుగు, ఇంగ్లీష్‌లో మాత్రమే రాయగలను, మాట్లాడగలను' అన్నాను. 'సంస్కృతం చదువుకున్నారా' అని అడిగారు. తల అడ్డంగా ఊపాను. నవ్వేశారు. 'మిమ్మల్ని ఆర్నెల్లపాటు ఢిల్లీ తీసుకెళ్ళాల్సిందే అయితే' అని చమత్కరించారు. ఇంటర్వ్యూ ఇంగ్లీష్‌లో సాగింది. నేను రాసుకుంటూనే టేప్ కూడా చేశాను. 'యూ ఆర్ ఇంటెలిజెంట్ అండ్ కాషస్ ఆల్సో. ఇట్ హెల్ప్స్ యూ టు చెక్ అండ్ క్రాస్ చెక్ బిఫోర్ ఫైలింగ్ స్టోరీ' అని మెచ్చుకున్నారు. ఆ మర్నాడు ఆ ఇంటర్వ్యూ తెలుగు, ఇంగ్లీష్ పత్రికల్లో ప్రముఖంగా రావడం, ఆయన డాక్టర్ జయచంద్రారెడ్డితో ఫోన్‌లో ఇంటర్వ్యూ గురించి మెచ్చుకోవడం... పెద్ద విజయం సాధించిన అనుభూతి కలిగించింది.

పాత్రికేయునిగా, హైదరాబాద్‌లో ప్రధానిగా ఆయన కార్యక్రమాలకు హాజరై ఆయనను అతి దగ్గరగా పరిశీలించే అవకాశం లభించింది. మంద్ర స్వరంలో ఛలోక్తులతో, సూక్తులతో... సాగేది బహిరంగ సభలలో ఆయన ఉపన్యాసం. ఆ రోజుల్లో సభలకు ఐదు వేలమంది హాజరైతే ఘనం. ఆయన ప్రసంగానికి పెద్దలు, విద్యావంతులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీగా హాజరయ్యేవారు.



వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25వ తేదీన గ్వాలియర్‌లో ఉపాధ్యాయ కుటుంబంలో క్రీస్తు జన్మ దినాన పుట్టిన గొప్ప మానవతా వాది. కాన్పూరు దయానంద ఆంగ్లో వైదిక కళాశాలలో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విస్తారక్‌గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజ్ పేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడిపిన 'రాష్ట్రధర్మ' (హిందీ మాస పత్రిక), 'పాంచజన్య' (హిందీ వారపత్రిక)ల్లోనూ, 'స్వదేశ్', 'వీర్ అర్జున్' వంటి దినపత్రికలలోనూ పని చేశారు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి.

తాను అమితంగా ప్రేమించే భారతదేశం పట్ల ఆయన నిస్వార్థ అంకితభావానికీ, అర్ధ శతాబ్దంపాటు సమాజానికీ, దేశానికీ ఆయన అందించిన సేవలకూ గుర్తింపుగా 1992లో 'పద్మవిభూషణ్'నూ, 1994లో 'ఉత్తమ పార్లమెంటేరియన్' అవార్డునూ, 2015లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'నూ ప్రభుత్వం ప్రదానం చేసింది. అనారోగ్యంతో పూర్తిగా మంచానికే పరిమితమైన వాజ్‌పేయికి భారతరత్న ప్రదానం చేయడానికి స్వయంగా నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆయన నివాసానికే తరలి వెళ్లారు. ఆయన పుట్టిన రోజును భారత ప్రభుత్వం 'సుపరిపాలనా దినం'గా ప్రకటించింది. అటల్ అద్వితీయమైన వాక్ పటిమకు మంత్ర ముగ్ధుడైన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ 'ఏదో ఒకరోజు వాజ్‌పేయి దేశ ప్రధాని అవుతార'న్న మాటలు 39 ఏళ్ల తర్వాత నిజమయ్యాయి.

ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయిని తన గురువుగా అంగీకరించి ఆయన ద్వారా తానూ ఎంతో ఉత్తేజం పొందానని దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పార్లమెంటులో పేర్కొన్నారు. వాజ్‌పేయి తాను ప్రతిపక్షంలో ఉన్నా... ఇందిరాగాంధీ ధైర్య సాహసాలను శ్లాఘించిన ప్రజాస్వామ్యవాది. 10 సార్లు లోక్ సభకూ, 2 సార్లు రాజ్యసభకూ ఎన్నికయ్యారు. నాలుగు రాష్ట్రాలలో ఏడు నియోజక వర్గాల నుంచి గెలిచిన ఒకే ఒక్క నాయకుడు ఆయనే.

మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 1996 సార్వత్రిక ఎన్నికల తర్వాత బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి ప్రధానిగా వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. స్పష్టమైన మెజారిటీ, ఇతర పార్టీల మద్దతు లేకపోవడంతో 13 రోజుల తర్వాత అటల్‌జీ రాజీనామా చేయాల్సి వచ్చింది. 1998–99లో 13 నెలలు ప్రధానిగా ఉన్నారు. మూడోసారి 1999 నుంచి 2004 వరకు ఐదేళ్లపాటు పూర్తికాలం ప్రధానమంత్రిగా సేవలందించారు.


ఆయన ఆరోగ్యం ఎలా ఉందో కూడా ప్రపంచానికి తెలియకుండా అజ్ఞాతంలో కొన్నేళ్ళు ఉండి 2018 ఆగస్ట్ 16న దివంగతులు కావడంతో భారత్ ఒక అనర్ఘ రత్నాన్ని కోల్పోయింది. జయంతి, వర్ధంతులను నామమాత్రంగా జరపడం మినహా ఆయన్ను తలుచుకునేవారే కనపడటం లేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

(నేడు మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వత్సర ప్రారంభం)

యేసు అనే ప్రేమ

సందర్భం



శ్రీశ్రీ రవిశంకర్

ప్రేమకు నామ రూపాలు లేవు, అయినా అన్ని పేర్లలోనూ, అన్నిరూపాలలోనూ వ్యక్తమవుతుంది. ఈ సృష్టిలోని అతి పెద్ద రహస్యం ప్రేమ. ఈ సమస్త విశ్వాన్నీ ఆవరించి ఉన్న ప్రేమను గమనించడానికి మీకు నిశితమైన దృష్టి అవసరం. తన గూటిలో ఉన్న చిన్ని పిల్లకు ఆహారాన్ని అందిస్తున్న ఆ పక్షిని చూడండి. చిన్న పక్షి తన తల్లి రాక కోసం అలా వేచి ఉంది. అందులో ప్రేమ ఉంది. చేపలలో, ఆకాశంలో, నీటిలో, నేలపై అంతటా ప్రేమ ఉంది. అంతరిక్షంలో ప్రేమ ఉంది. ప్రేమ అనేది ధైర్యంతో వస్తుంది.

ప్రేమ యొక్క సంపూర్ణ వ్యక్తీకరణను మీరు యేసులో కనుగొంటారు. ప్రేమ అనేది విశ్వంలో అత్యంత బలమైన శక్తి. అయినప్పటికీ ప్రేమ మనల్ని సున్నితంగా చేస్తుంది. ప్రేమలో ఉన్నప్పుడు మనం అత్యంత బలహీనులం అయిపోతాం. అందుకే యేసు మానవాళికి సుపరిచితమైన భావనలను పడగొట్టాడు. 'బలవంతులు భూమిని వారసత్వంగా పొందుతారు' అని చెప్పడానికి బదులుగా, 'సాత్వికులు భూమిని వారసత్వంగా పొందుతారు. సాత్వికులు స్వర్గాన్ని వారసత్వంగా పొందుతారు' అని చెప్పాడు. అతడికి ఆ ధైర్యం ఉంది. ఎందుకంటే, ప్రేమ ఆ ధైర్యాన్ని కలిగిస్తుంది.



మీలో ప్రాణశక్తి పొంగిపొర్లుతూ ఉండకపోతే మీరు యేసు బోధలను అర్థం చేసుకోలేరు. అపుడది కేవలం ఒక సూత్రంలా మాత్రమే మీ తలకెక్కుతుంది. మీకు తెలుసా, యేసును అర్థం చేసుకోవాలంటే, మన హృదయంతో అతడిని అందుకోవాలి. మన హృదయంలో అతని ఉనికిని అనుభూతి చెందాలి. బుద్ధి అతడిని అర్థం చేసుకోలేదు. హృదయం మాత్రమే యేసును తెలుసుకోగలదు. ఒకచోట అధికారం ఉందని మీరు గమనిస్తే, అక్కడ ప్రేమ ఉండలేదు. ప్రేమ ఉన్న చోట అధికారం అవసరం లేదు. మిమ్మల్ని ప్రేమించే వ్యక్తి మీపై ఎక్కువ అధికారం కలిగి ఉండటం మీరు గమనించే ఉంటారు. యేసు తన చేతులు చాచి, 'రా, నువ్వు నా స్నేహితుడివి, భయపడకు, నన్ను బలిపీఠం మీద పెట్టకు. నాకు నీ హృదయంలో చోటివ్వు. నీ చుట్టూ కనిపించే ప్రతి ఒక్కరిలో నన్ను చూడు. నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో, లేదా నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో ప్రతీ ఒక్కరినీ అంతగా ప్రేమించు. దాన్ని చుట్టుపక్కల అందరితో పంచుకో' అని పలికాడు. ప్రేమ యొక్క ఆ పూర్ణ స్వరూపాన్ని చూడటానికి మీకు ఇంకేం కావాలి?

క్రిస్మస్ కరోల్‌లోని ఒక అందమైన పాట – 'స్వర్గపు శాంతితో నిద్రపోండి' అని చెబుతుంది – దీని అర్థం ఏమిటి?

చిన్న మనసు పెద్ద మనసు ఒడిలో పడుకుంటే స్వర్గంలో ఉన్నట్లు ప్రశాంతంగా నిద్రిస్తుంది. చిన్న మనసు చిన్నపిల్ల లాంటిది – ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. ఏడుస్తూ... అది కావాలి, ఇది కావాలి అని మారాం చేస్తుంటుంది. అదెప్పుడూ పెద్ద మనసుపై ఆధారపడి ఉంటుంది. పెద్ద మనసు తల్లి లాంటిది. చిన్న మనసు పెద్ద మనసుకు దూరంగా ఉన్నప్పుడు, కంగారుపడి గందరగోళంలో మునిగిపోయి, ఏడుపు మొదలుపెట్టి, పరుగెత్తుకుంటూ తిరిగి పెద్ద మనస్సు దగ్గరకు వచ్చేస్తుంది. అక్కడ అది శాంతిని కనుగొంటుంది. ఉపశమనాన్ని పొందుతుంది. అక్కడ ఆ చిన్న 'నేను' అనే భావం, లేదా చిన్న మనసు, స్వర్గంలో ఉన్నంత ప్రశాంతంగా, విశ్వవ్యాప్తమైన పెద్ద మనసు ఒడిలో నిద్రిస్తుంది. పవిత్రత అనేది తల్లీ బిడ్డలు కలిసి ఉన్నపుడు కలిగేది. తల్లీ బిడ్డలు ఇరువురూ స్వర్గపు ప్రశాంతతలో ఉంటే, అదే ధ్యానం.

మీరు ప్రేమ అనే పదార్థంతో రూపొందించబడ్డారని మీరు తప్పక గుర్తించాలి. మీలో ప్రతి ఒక్కరూ ఈ భూమిపై ఉన్న ప్రత్యేకమైన బహుమతి. మీరే ఒక క్రిస్మస్ చెట్టు. సంవత్సరంలోని ఈ సమయంలో, మిగతా చెట్లన్నీ మోడులై ఉన్నప్పుడు, మీరు మాత్రం పచ్చగా, మీ శాఖలను పైకి ఎత్తి నిలబడి ఉన్నారు. మీరు మీ కోసం కాకుండా మీ చుట్టూ ఉన్న వారి కోసం బహుమతులను, దీపాలను తీసుకుని వచ్చారు. మీరు తీసుకువచ్చిన (మీలో ఉన్న) అన్ని బహుమతులు (సుగుణాలు, నైపుణ్యాలు) మీ కోసం కాదు, అవి మీ చుట్టూ ఉన్న వారి కోసమే అని గుర్తుంచుకోండి. మీ వద్దకు వచ్చే ఎవరికైనా మీవద్ద ఉన్న బహుమతుల్ని అందించండి. ఇలా చేయండి! ఇక మీ అవసరాలన్నీ ఎలా తీర్చబడుతున్నాయో మీరే చూస్తారు.

వ్యాసకర్త ఆధ్యాత్మిక గురువు

(నేడు క్రిస్మస్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.చతుర్దశి తె.4.58 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** రోహిణి రా.9.41 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.1.45 నుండి 3.17 వరకు, తదుపరి తె.3.24 నుండి 5.00 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.05 వరకు, తదుపరి ప.2.36 నుండి 3.24 వరకు, **అమృతఘడియలు:** సా.6.34 నుండి 8.11 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.31, **సూర్యాస్తమయం:** 5.28.

క్లుప్తంగా...

ఆర్టీసీ బస్సుల్లో పురుషులకు ప్రత్యేక సీట్లు !

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సూచించిన ఓ డీఎం

మెదక్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అమలుపై ఆయా డిపోల మేనేజర్ల నుంచి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆరా తీశారు. వారి నుంచి వివరాలూ సేకరించారు. ఈ సందర్భంగా బస్సుల్లో పురుషులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలనే అంశం కూడా చర్చకు వచ్చింది. ఒక్కో బస్సులో 55 సీట్లు ఉంటే...అందులో 20 సీట్లు పురుషులకు మాత్రం అని రాస్తే బాగుంటుందని ఆ డిపో మేనేజర్ చెప్పినట్టు తెలిసింది. అయితే దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నిబంధనల మేరకు పదోన్నతి ఇచ్చారు

- సమాచార, పౌరసంబంధాల అదనపు సంచాలకుడు కిశోర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కోర్టు తీర్పునకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా తనకు పదోన్నతి కల్పించిందని సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకుడు కిశోర్‌బాబు వెల్లడించారు. ఐ అండ్ పీఆర్ శాఖకు చెందిన కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఇవి పూర్తిగా నిరాధారమైనవని పేర్కొన్నారు. తెలంగాణకు తన కేటాయింపు ప్రక్రియ, ఇప్పటివరకు పొందిన పదోన్నతులు కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలకు లోబడే జరిగినట్లు స్పష్టంచేశారు. రాష్ట్రం ఏర్పాటైన పదేళ్ల తర్వాత ఈ అంశాన్ని మాట్లాడుకోవడం సరికాదన్నారు. తన పదోన్నతిని అడ్డుకోవాలన్న దురాలోచన తప్ప అందులో ఏ మాత్రం నిజం లేదని కిశోర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ప్రతిఫలం' కథాసంపుటి ఆవిష్కరణ



జస్టిస్ చంద్రకుమార్ రచించిన ప్రతిఫలం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ప్రముఖ రచయిత, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ రచించిన 'ప్రతిఫలం' కవితా సంపుటిని ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విమలసాహితి సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహ్మప్ప మాట్లాడుతూ జస్టిస్ చంద్రకుమార్ రాసిన 'ప్రతిఫలం' తెలుగు సాహిత్యంలో అపూర్వమైన కవితా సంపుటి అని ప్రశంసించారు. సమాజంలోని అనేక సమస్యలపై స్పందిస్తూ.. ఒక న్యాయమూర్తిగా తన అనుభవాలను జోడించి అద్భుతమైన కథలు ఆవిష్కరించారన్నారు. ఈ కథలు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆలోచింపజేస్తాయని పేర్కొన్నారు. కవి, విమర్శకుడు డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

కొనఊపిరి దాకా బీసీల కోసం పోరాడుతా

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



మేడిపల్లి: అగ్రవర్ణాలు బీసీలను విభజించి పాలిస్తూ ఓటుబ్యాంకుగానే చూస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో బీసీబిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగర శివారులోని పర్వతాపూర్‌లో ఆదివారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. కొనఊపిరి వరకు బీసీల హక్కుల కోసమే పోరాడుతానని స్పష్టం చేశారు. జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ అయినా బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని బీసీల్లో చిచ్చురేపారని, కానీ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు న్యాయం చేస్తారనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తానని, అందులో భాగంగానే ఈ నెల 26న చిత్తూరులో బీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నేతలు గుజ్జ రమేశ్, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నందగోపాల్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

100% మించిన ఆక్యుపెన్సీ రేషియో

- శనివారం రికార్డు సృష్టించిన ఆర్టీసీ
- వరుస సెలవులతో పోటెత్తిన ప్రయాణికులు
- ఒక్క రోజులో 49 లక్షల మంది తరలింపు, రూ.21.24 కోట్ల ఆదాయం



సాక్షి, హైదరాబాద్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తుండటంతో టీఎస్ఆర్టీసీ చరిత్రలో తొలిసారి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో వంద శాతం దాటింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సంఖ్య పోటెత్తటంతో రికార్డు స్థాయిలో 100.09% ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. కి.మీ.కు రూ.65.07 చొప్పున ఆదాయం నమో నమోదైంది. కిలోమీటరుకు నమోదయ్యే ఆదాయం ఆధారంగా ఆక్యుపెన్సీ రేషియోను లెక్కిస్తారు. రెండో శనివారం, ఆదివారం, క్రిస్మస్, బాక్సింగ్‌డే..ఇలా వరుస సెలవులు రావటంతో జనం ఊళ్ల బాట పట్టడంతో శనివారం ఒక్కరోజే 49,00,723 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండు, ఎల్‌బీనగర్, ఆరాంఘర్, ఉప్పల్‌కూడలి తదితర ప్రాంతాలు జనసంద్రమయ్యాయి. ఒక్క ఎంజీబీఎస్ నుంచే దాదాపు నాలుగు లక్షల మంది ప్రయాణించినట్టు అంచనా.

ఒక్క రోజులో రూ.21.24 కోట్ల ఆదాయం

ఆర్టీసీ బస్సుల్లో సంక్రాంతి, దసరా పండగల సమయాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. పండగ సెలవుల్లో ఎక్కువ మంది ప్రయాణించటం ద్వారా రూ.20 కోట్ల వరకు ఆదాయం నమోదవుతుంది. సాధారణ రోజుల్లో అయితే, సోమవారం రద్దీ ఎక్కువగా ఉండి రూ.18 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. సోమవారం కాకుండా, సంక్రాంతి, దసరా లాంటి పండగ సెలవులు లేనప్పటికీ శనివారం ఏకంగా రూ.21.24 కోట్ల ఆదాయం నమోదు కావటం విశేషం. క్రమంగా జనం పోటెత్తుతుండటంతో బస్సుల సంఖ్యను పెంచటంతోపాటు సిబ్బందిని ముఖ్య ప్రాంతాల్లో ఉంచి మానిటరింగ్ చేశారు. శనివారం ఒక్కరోజే సూపర్‌లగ్జరీ, డీలక్స్, గరుడ, రాజధాని బస్సులు రద్దీగా మారాయి. ఎక్కువ చార్జి ఉండే సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ బస్సుల్లో సీట్లు నిండిపోవటంతో భారీగా ఆదాయం నమోదైంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే ఒక్కో గరుడ బస్సులో ట్రిప్పునకు రూ.లక్షన్నర చొప్పున ఆదాయం లభించింది. దీంతో ఆదాయం గరిష్ట స్థాయిలో నమోదై ఆక్యుపెన్సీ రేషియో పెరిగేందుకు కారణమైంది.

కిడ్నీ రాళ్ల 'గుట్ట'

▶ మొదటి పేజీ తరువాయి

అనారోగ్యానికి గురి అవుతుండగా, మరికొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. అయినా అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులూ పట్టించుకోవడం లేదు. కిడ్నీ బాధితుల వెతలపై 'సాక్షి' అందిస్తున్న గ్రౌండ్ రిపోర్ట్.

సుద్ద నీరు.. కిడ్నీల్లో రాళ్లుగా మారి..

కళ్ల ముందే కృష్ణా జలాలు కనిపిస్తున్నా తాగడానికి రక్షిత మంచినీరే లేదు. దీంతో భూగర్భంలోని సుద్ద నీటినే తాగుతున్నారు. ఫలితంగా మోకాళ్లు దెబ్బతినడం, కిడ్నీల్లో రాళ్లు రావడం, మూత్రం ఆగిపోవడం, కిడ్నీలు పూర్తిగా పాడైపోవడం వంటి వ్యాధులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వారిని కబలిస్తున్న కిడ్నీ సంబంధ వ్యాధికి సుద్ద నీరే కారణమని తెలిసినా, యంత్రాంగం పట్టించుకోవడం లేదు.



నిరుపయోగంగా ఉన్న నీళ్ల ట్యాంకు

ట్యాంకు ఉన్నా రాని భగీరథ నీరు

'సాక్షి' ప్రతినిధి ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామంలో రమావత్ కమల బిందెలో నీటిని పట్టుకుంటూ కనిపించింది. భగీరథ నీరా అని అడిగితే బోరు నీళ్లే అని చెప్పింది. కిడ్నీ వ్యాధులకు కారణమైన ఆ నీటిని ఎందుకు తాగుతున్నారంటే మరేం తాగాలని తిరిగి ప్రశ్నించింది. నీళ్ల ట్యాంకు ఉంది కదా.. మిషన్ భగీరథ నీళ్లు వస్తాయి కదా అంటే.. ఐదారు రోజులకు ఒకసారి కూడా రావని చెప్పింది. ఆమె మాత్రమే కాదు గ్రామంలో అందరిదీ అదే మాట.

ఊరంతా కిడ్నీ రోగులే..

వేయి వరకు జనాభా కలిగిన ఆ గ్రామంలో సగం మంది కిడ్నీ వ్యాధి బారిన పడినవారే. మోకాళ్ల నొప్పులు, వాంతులతో ప్రారంభమై నడుము నొప్పితో వ్యాధి తీవ్రత పెరుగుతోందని సర్పంచ్ శ్రీనునాయక్ చెప్పారు. గ్రామంలోని అనేక మంది కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్న వారేనని, కిడ్నీలు పూర్తిగా దెబ్బతిని డయాలసిస్ చేసుకోవాల్సి వస్తోందన్నారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారంటే అనారోగ్య సమస్యలతో అనివార్యంగా గర్భసంచి తొలగించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని మహిళలు చెబుతున్నారు. సాక్షి ప్రతినిధి గ్రామానికి వెళ్లిన సమయంలో ఊళ్లో రెండు వందల మంది వరకు ఉన్నారు. మిగతావారు పొలం పనులకు వెళ్లారు. అక్కడున్న వారిలో ఎవరిని పలకరించిన కిడ్నీ వ్యాధిగ్రస్తులే ఉన్నారు.

పోలీసులు ఆర్‌ఓ ప్లాంటు ఇచ్చినా..

గువ్వల గుట్టలో కిడ్నీ సమస్య ఉందని తెలియడంతో గతంలో ఎస్పీగా పనిచేసిన విక్రమ్‌జిత్ దుగ్గల్ 2015లో జనమైత్రి ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది పాడైపోయింది. పోలీసులే మరొక ఆర్‌ఓ మిషన్ తీసుకొచ్చి పెట్టారు. ఆ తర్వాత అది కూడా పాడైపోవడంతో దాని మరమ్మతులను ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరమ్మతులు చేయించి నీటిని విక్రయిస్తున్నారు. చెంతనే కృష్ణా నీటిని గ్రామానికి సరఫరా చేయాలని గ్రామస్తులు అనేకసార్లు డిమాండ్ చేసినా ఆచరణకు నోచుకోలేదు.

మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు



కిడ్నీ రోగంతో మా జీవితాలు ఆగమాగం అవుతున్నాయి. గ్రామంలో ఇప్పటికే చాలా మంది చనిపోయారు. ఇంకా ఎంత మంది చనిపోతారో తెలియడం లేదు. – వద్య రవి

రోగం కమ్మేస్తుంది



చూడటానికి పైకి బాగానే ఉన్నా.. ఆరోగ్యం అసలే సహకరించడం లేదు. లోపల నుంచి కిడ్నీ రోగం కమ్మేస్తోంది. వైద్యం కోసం రూ. లక్ష వెచ్చించాం. ఇంకా ఎంత పెట్టాలో. – ముడావత్ బిచ్చి

కూర్చున్నా, నిల్చున్నా నడుం నొప్పే



సంవత్సరం నుంచి కిడ్నీ వ్యాధి వచ్చింది. కూర్చున్నా..నిల్చున్నా నడుం నొప్పి వస్తోంది. నడవడానికి చేతకావడం లేదు. – రమావత్ ముత్యాలమ్మ

తినడానికే లేదు వైద్యానికి ఇబ్బంది



నేను వ్యవసాయం చేస్తా. కిడ్నీ సమస్య రావడంతో అది కూడా సరిగ్గా చేయలేకపోతున్నా. కుటుంబ పోషణకే సరిపడా డబ్బులు లేవు. వైద్యం కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. – రమావత్ భామణ

ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని

ఐదుగురి దుర్మరణం

- కర్ణాటకకు వెళ్తూ ఓ కుటుంబం, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తూ మరో కుటుంబం ప్రమాదానికి బలి
- నారాయణపేట జిల్లా జక్లేర్ సమీపంలో ఘటన

మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం పాలవగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. అస్తమా వ్యాధితో బాధపడుతోన్న కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ గ్రామానికి చెందిన రెహమాన్‌బేగం(40)ను చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సంకలమద్దికి తీసుకువచ్చారు. చికిత్స పొందిన అనంతరం తిరుగు ప్రయాణంలో భర్త మౌలాలి(40), కలీల్(43), మరో వ్యక్తి వడివాల్‌తో కారులో కలిసి బయలుదేరారు. ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని కార్వాల్‌లో పనిచేస్తున్న నేవీ ఉద్యోగి దీపక్ సమల్, భార్య భవిత సమల్(35), కూతురు అవిస్మిత సమల్(8)తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. జక్లేర్ సమీపంలో ఉన్న దాబా దగ్గర అతివేగంగా వచ్చిన రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో రెహమాన్ బేగం, మౌలాలి, ఖలీల్, భవిత సమాల్, అవిస్మిత సమాల్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వడివాల్, దీపక్ సమల్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీపక్ సమల్ పరిస్థితి విషమించడంతో 108లో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంలాల్ తెలిపారు. దీపక్ సమల్‌కు విశాఖపట్టణానికి బదిలీ కావడంతో అక్కడికి వెళ్లేందుకు హైదరాబాద్‌కు బయలుదేరారని బంధువులు తెలిపారు. కాగా, కార్లలో బెలూన్ల సౌకర్యం ఉన్నప్పటికీ అవి సకాలంలో ఓపెన్ కాకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్టు చెబుతున్నారు. రోడ్డుపై డివైడర్ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు.

దఫేదార్‌తో బూట్లను మోయించిన కలెక్టర్

- సోషల్ మీడియాలో హల్‌చల్



భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని క్రైస్తవ మందిరంలో కలెక్టర్ భవేష్‌మిశ్రా బూట్లను దఫేదార్ (అటెండర్) మోసిన ఫొటోలు, వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. శుక్రవారం చర్చిలో జరిగిన క్రిస్మస్ నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. బూట్లతో ప్రార్థనా మందిరంలోకి వెళ్లకూడదనే ఆలోచనతో కలెక్టర్ తన షూస్‌ను ఆరుబయటే వదిలి దఫేదార్‌కు ఇచ్చారు.

రాష్ట్రంలోనూ పంటల బీమా!

▶ మొదటి పేజీ తరువాయి

మార్చి, ఏప్రిల్ నెలలో వడగళ్లు, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం జరిగింది. దాదాపు 10 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేయగా, చివరకు వ్యవసాయశాఖ 2.30 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు తేల్చింది. ఎకరాకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున రైతులకు రూ. 230 కోట్లు పరిహారంగా ప్రకటించింది.

– ఇక మొన్నటికి మొన్న ఈ నెల మొదటివారంలో రాష్ట్రంలో తుపాను కారణంగా వివిధ రకాల పంటలకు దాదాపు 5 లక్షల ఎకరాల్లో నష్టం జరిగింది. కానీ రైతులకు ఎలాంటి ఆర్థిక చేయూత అందలేదు. వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంలోనూ విఫలమైంది. ఇలా ప్రతీ ఏడాది రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది.

పంటల బీమాతోనే రైతులకు మేలు

ఫసల్ బీమాకు ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో ప్రత్యేకంగా ఒక పంటల బీమా పథకం ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న దానిపై గత ప్రభుత్వ హయాంలోనే కసరత్తు జరిగింది. గ్రామం యూనిట్‌గా కాకుండా రైతు యూనిట్‌గా దీనిని ప్రవేశపెట్టాలని అనుకున్నారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికే రెండు మూడు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో విసిగివేసారి బయటకు వచ్చి, సొంత పథకాలను రూపొందించుకున్నాయి. బెంగాల్ ప్రభుత్వం విజయవంతంగా సొంత పథకాన్ని అమలు చేస్తుంది. అక్కడ అధ్యయనం చేసి, ఆ ప్రకారం ముందుకు సాగాలని అధికారులు అనుకున్నారు. కానీ ఏదీ ముందుకు పడలేదు. కేంద్ర ఫసల్ బీమా పథకం వల్ల కంపెనీలకు లాభం జరిగిందనేది వాస్తవమే కావొచ్చు. కానీ ఎంతో కొంత రైతులకు ప్రయోజనం జరిగిందని కూడా రైతు సంఘాలు అంటున్నాయి.

- 2016–17లో తెలంగాణలో వివిధ కారణాలతో 1.58 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో 2.35 లక్షల మంది రైతులు రూ. 178 కోట్లు నష్టపరిహారం పొందారు.
- 2017–18లో వివిధ కారణాలతో 3.18 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో 4.42 లక్షల మంది రైతులు రూ. 639 కోట్లు పరిహారం పొందారు.
- 2018–19లో 1.2 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరగ్గా, 2.2 లక్షల మంది రైతులు రూ. 570 కోట్ల పరిహారం పొందారు.
- 2019–20లో 2.1 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరగ్గా, 3.24 లక్షల మంది రైతులు రూ. 480 కోట్ల పరిహారం పొందారు.
- ఫసల్ బీమా పథకం నుంచి తప్పుకున్న తర్వాత వ్యవసాయశాఖ నష్టం అంచనాలు వేయడం కూడా నిలిపివేసింది. దీంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు.

నటి కృష్ణవేణి యువతకు ఆదర్శం

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కృష్ణవేణికి జ్ఞాపికను అందజేస్తున్న జూపల్లి

బంజారాహిల్స్ (హైదరాబాద్): అలనాటి సినీనటి, గాయని, నిర్మాత కృష్ణవేణి యువతకు ఆదర్శనీయమని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కృష్ణవేణి వంద ఏట అడుగిడిన సందర్భంగా బంజారాహిల్స్‌లోని ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో ఆదివారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో ఆమె శత వసంత మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగానికి కృష్ణవేణి చేసిన విస్తృత సేవలను కొనియాడారు. ఎందరో మహనటుల భవితవ్యాన్ని ఆమె తీర్చిదిద్దారంటూ ప్రస్తుతించారు. కృష్ణవేణి లాంటి ఒక సినీదిగ్గజ నటిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సినీరంగానికి నంది అవార్డుల ప్రదానం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని చెప్పారు. దీనిపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణవేణిని గజమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, ఆకృతి సుధాకర్, సినీ ప్రముఖులు మురళీమోహన్, జయసుధ, రోజా రమణి, డాక్టర్ కృష్ణక్క, నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ, మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది: ఉత్తమ్



పూల ఆంథోనికి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

బన్సీలాల్‌పేట్ (హైదరాబాద్): క్రైస్తవ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కార్డినల్ పూల ఆంథోని నివాసానికి వెళ్లి ఉత్తమ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లౌకిక స్వభావంతో వ్యవహరిస్తుందని, క్రైస్తవులు, ఇతర మైనార్టీల హక్కులు, ఆస్తుల పరిరక్షణతో పాటు మతపరమైన స్వేచ్ఛకు రక్షణ, భద్రత కల్పిస్తామన్నారు. ఎన్నికల ముందు క్రైస్తవులతో పాటు మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందని చెప్పారు. అన్ని వర్గాల సంపూర్ణ రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి క్రైస్తవులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏసుక్రీస్తు జీవితం క్షమాగుణానికి ప్రతీక

- గవర్నర్ తమిళిసై క్రిస్మస్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవులందరికీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఆయన ఆశయాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాలతో క్రిస్మస్‌ను జరుపుకుంటారన్నారు. ఏసుక్రీస్తు జీవితం ప్రేమ, క్షమాగుణం, సత్యం, కరుణ, సోదరభావం, త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. క్రిస్మస్ శుభసందర్భంగా అంతటా ప్రేమ, ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలని గవర్నర్ ఆకాంక్షించారు. క్రిస్మస్ స్ఫూర్తితో ప్రపంచం మరింతగా అభివృద్ధి చెందాలని, ఆరోగ్యం, శాంతి, దయ వెల్లివిరియాలని ప్రార్థించారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ఏసు ప్రభువు బోధనలు శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనం ఎప్పటికీ అనుసరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని క్రైస్తవ సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడిందని, మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శకంగా, ప్రజాస్వామికంగా సాగుతుందన్నారు. క్రిస్టియన్ సోదరులు సంతోషంతో, ఆనందోత్సాహాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలని సూచించారు. క్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం ప్రజలందరూ పాటుపడాలని సీఎం పిలుపునిచ్చారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు: డిప్యూటీ సీఎం భట్టి



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని క్రైస్తవులందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు విశ్వమానవ సహోదరత్వానికి దోహదం చేశాయని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసు శాంతి, కరుణ, సహనం, ప్రేమ విలువలను ప్రపంచానికి చాటారన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ, సహనం అనే సద్గుణాల ఆచరణ అనివార్యమైందని భట్టి పేర్కొన్నారు. ఏసుక్రీస్తు దీవెనలు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు.

ఏపీ సీఎం జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. దైవ కుమారుడు జీసస్ మానవుడిగా జన్మించిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని ముఖ్యమంత్రి అన్నారు. ఏసుప్రభువు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని, తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం జగన్ అన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

ఉపా, ఎన్‌ఐఏ చట్టాలను రద్దు చేయాలి

- పార్లమెంట్‌నే రక్షించలేనివారు దేశాన్ని ఎలా రక్షిస్తారు?
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): హక్కుల సంఘం నేతలు, కవులు, కళాకారులు, మేధావులపై ప్రయోగిస్తున్న ఉపా, ఎన్‌ఐఏ చట్టాలను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక హక్కులను అరిస్తున్న ఉపా చట్టం రద్దుకోసం ఉద్యమించాలని పిలుపునిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ...ఇటీవల పార్లమెంట్ మీద దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ పార్లమెంట్‌నే రక్షించలేనివారు ఇక దేశాన్ని ఏమి రక్షిస్తారని విమర్శించారు. పార్లమెంట్ నుంచి 152 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం అంటే సుమారు 32 కోట్లమంది గొంతు నొక్కడమేనని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ...మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజా భద్రత చట్టాన్ని ప్రవేశపెట్టి పౌర హక్కుల సంఘాలను నిషేధించారన్నారు. దీంతోపాటు వారిపై పాటు దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి పౌర హక్కుల సంఘాల నేతలు, మేధావులు, రచయితలు, కవులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఉపా, ఎన్‌ఐఏ సంస్థలతో పాటు పబ్లిక్ సెక్యూరిటీ యాక్టును ఎత్తివేయాలని పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు పలువురు కళాకారులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో కాఫర్‌డ్యాం పనులు షురూ



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలో ఎట్టకేలకు ఎల్‌ఎన్‌టీ నిర్మాణ సంస్థ కాఫర్ డ్యాం పనులు రెండు రోజులుగా నిర్వహిస్తోంది. అక్టోబర్ 21న బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 21వ పియర్ కుంగిన విషయం తెలిసిందే. మొదట పూర్తి బాధ్యత తమదేనని.. తర్వాత తమకు సంబంధం లేదని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట మార్చారు. అయితే రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సంస్థ ప్రతినిధులు, ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించారు. దీంతో ఎల్‌ఎన్‌టీ సంస్థ దిగొచ్చి రూ.55 కోట్ల వ్యయంతో మొదట గోదావరిలో 7వ, 8వ బ్లాక్ పరిధిలో నీటిని మళ్లించి చుట్టూరా కాఫర్ డ్యాం నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిసింది. రెండు రోజులుగా భారీ యంత్రాలతో మహారాష్ట్ర వైపున గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పోచంపల్లి నది ఒడ్డు నుంచి మట్టి, రాళ్లు, ఇతర సామగ్రిని తీసుకు వచ్చి పనులు చేస్తోంది. కాఫర్ డ్యాం పనులు పూర్తయితేనే ఎన్ని పియర్‌లు దెబ్బతిన్నవి? ఎంత మేర బ్లాక్‌లు కుంగినవి తెలుస్తుందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. బ్యారేజీ వద్దకు ఎవరినీ అనుమతించడం లేదు. పోలీసు పహారా, నిర్మాణ సంస్థ ఉద్యోగుల చేతుల్లో బ్యారేజీ ప్రాంతం ఉంది.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ''క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రజలు కరుణ, దయ నుంచి ప్రేరణ పొందాలి. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, దయాగుణం విశిష్టతను మరోసారి మనకు గుర్తు చేస్తుంది. మానవాళికి నిస్వార్థంగా ఎలా సేవ చేసి తరించాలో ఈ పండుగ మనకు చాటి చెబుతుంది. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలంటే మనం ఎలాంటి ఆదర్శమయ జీవితం గడపాలో ఏసు క్రీస్తు బోధనలు మనకు విడమరిచి చెబుతాయి. ఇంతటి పర్వదినాన తోటి పౌరులు, ముఖ్యంగా క్రైస్తవ సోదర, సోదరీమణులకు నా హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు'' అని రాష్ట్రపతి ఆదివారం తన సందేశంలో పేర్కొన్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

ఒకాలా(ఫ్లోరిడా): అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఒకాలా నగరంలోని షాపింగ్‌మాల్‌లో శనివారం మధ్యాహ్నం ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ఆగంతకుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న ఒక మహిళ కాలికి బుల్లెట్ గాయమైంది. ఘటన తర్వాత ఆగంతకుడు తుపాకీని అక్కడే వదిలేసి పారిపోయాడు. ఈ కాల్పుల ఘటనలో అక్కడి వినియోగదారులకు స్వల్ప గాయాలయ్యాయి. ఒకతని చేయి విరిగింది. ఆగంతకుడు, బాధితుడి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. అతను ఎందుకు కాల్పులు జరిపాడు అనే విషయాన్నీ పోలీసులు ఇంకా బహిర్గతం చేయలేదు. కాల్పుల శబ్దం విని అక్కడ ఉన్న చాలా మంది కస్టమర్లు ప్రాణభయంతో బయటకు పరుగులు పెట్టారు. ఆ ఘటన తలుచుకుంటే ఇంకా భయమేస్తోందని ప్రత్యక్షసాక్షులు కెల్విన్, డయానా చెప్పారు.

'గీతా పారాయణం'లో పార్టీల దూషణల పర్వం

కోల్‌కతా: దాదాపు 1,20,000 మందితో కోల్‌కతాలో జరిగిన మెగా భగవద్గీత పఠన కార్యక్రమం రాజకీయ రంగు పులుముకుంది. కార్యక్రమంలో పాల్గొన్న బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకంత మజుందార్ అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మతాన్ని, రాజకీయాలను కలిపేయడం బీజేపీ అలవాటుగా మారిందంటూ తృణమూల్ మండిపడింది. ''గీతా పఠనానికి మేం వ్యతిరేకం కాదు. కానీ దాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోకండి. లేదంటే ఈ కార్యక్రమం కంటే ఫుట్‌బాల్ మ్యాచ్ వంటిది ఏర్పాటు చేయడం మేలు'' అని టీఎంసీ నేత ఉదయన్ గుహ అన్నారు. ఈ కార్యక్రమానికి పోటీగా కాంగ్రెస్ దానికి దగ్గర్లోనే రాజ్యాంగ పఠనం కార్యక్రమం నిర్వహించింది. మరోవైపు గీతా పఠనానికి ప్రధాని మోదీ మద్దతుగా నిలిచారు. దీనితో సమాజంలో సామరస్యం పెంపొందుతుందంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అన్నీ మంచి శకునములే!



పర్యావరణ లాభ సూచనలే

- ఓజోన్‌కు పూడుతున్న గండి
- ఎలక్ట్రిక్ వాహనాల్లో బాగా వృద్ధి
- 'అమెజాన్' నరికివేత తగ్గుముఖం
- 2023లో సానుకూల పరిణామాలు

ఓజోన్ పొరకు గండి పూడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం బాగా పెరుగుతోంది. పర్యావరణపరంగా వరుస దుర్వార్తల పరంపర నడుమ ఇలాంటి పలు సానుకూల పరిణామాలకు కూడా 2023 వేదికవడం విశేషం! బ్రెజిల్‌లో అమెజాన్ అడవుల క్షీణత బాగా తగ్గుముఖం పట్టడం మొదలు ఇటీవలి కాప్‌28 సదస్సులో కీలక పర్యావరణ తీర్మానం దాకా ముఖ్యమైన ఇలాంటి ఓ ఐదు పరిణామాలను గమనిస్తే...

– సాక్షి, నేషనల్ డెస్క్

సంప్రదాయేతర ఇంధనోత్పత్తి పైపైకి...



శిలాజ ఇంధనాలకు వీలైనంత త్వరగా స్వస్తి పలికితేనే గ్లోబల్ వార్మింగ్ భూతాన్ని రూపుమాపడం సాధ్యమని పర్యావరణవేత్తలంతా ఎప్పటినుంచో చెబుతున్నదే. సౌర విద్యుత్ వంటి సంప్రదాయేతర ఇంధన వనరులకు మళ్లడం ఇందుకున్న మార్గాల్లో ముఖ్యమైనది. ఈ విషయంలో 2023లో ప్రపంచ దేశాలు చెప్పుకోదగ్గ ప్రగతినే సాధించాయి. అంతర్జాతీయంగా సంప్రదాయేతర ఇంధనోత్పత్తి ఈ ఒక్క ఏడాదే ఏకంగా 30 శాతం, అంటే 107 గిగావాట్లకు పైగా పెరిగిందట! అంతర్జాతీయ ఇంధన సంస్థ ఈ మేరకు వెల్లడించింది. వాతావరణ కాలుష్య కారక దేశాల్లో అగ్ర స్థానంలో ఉన్న చైనాయే ఈ విషయంలోనూ అందరికంటే ముందుంది! చైనా సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గత జూన్ నాటికే మిగతా ప్రపంచ దేశాలన్నింటి ఉమ్మడి సామర్థ్యాన్ని కూడా మించిపోయిందని ఒక నివేదిక తేల్చడం విశేషం. అదే సమయంలో చైనాలో బొగ్గు ఉత్పత్తి కూడా కొద్ది నెలలుగా తార స్థాయికి చేరినా, త్వరలోనే అది బాగా దిగొస్తుందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తుండటం మరో సానుకూల పరిణామం. హాలోవీన్ వేడుక సందర్భంగా పోర్చుగల్ అక్టోబర్ 31 నుంచి వరసగా ఆరు రోజుల పాటు కేవలం సంప్రదాయేతర ఇంధన వనరులను మాత్రమే వినియోగించి ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచింది.

ఓజోన్ క్రమంగా కోలుకుంటోంది...



అతినీల లోహిత కిరణాల వంటివాటి బారి నుంచి భూమిని కాపాడే కీలకమైన ఓజోన్ పొర కోలుకునే ప్రక్రియ 2023లో మరింతగా వేగం పుంజుకుంది. విచ్చలవిడి క్లోరోఫ్లోరో కార్బన్ల విడుదల తదితరాల కారణంగా ఓజోన్‌కు రంధ్రం పడిందని, అది నానాటికీ పెరుగుతోందని 1980ల నుంచీ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూ వస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు అంతర్జాతీయంగా జరిగిన ప్రయత్నాలు ఫలితాలిస్తున్నట్టు వారు తాజాగా చెబుతున్నారు. ఇందుకోసం చేసుకున్న మాంట్రియల్ ఒప్పందం ప్రకారం క్లోరో ఫ్లోరో కార్బన్లకు పూర్తిగా స్వస్తి చెప్పాలన్న లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రపంచ దేశాలు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నాయి. ఈ కృషి ఇలాగే కొనసాగితే 2040 కల్లా ఓజోన్ పొర 1980లకు ముందునాటి స్థితికి మెరుగు పడటం ఖాయం'' అని ఐరాస తాజా నివేదికలో హర్షం వెలిబుచ్చింది. అయితే అంటార్కిటికా మీద మాత్రం ఓజోన్‌కు పడ్డ రంధ్రం గతంతో పోలిస్తే మరింతగా విస్తరించిందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అమెజాన్‌కు ఉద్దీపన

అమెజాన్ అడవులను ప్రపంచం పాలిట ఊపిరితిత్తులుగా, ఆకుపచ్చని వలగా అభివర్ణిస్తుంటారు. ప్రపంచంలోనే అతి పెద్ద వర్షాధారిత అడవులివి. బ్రెజిల్‌లో కొన్నేళ్లుగా అడ్డూ అదుపూ లేకుండా సాగుతూ వస్తున్న వాటి విచ్చలవిడి నరికివేతకు 2023లో భారీ బ్రేక్ పడింది. బ్రెజిల్ గురించే చెప్పుకోవడం ఎందుకంటే 60 శాతానికి పైగా అమెజాన్ అడవులకు ఆ దేశమే ఆలవాలం! గత జూలై నాటికే అక్కడ అడవుల నరికివేత ఏకంగా 22.3 శాతం దాకా తగ్గుముఖం పట్టిందట. గత ఆర్నెల్లలో ఇది మరింతగా తగ్గిందని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. 2030 నాటికి బ్రెజిల్లో అడవుల నరికివేతను పూర్తిగా అరికట్టడమే లక్ష్యమని ప్రకటించిన నూతన అధ్యక్షుడు లులా డసిల్వా ఆ దిశగా గట్టి చర్యలే తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల జోష్



పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాలు ప్రపంచమంతటా దుమ్ము రేపుతున్నాయి. 2023లో వాటి అమ్మకాల్లో అంతర్జాతీయంగా విపరీతమైన పెరుగుదల నమోదైంది. అగ్ర రాజ్యం అమెరికాలోనైతే ఈవీల అమ్మకాలు ఆల్‌టైం రికార్డులు సృష్టించాయి! 2023లో అక్కడ 10 లక్షలకు పైగా పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడైనట్టు బ్లూంబర్గ్ నివేదిక వెల్లడించింది. చైనాలో కూడా 2023లో మొత్తం వాహనాల అమ్మకాల్లో 19 శాతం వాటా ఈవీలదేనట! పలు యూరప్ దేశాల ప్రజలు కూడా వాటిని ఇబ్బడిముబ్బడిగా కొనేస్తున్నారు. అక్కడ 2022తో పోలిస్తే ఈవీల అమ్మకాల్లో 55 శాతానికి పైగా వృద్ధి నమోదైంది! మొత్తమ్మీద 2023లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం వాహన కొనుగోళ్లలో 15 శాతానికి ఈవీలేనని తేలింది. ప్రపంచ కాలుష్యంలో ఆరో వంతు వాటా రోడ్డు రవాణా వాహనాలదే. ఈ నేపథ్యంలో ఈవీలు ఎంతగా పెరిగితే ఈ కాలుష్యం అంతగా దిగొస్తుంది.

శిలాజ ఇంధనాలపై తీర్మానం

COP28UAE
UNITE. ACT. DELIVER.

బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని పూర్తిగా నిలిపేయాలని ఇటీవల దుబాయ్‌లో జరిగిన కాప్‌28 అంతర్జాతీయ పర్యావరణ సదస్సు తీర్మానించడం విశేషం. పర్యావరణ పరిరక్షణకు కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రయత్నాల్లో ఈ తీర్మానాన్ని కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఏకంగా 100కు పైగా దేశాలు దీనికి సంపూర్ణంగా మద్దతు పలకగా, ఈ దిశగా శక్తివంచన లేకుండా ప్రయత్నించాలని మరో 50 పై చిలుకు దేశాలు ఈ సదస్సు వేదికగా అభిప్రాయపడ్డాయి. గతంలోనూ పలు కాప్ సదస్సుల్లో ఈ దిశగా ప్రయత్నాలు జరిగినా అవి చర్చల స్థాయిని దాటి తీర్మానం దాకా రాకుండానే వీగిపోయాయి. అందుకే ఇది చరిత్రాత్మక తీర్మానమని కాప్‌28 సదస్సుకు అధ్యక్షత వహించిన సుల్తాన్ అల్ జబర్ అభివర్ణించారు. ఇది దేశాల ఆర్థిక వ్యవస్థలనే పునర్నిర్వచిస్తుందని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. దీనికి దేశాలు ఏ మేరకు కట్టుబడి ఉంటాయన్న దానిపై భూగోళం భవిష్యత్తు చాలావరకు ఆధారపడి ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

అవినీతికి దూరంగా ఉండండి: జిన్‌పింగ్

చైనా కమ్యూనిస్టు నేతలకు హితవు

బీజింగ్: అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా నాయకులకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సూచించారు. కుటుంబ సభ్యులను, బంధువులను సైతం వాటికి దూరంగా ఉంచాలన్నారు. ఈ నెల 22న సీపీసీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుల భేటీలో జిన్‌పింగ్ ప్రసంగించారు. వ్యక్తిగతంగా క్రమశిక్షణ పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. అవినీతిపై మనం పోరాటం చేస్తున్నారని, ఈ విషయంలో పార్టీ నేతలంతా సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మీ కింద పని చేసేవారు అవినీతి దూరంగా ఉండేలా కఠినమైన నిబంధనలు విధించాలని జిన్‌పింగ్ సూచించారు. ఇటీవలి కాలంలో కమ్యూనిస్టు నాయకుల అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతరులకు ప్రయోజనాలు కల్పించి, వారి నుంచి లంచాలు, బహుమతులు స్వీకరిస్తున్నట్లు కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వంగుర్తించింది. కొందరిపై విచారణ సైతం ప్రారంభించింది.

కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

మసీదులో ప్రార్థన వేళ మాజీ పోలీసు అధికారిని చంపేసిన ఉగ్రవాదులు

శ్రీనగర్: డెబ్బై రెండేళ్ల మాజీ పోలీసు అధికారిని కశ్మీర్ ఉగ్రవాదం బలితీసుకుంది. బారాముల్లా జిల్లాలోని షేరీ ప్రాంతంలోని గట్‌ముల్లా సమీప మసీదులో ఈ దారుణం చోటుచేసుకుంది. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ)గా చేసి 11 సంవత్సరాల క్రితం రిటైర్ అయిన మొహమ్మద్ షఫీ మిర్.. దగ్గర్లోని మసీదులో ప్రార్థనలకు అందరికీ పిలుపునిచ్చే మువజ్జిన్‌గా సేవలందిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున మసీదుకొచ్చి అందర్నీ ప్రార్థనల కోసం పిలుస్తుండగా ఉగ్రవాదులు అకస్మాత్తుగా గుళ్ల వర్షం కురిపించారు. దాంతో ఆయన ఘటనాస్థలిలోనే మరణించారు. ''లౌడ్‌స్పీకర్‌లో ఆయన ఆజా పిలుపు హఠాత్తుగా ఆగిపోయింది. రెహమ్ (దయ) ఆయన పలికిన చివరి పదం'' అంటూ షఫీ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నాయి. హింస ఏ రూపంలో ఉన్నా సహించేదిలేదని జేకేఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆజాన్ చేస్తున్న వ్యక్తిని పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదులకు మత విలువలు కూడా లేవని అర్థమవుతోంది' అని జమ్మూకశ్మీర్ బీజేపీ అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఉగ్రవాదం పీచమణిచేందుకు ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని కొత్తగా ఏర్పాటైన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ చీఫ్ గులాం నబీ ఆజాద్ డిమాండ్ చేశారు.



వికసిత్ భారత్‌ను నిజం చేయండి: మోదీ

జమ్మూకశ్మీర్ విద్యార్థులతో ప్రధాని మాటామంతీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ యువతలో అద్భుత ప్రతిభాపాటవాలు దాగున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపొందడంలో తమ వంతు కృషిచేయాలని వారికి పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లో ప్రతి జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులతో మోదీ ఆదివారం ఢిల్లీలో మాట్లాడారు. క్రీడల పట్ల కశ్మీర్ ప్రజలు చూపే అమితాసక్తిపై విద్యార్థులను ఆయన అడిగి తెల్సుకున్నారు. హంగ్జూలో ఆసియాన్ పారా గేమ్స్‌లో కశ్మీర్ యువత ఆర్చర్ శీతల్ దేవి సాధించిన మూడు మెడల్స్ గురించి వారితో మాట్లాడారు. ''రోజూ యోగా చేయండి. మీరంతా బాగా చదివి, కష్టపడి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయండి. 2047 కల్లా వికసిత భారత్ కలను నిజం చేయండి'' అని వారికి పిలుపునిచ్చారు.

మళ్లీ కోరలు చాస్తున్న కరోనా..!



- 656 పాజిటివ్ కేసులు నమోదు
- వ్యాధి విస్తృతిపై ఓ కన్నేయండి
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

న్యూఢిల్లీ: కరోనా కేసుల ఉధృతి నెమ్మదిగా ఊపందుకుంటోంది. గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 656 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. కేరళలో మరో వ్యక్తి కోవిడ్‌తో కన్నుమూయడంతో దేశంలో ఇప్పటిదాకా కోవిడ్‌తో మరణించిన వారి సంఖ్య 5,33,333కి ఎగబాకింది. భారత్‌లో తొలికేసు వెలుగుచూసిననాటి నుంచి ఇప్పటిదాకా 4,50,08,620 మందికి కరోనా సోకగా వారిలో 4,44,71,545 మంది కోలుకున్నారు. మరణాల రేటు 1.19 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 220.67 కోట్ల డోస్‌ల కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీ పూర్తయింది.

ఆగ్నేయాసియా దేశాలు జాగ్రత్త

శ్వాససంబంధ కేసులు ఆగ్నేయాసియా దేశాల్లో పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. కోవిడ్ వ్యాధి విస్తృతిపై ఓ కన్నేసి, నిఘా పెంచి, వ్యాప్తి కట్టడికి కృషిచేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంత డైరెక్టర్ డాక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్ ఆగ్నేయాసియా దేశాలకు సూచించారు. '' పండుగల సీజన్ కావడంతో జనం ఒక్కచోట గుమిగూడే సందర్భాలు పెరుగుతున్నాయి. దీంతో కరోనా వ్యాప్తి పట్ల జనం అప్రమత్తంగా ఉండాలి'' అని ఆమె చెప్పారు. జేఎన్1 ఉపవేరియంట్‌కు వేగంగా సంక్రమించే గుణం ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన పనిలేదని డబ్ల్యూహెచ్‌వో స్పష్టంచేయడం తెల్సిందే. ఇప్పుడు అందుబాటులో ఉన్న కోవిడ్ వ్యాక్సిన్లు జేఎన్1సహా అన్నివేరియంట్ల కరోనా వైరస్‌ల నుంచీ సమర్థవంతంగా రక్షణ కల్పిస్తాయి'' అని ఆమె చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా భారత ప్రభుత్వం సైతం అవసరమైన చోట్ల కోవిడ్ నిబంధనలను తప్పక అవలంబించాలని రాష్ట్రాలకు ఇప్పటికే సూచించింది.

ఆ విమానం ఎట్టకేలకు టేకాఫ్ !

పారిస్: మానవ అక్రమ రవాణా అనుమానంతో మూడ్రోజులపాటు తమ అధీనంలో ఉంచుకున్న విమానాన్ని ఫ్రాన్స్ అధికారులు ఎట్టకేలకు విడిచిపెట్టారు. 303 మందికిపైగా ప్రయాణికులతో దుబాయ్ నుంచి బయల్దేరిన ఆ విమానం ఇంధనం నింపుకునేందుకు ఫ్రాన్స్‌లోని పారిస్ దగ్గర్లోని వ్యాట్రీ విమానాశ్రయంలో గురువారం దిగింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది భారతీయులే. ఈ విమానం ద్వారా మానవ అక్రమ రవాణా జరుగుతోందంటూ వచ్చిన సమాచారంతో ఫ్రాన్స్ అధికారులు దాన్ని తమ అధీనంలోకి తీసుకుని దర్యాప్తు మొదలెట్టడం తెల్సిందే. 303 మందిని విడివిడిగా విచారించాలని భావించిన నలుగురు జడ్జీలు, అసలు ఈ ప్రక్రియే అస్తవ్యస్తంగా ఉందంటూ మొత్తం కేసు విచారణనే రద్దుచేశారు. దాంతో విమానం టేకాఫ్‌కు అడ్డంకులు తొలిగాయి. వాస్తవానికి ఈ విమానం నికరాగువాకు వెళ్లాలి. తాజా ఉదంతం నేపథ్యంలో అది నికరాగువా వెళ్తుందా, లేక భారత్‌కో, దుబాయ్‌కో తిరిగొస్తుందా అన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే కేదార్‌పై వేటు

ముంబై: సహకార బ్యాంక్‌లో రూ.150 కోట్ల మేర మోసాలకు పాల్పడ్డ కేసులో మహారాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే సునీల్ కేదార్‌పై శాసనసభ సభ్యత్వం రద్దయింది. అసెంబ్లీ సెక్రటేరియట్ ఈ మేరకు పేర్కొంది. ఆయన నాగ్‌పూర్ జిల్లా సావోనెర్ అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేదార్ నాగ్‌పూర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఉండగా మరో ఐదుగురితో కలిసి ఆర్థిక నేరానికి పాల్పడ్డారని ప్రత్యేక కోర్టు తేల్చింది. వారందరికీ ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది.

14 మంది ఇజ్రాయెల్ జవాన్లు మృతి

టెల్ అవీవ్: హమాస్ మిలిటెంట్ల భరతం పట్టడమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై వైమానిక, భూతల దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం, శనివారం హమాస్ మిలిటెంట్ల ఎదురుదాడిలో 14 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. దీంతో ఈ యుద్ధంలో ఇప్పటివరకు బలైన ఇజ్రాయెల్ సైనికుల సంఖ్య 153కు చేరుకుంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం ప్రకటించింది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. ఒకేసారి 14 మంది జవాన్లను కోల్పోవడం ఇజ్రాయెల్ జీర్ణించుకోలేకపోతోంది. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకర స్థాయిలో విరుచుకుపడుతోంది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో 166 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ చెరలోని బందీలను విడిపించాలంటే యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ అంటోంది. హమాస్‌పై పోరాటం వల్ల భారీ మూల్యమే చెల్లించాల్సి వస్తోందని, అయినప్పటికీ ముందుకెళ్లడం తప్ప మరో మార్గం లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. మరోవైపు ఆయనకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో జనం వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. నెతన్యాహు తక్షణమే పదవి నుంచి దిగిపోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రసముద్రంలో మరో నౌకపై దాడి

25 మంది భారతీయ సిబ్బంది క్షేమం

న్యూఢిల్లీ: హమాస్‌పై దాడికి దిగిన ఇజ్రాయెల్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుపలికిన దేశాలను హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్ దాడులతో భయపెట్టే ప్రయత్నాలు ముమ్మరంచేశారు. దీంతో హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం నెమ్మదిగా అంతర్జాతీయ జల రవాణా రంగం మీద ప్రభావం చూపుతోంది. గత కొద్ది వారాలుగా యెమెన్ తీరం వెంబడి ఎర్రసముద్ర జలాల్లో ప్రయాణించే సరకు రవాణా నౌకలపై హౌతీ రెబల్స్.. డ్రోన్ దాడులతో తెగబడుతున్నారు. లైబీరియా జెండా ఉన్న, ఇజ్రాయెల్‌కు చెందిన వాణిజ్యనౌక ఎంవీ చెమ్ ఫ్లూటోపై డ్రోన్ దాడి జరిగిన మరుసటి రోజే మరో చమురు రవాణా నౌక ఎంవీ సాయిబాబాపై డ్రోన్ దాడి చేశారు. ఎర్రసముద్ర జలాల్లో గబాన్ జెండాతో భారత్‌కు వస్తున్న ఈ నౌకపై శనివారం దాడి జరిగిందని ది అమెరికా సెంట్రల్ కమాండ్(సెంట్‌కామ్) ప్రకటించింది. '' సాయిబాబా నౌకలోని మొత్తం 25 మంది సిబ్బంది భారతీయులే. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. గాబాన్ జెండా ఉన్న ఎంవీ సాయిబాబా నౌక భారత్‌లోనూ షిప్పింగ్‌కు సంబంధించిన సర్టిఫికెట్‌ను తీసుకుంది'' అని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది. నార్వే జెండాతో ఎర్రసముద్ర జలాల్లో రసాయన/చమురు ట్యాంకర్‌లతో పయనిస్తున్న ఎంవీ బ్లామనెన్ నౌకపైనా దాడికి ప్రయత్నించి తిరుగుబాటుదారులు విఫలమయ్యారని అమెరికా వెల్లడించింది. సౌదీ అరేబియా నుంచి చమురు సరకుతో భారత్‌కు వస్తున్న ప్లూటో నౌకపై ఇటీవలే అరేబియా సముద్రంలో పోరుబందర్ తీరానికి 217 నాటికల్ మైళ్లదూరంలో డ్రోన్ దాడి జరిగిన విషయం తెల్సిందే. అందులోనూ 20 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.

ద్రోహినో, దేశభక్తుడినో ప్రజలే నిర్ణయిస్తారు

లోక్‌సభలో పొగ ఘటనపై బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా

మైసూరు(కర్ణాటక): లోక్‌సభలో పొగబెట్టిన ఘటనలో నిందితులకు పాస్‌లిచ్చి విమర్శలకు గురైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా ఆ ఘటనపై తొలిసారిగా స్పందించారు. తాను దేశద్రోహినో, దేశ భక్తుడినో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లే నిర్ణయిస్తారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. ''ఘటనను, దానిపై జరుగుతున్న దర్యాప్తును తప్పుదోవ పట్టించే ఉద్దేశం నాకు లేదు. దైవం, ఓటర్లే నేను ఎలాంటి వ్యక్తినో ఈసారి ఎన్నికల్లో ఫలితం ద్వారా నిర్ణయిస్తారు. అంతకుమించి నేను చెప్పదల్చుకుంది ఏమీ లేదు'' అన్నారు. మాజీ పాత్రికేయుడైన సింహా కర్ణాటకలోని మైసూరు–కొడగు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ తరఫున విజయం సాధించారు. డిసెంబర్ 13వ తేదీన లోక్‌సభ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన ఇద్దరు ఆగంతకులు పొగ గొట్టాలు విసిరి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి కలకలం రేపడం తెల్సిందే. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ప్రతాప్ సింహా వాంగ్మూలాన్ని పోలీసులు నమోదుచేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు.

హిందీ మాట్లాడేవాళ్లు... టాయిలెట్లు కడుగుతున్నారు

డీఎంకే ఎంపీ దయానిధి మారన్ వ్యాఖ్యలు

- సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన గత మార్చి నాటి వీడియో క్లిప్
- బీజేపీ, ఆర్జేడీ నాయకులు తదితరుల తీవ్ర ఆగ్రహం
- ఉత్తర భారతీయులను అవమానిస్తున్నారని ధ్వజం

చెన్నై/పట్నా: తమిళనాడుకు చెందిన అధికార డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి దయానిధి మారన్ కొన్ని నెలల క్రితం చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం రగడ మొదలైంది. తమిళనాడులో బీజేపీ, డీఎంకే మధ్య మాటల యుద్ధం సాగుతోంది. హిందీ రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బిహార్ కార్మికులు తమిళనాడులో మరుగుదొడ్లు కడుగుతున్నారంటూ మారన్ ఈ ఏడాది మార్చి నెలలో ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మారన్ వైఖరిని బీజేపీ నేతలు తప్పుపడుతున్నారు. బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సైతం స్పందించారు. మార్చి జరిగిన కార్యక్రమంలో దయానిధి మారన్ మాట్లాడుతూ... తమిళ భాషతోపాటు ఆంగ్ల భాషను తమ పార్టీ ప్రోత్సహిస్తోందని, తమిళనాడు ప్రజలు ఆయా భాషలను చక్కగా నేర్చుకుంటున్నారని చెప్పారు. తమిళనాడుకు చెందిన సుందర్ పిచాయ్ ఇప్పుడు గూగుల్ కంపెనీకి సీఈఓగా ఎదిగాడని గుర్తుచేశారు. ఒకవేళ సుందర్ పిచాయ్ హిందీ నేర్చుకొని ఉంటే నిర్మాణ రంగంలో సాధారణ కార్మికుడిగా పని చేసుకుంటూ ఉండేవాడని అన్నారు. తమిళనాడు విద్యార్థులు ఇంగ్లిష్ నేర్చుకొని ఐటీ కంపెనీల్లో పెద్ద హోదాల్లో ఉద్యోగాలు సంపాదిస్తున్నారని, మెరుగైన వేతనాలు పొందుతున్నారని తెలిపారు. హిందీ మాత్రమే నేర్చుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్ వాసులు తమిళనాడుకు వలస వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్నారని, రోడ్లు ఊడుస్తున్నారని, టాయిలెట్లు కడుగుతున్నారని చెప్పారు. హిందీ మాత్రమే నేర్చుకుంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని అన్నారు. మారన్ మాట్లాడిన వీడియో క్లిప్ సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

డీఎంకే రంగు బయటపడింది: బీజేపీ

హిందీ రాష్ట్రాల ప్రజల గురించి ప్రస్తావిస్తూ మారన్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీ మాట్లాడేవారిని, ఉత్తర భారతీయులను అవమానించడం డీఎంకే నేతలకు అలవాటుగా మారిందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో విమర్శించారు. ఆ పార్టీ నుంచి ఒకరి తర్వాత ఒకరు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డీఎంకే నాయకులు సనాతన ధర్మంపై దాడి చేశారని చెప్పారు. ఇంత జరుగుతున్నా విపక్ష 'ఇండియా' కూటమి నేతలు నోరువిప్పడం లేదని ఆక్షేపించారు. ఇతరులను కించపర్చడం తగదని డీఎంకే నేతలకు హితవు పలికారు. మారన్ వ్యాఖ్యలు కొన్ని నెలల క్రితం నాటివే అయినప్పటికీ డీఎంకే అసలు రంగు మళ్లీ బయటపడిందని తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షుడు నారాయణన్ తిరుపతి పేర్కొన్నారు. ఉత్తర భారతీయులను అవమానించేలా, దూషించేలా డీఎంకే పెద్దలు తరచుగా



మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. భవిష్యత్తులోనూ వారు వైఖరి మార్చుకుంటారన్న నమ్మకం తనకు లేదన్నారు.

అన్ని రాష్ట్రాలూ సమానమే: డీఎంకే

బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు వీడియోను వ్యాప్తిలోకి తీసుకొస్తున్నారని డీఎంకే అధికార ప్రతినిధి జె.కాన్‌స్టాండైన్ రవీంద్రన్ ఆరోపించారు. సమతావాద సమాజానికి తమ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. ఒక రాష్ట్రం ఎక్కువ, మరో రాష్ట్రం తక్కువ అనేది తమ విధానం కాదని, అన్ని రాష్ట్రాలూ సమానమేనని అన్నారు. మారన్ ఏనాడూ చెప్పని మాటలను చెప్పినట్లుగా బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ''మాతృ భాషతోపాటు ఆంగ్లమూ నేర్చుకుంటే మంచి అవకాశాలు లభిస్తాయన్నది మారన్ ఉద్దేశం. ఇంగ్లిష్ నేర్చుకున్నవారికి ఇండియాలోనే గాక ప్రపంచమంతటా డిమాండ్ ఉంది. మారన్ చెప్పిందీ అదే'' అన్నారు.

పరస్పరం గౌరవించుకోవాలి: తేజస్వీ

దయానిధి మారన్ వ్యాఖ్యలను బిహార్ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆదివారం ఖండించారు. తమ పార్టీ తరహాలోనే డీఎంకే కూడా సామాజిక న్యాయాన్ని నమ్ముతుందని చెప్పారు. అలాంటి పార్టీ నేత ఇతర రాష్ట్రాల వారిని అవమానించేలా మాట్లాడడం శోచనీయమని అన్నారు. కుల అసమానతలు, కొన్ని కులాల వారే ప్రమాదకరమైన పనులు చేయడం గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కానీ, ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రజలందరినీ ఇందులోకి లాగడం సమంజసం కాదని చెప్పారు. ఇతర రాష్ట్రాల ప్రజలను గౌరవించాలని సూచించారు. పరస్పరం గౌరవించుకోవడం సముచితమని తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. తాము ఇతరులను గౌరవిస్తామని, వారి నుంచి గౌరవాన్ని కోరుకుంటున్నామని ఉద్ఘాటించారు.

సాక్షి
కరీంనగర్

సోమవారం ; 25 ; డిసెంబర్ ; 2023







హ్యాపీ క్రిస్మస్.. మెరీ క్రిస్మస్



కరుణామయుని కోవెలలు కోటి కాంతులీనుతున్నాయి. ఏ ఇంట చూసినా ఆకాశంలో తారలను తలదన్నేలా తళుక్కుమంటున్న నక్షత్రాలు.. క్రిస్మస్ ట్రీల ధగధగలు.. క్రీస్తు జనన వేళ ఘనంగా ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రార్థనమందిరాలు విద్యుత్‌కాంతులలో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. అంధకారంలో జీవిస్తున్న సామాన్యులను పునీతం చేసేం దుకు పరమాత్ముడే ప్రభువైన ఏసుక్రీస్తుగా జన్మించాడని విశ్వసించేప్రపంచవ్యాప్త క్రైస్తవులు మంగళవారం క్రిస్‌మస్‌ను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ప్రార్థన మందిరాలలో ఆదివారం అర్ధరాత్రి క్రైస్తవులు కేక్ కట్‌చేసి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. లూర్థు మాతా చర్చిలో రోమన్ క్యాథలిక్స్ ఆధ్వర్యంలో బాల ఏసు జన్మదిన వేడుకలు అర్ధరాత్రి ఘనంగా నిర్వహించా రు. ఫాదర్ ఆర్.థామస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ పంచారు. క్వాయర్స్ బృందం ఆధ్వర్యంలో గీతాలు ఆకట్టుకున్నాయి.

- కరీంనగర్ కల్చరల్

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కరీంనగర్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నియమించింది. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాకు నియమిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకం కాగా, హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు.

బస్సు ప్రమాదంపై సజ్జనార్ ఆరా



కరీంనగర్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోకు చెందిన పల్లె వెలుగు అద్దె బస్సు ఆదివారం మధ్యాహ్నం హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద ప్రమాదానికి గురైన విషయంపై ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ విచారణకు ఆదేశించారు. హుజూరాబాద్–హన్మకొండ రూట్‌లో వెళ్తున్న బస్సు ఎల్కతుర్తి సమీపంలోకి రాగానే వెనుక టైర్లు ఊడిపోయి ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ప్రమాదం ఎలా జరిగింది? తదితరాలు సజ్జనార్ ఆరాతీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పల్లె వెలుగు బస్సు ప్రమాదంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారని వారిని సురక్షితంగా ఇతర బస్సులో గమ్యస్థానాలకు పంపించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అద్దె బస్సుల నిర్వహణ విషయంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ తనిఖీలు చేస్తూ.. బస్సు ఫిట్‌గా ఉంచుకోవాలన్నారు. బస్సుల నిర్వహణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రేపు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి సాహితీ, ఉపాధ్యాయుడు మేడి చంద్రయ్య ఆధ్వర్యంలో 128వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవులు తమ కవితలతో సుభాష్‌నగర్ ఎస్సీ హాస్టల్ గేట్ ఎదురు లైన్, వనీత నర్సింగ్ హోమ్ పక్క గల్లీలోని చంద్రయ్య నివాసంలో హాజరు కావాలని కోరారు.

మహాశక్తి ఆలయంలో పడిపూజ

కరీంనగర్‌లోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పూజలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పాల్గొంటారన్నారు.

27న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కరీంనగర్: సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, అలిమ్‌కో సహకారంతో వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న వికలాంగులకు సహాయ ఉపకరణాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అలిమ్‌కో ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన ఎంపిక శిబిరంలో పాల్గొన్న వికలాంగుల్లో 731 మంది వివిధ ఉపకరణాల పంపిణీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారికి ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్ వంటివి అందించనున్నట్లు వివరించారు. 27న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇదివరకే ఎంపిక శిబిరాలు నిర్వహించినప్పుడు అక్కడికి హాజరై పేర్లు నమోదు చేసుకొని సహాయ ఉపకరణానికి ఎంపికైన దివ్యాంగులు అందరూ హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారందరికీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్ల ద్వారా సమాచారం అందించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైనవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు ఇదివరకు ఉపకరణాల ఎంపిక క్యాంపులో నమోదు చేసుకున్న రసీదు తీసుకొని రావాలని సూచించారు. ఉపకరణం పొందిన ప్రతీ దివ్యాంగుడి ఫొటోతో పాటు అందించిన ఉపకరణం వివరాలను అర్జున్ పోర్టల్‌లో నమోదు చేస్తామని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు అలిమ్‌కో, జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.







సీఎం రివ్యూలో జిల్లా మంత్రులు, కలెక్టర్, సీపీ

హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు. జిల్లాలోని పరిస్థితి.. పథకాల సమాచారాన్ని సీఎంకు నివేదించారు. –కరీంనగర్

జలుబు.. దగ్గు.. జ్వరం

విజృంభిస్తున్న వ్యాధులు
- గొంతు నొప్పితో బాధపడుతున్న జనం
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- మళ్లీ భయపెడుతున్న కరోనా



రోగులతో నిండిన ఇన్‌పేషెంట్ వార్డు

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఓపీ విభాగం రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజూ 400 నుంచి 500 మందికి పైగా రోగులు రావడంతో ఆస్పత్రిలోని ఓపీ టికెట్లు ఇచ్చే హాల్ నిండి బయట వరకు క్యూకడుతున్నారు. పేరు నమోదుకు గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత వారం రోజులుగా ఓపీ విభాగానికి రోగుల తాకిడి పెరిగింది. ఇటీవల చలిపెరిగి వాతావరణంలో మార్పులు రావడంతో జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి బారిన పడుతున్నారు. దీంతో రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది.

వాతావరణ మార్పులతో..

వాతావరణ మార్పులతో జిల్లాలో ఒక్కసారిగా జ్వరాలు ప్రబలుతున్నాయి. చలి గజగజ వణికిస్తోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడంతో వృద్ధులు, చిన్నారుల్లో శ్వాస సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయి. చలితీవ్రత వల్ల జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పేరు నమోదుకు జనం బారులు తీరుతున్నారు. ఇందులో చాలా మంది దగ్గు, జ్వరం, జలుబు, గొంతు, ఒళ్లు నొప్పులతో వచ్చినవారే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రోగులతో కిటకిట..

చలితీవ్రత కారణంగా ఒక్కసారిగా జ్వరాల కేసులు పెరిగాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. చాలా మంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచానపడుతున్నారు. ముఖ్యంగా గొంతు నొప్పి ఎక్కువ మందిలో కనిపిస్తుండడంతో కరోనా అనే భయంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.



మందుల కోసం క్యూలో నిల్చున్న రోగులు

కరోనా కలకలం

జిల్లాలో జ్వరాలు ప్రజలను వణికిస్తుంటే మరో వైపు కరోనా కలకలం రేపుతోంది. వారం రోజులుగా రాష్ట్రంలో అక్కడక్కడా కరోనా కేసులు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కరోనా ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్–1 సబ్ వేరియంట్ రూపంలో భయపెడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కానప్పటికీ హైదరబాద్‌లో 6 కేసులు నమోదుకావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల అధికారులను అలర్ట్ చేసింది. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉండడంతో పాటు వారానికి పైగా తగ్గకుండా ఉన్నవారికి కరోనా అనుమానం ఉంటే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ప్రభుత్వ ప్రధానాసుపత్రితో పాటు అన్ని పీహెచ్‌సీల్లో అనుమానితులకు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వైద్యులు, మందులు

వ్యాధులు ప్రబలుతుండడంతో జిల్లా ఆసుపత్రిలో మందులు, వైద్యులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నాం. పేషెంట్లు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కువగా దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటి జబ్బుల బారిన ప్రజలు పడుతున్నారు. చాలా మంది ఓపీ చూపించుకొని మందులు తీసుకొని వెళుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆసుపత్రిలో జాయిన్ చేసుకొని చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ వీరారెడ్డి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

కోడళ్లకు నో రేషన్

- అక్కడ తొలగించారు.. ఇక్కడ చేర్చలేదు
- పెళ్లయిన ఆడపిల్లల పేర్ల తొలగింపు
- జిల్లాలో 8620 మంది ఎదురుచూపులు
- వేలల్లో కొత్త దరఖాస్తులు

కొత్తకార్డుల దరఖాస్తులు : 14,978

సభ్యులను చేర్చేందుకు వచ్చిన అర్జీలు: 47,012

'నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన కత్తురోజు రమేశ్‌కు ఏడాది క్రితం వివాహమైంది. హుజూరాబాద్ నుంచి అఖిలను పెళ్లి చేసుకోగా ఆమెపేరును తల్లిగారింట తొలగించారు. ఈ క్రమంలో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటికీ మంజూరు కాలేదు. ఇది ఒక అఖిల పరిస్థితే కాదు జిల్లావ్యాప్తంగా వేలల్లో ఉన్న కోడళ్లది.

కరీంనగర్ అర్బన్: రేషన్‌కార్డుల జారీ ఎటూతేలకపోవడం కోడళ్లకు శాపంగా మారింది. ఇంటిపేరు మారినా రేషన్‌కార్డులో పేరు చేరకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో వేలమంది నిరీక్షిస్తుండగా అధికార యంత్రాంగం సమాధానమివ్వలేని పరిస్థితి. గత అయిదేళ్లుగా దరఖాస్తులు కుప్పల్లా పేరుకుపోతుండగా కార్డుల జారీ ప్రశ్నార్థకం. ఇక పేర్ల తొలగింపు ప్రక్రియ నిరంతరం సాగుతుండగా కొత్తకార్డుల జారీలో మాత్రం అలసత్వమే. కార్డుల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని యంత్రాంగం చెబుతుండగా నిరీక్షణ ఇంకెన్నాళ్లన్న అసహనం వ్యక్తమవుతోంది.

దరఖాస్తు చేసి ఏళ్లు.. మంజూరుకు ఎన్నేళ్లు

కొత్తకార్డుకు దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తుండగా స్పష్టమైన ప్రకటన లేదని వాపోతున్నారు. తనకు అయిదేళ్ల క్రితం వివాహమైందని, పిల్లలు పుట్టారని అయినా కార్డు మంజూరు కాలేదని చొప్పదండికి చెందిన రాజు వివరించారు. జిల్లాలో 512 రేషన్‌దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండగా 2.70లక్షల కార్డుదారులున్నారు. పెళ్లికాగానే తమ పేరును తొలగించాలని కొందరు యువతులు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. వారి పేరు మీద ఉన్న యూనిట్‌ను అధికారులు తొలగిస్తున్నారు. అత్తారింటి కార్డులో పేరు చేర్చే ఆప్షన్ లేకపోవడంతో కొందరు తొలగింపునకు ఒప్పుకోవడం లేదు.



సదరు కార్డులు అలాగే కొనసాగుతుండగా పలు గ్రామాల్లో పేర్లు తొలగించాలని తహసీల్దార్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు విచారణ చేసి తొలగిస్తున్నారు. ఈ మూడేళ్లలో జిల్లావ్యాప్తంగా అత్తింటి కార్డులో ఒక్కపేరు చేర్చలేదని తెలుస్తోంది.

ఒక్కో కార్డుకు రూ.25 వసూలు

రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు రేషన్‌కార్డులు పంపిణీ చేయలేదు. గతంలో ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు కొత్త కార్డులు ముద్రించగా జిల్లాల విభజనతో సదరు కార్డులను మూలనపడేశారు. దీంతో డీలర్లే కార్డులు ముద్రించి లబ్ధిదారుల పేర్లు రాసిస్తున్నారు. ఒక్కోకార్డుకు రూ.25వరకు వసూలు చేస్తున్నారు. కొత్తకార్డులు, పేర్లు చేర్పించేందుకు మీసేవ కేంద్రాల్లో వేలల్లో దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. అధికారులు విచారణచేసి అర్హులకు అనుమతిచ్చి కమిషనరేట్ లాగిన్‌కు పంపించారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడక మూడేళ్ల నుంచి ముందుకు సాగడం లేదు. అయితే కొత్తకార్డుల జారీపై ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని, కోడళ్లు తమ పేరును అత్తారింటి కార్డులో చేర్చేందుకు మీసేవలో నమోదు చేసుకోవచ్చని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ఫిబ్రవరి 11నుంచి 18 వరకు వేడుకలు
- 15న వెంకన్న కల్యాణం.. 18న శోభాయాత్ర
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ కూరగాయల మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సప్తమ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆలయ కమిటీ సమక్షంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 11న అధ్యయనోత్సవాలతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 18వ తేదీన శోభాయాత్రతో ముగుస్తాయని వివరించారు. 12న పుట్టమన్ను తేవడం, 14న కల్పవృక్ష వాహన సేవ, ఎదుర్కోళ్లు, 15న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. 17న మహాపూర్ణాహుతి, చక్ర వసంతోత్సవం, 18న రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ ప్రాంగణం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు తన వంతుగా రూ.5లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కమలాకర్ అందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, గంగాధర్, డైరెక్టర్ పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న రైతులు

గన్నేరువరం: మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వకు అనుసంధానంగా నిర్మించిన ఉపకాల్వ– 14 సమీపంలో ఉన్న వ్యవసాయ బావులను పూడ్చవద్దని వేడుకుంటూ గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కాల్వ సమీపంలో మట్టితో వెళ్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రబీ పనుల్లో రైతులందరూ నిమగ్నమయ్యారని, ఈ బావులపై ఆధారపడి నాట్లు వేసుకుంటున్నామని తెలిపారు. బావుల పూడ్చివేత వల్ల పొలాలకు సాగు నీరు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చర్యల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఈ పనులను వెంటనే అధికారులు నిలిపివేసి, మూడు నెలల సమయం ఇవ్వాలని కోరారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొల్లు అజయ్‌వర్మ, వార్డు సభ్యుడు నాగపూరి శంకర్, రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



పనులపై అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

సంతకం పెట్టకపోతే అంతే..!

- నా గురించి తెలుసుకదా.. మీ ఎంబడి పడుతా..
- మళ్లీ మొదలైన డీఈ వేధింపులు
- బల్దియాలో ఆగని ఆగడాలు



కరీంనగర్ కార్పొరేషన్: 'బిల్లులో ఏముందనేది సంబంధం లేదు.. నేను చెప్పిందానికి సంతకం పెట్టలేదంటే అంతే. మీ ఎంబడి పడుడైతది చెబుతున్నా.. నా గురించి తెలుసు కదా.. నన్ను ఏ కొడుకు.. ఏం చేయలేడు'.. ఇది నగరపాలకసంస్థలో ఓ డీఈ దౌర్జన్యకాండ. నగరపాలక సంస్థలో పనులు పూర్తికాకున్నా బిల్లులపై సంతకాల కోసం ఇంజినీరింగ్ అధికారులపై వివాదాస్పద డీఈ వేధింపులు మళ్లీ మొదలయ్యాయి. నిత్యం వివాదాల్లో ఉండే సదరు డీఈ కాంట్రాక్టర్ల తరఫున రంగంలోకి దిగాడు. ఏఈలు, డీఈలను సంతకాలకోసం బెదిరిస్తుండగా, వారు సెలవుపై వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

పూర్తి కాని, నాణ్యత పాటించని పనులకు..

ఓ వైపు స్మార్ట్ సిటీ, సీఎంఏ తదితర నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో వందల కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు జరిగాయని అధికార, విపక్షాలనే తేడా లేకుండా ఫిర్యాదులు చేస్తుంటే.. మరో వైపు ఎలాంటి భయం లేకుండా పూర్తి కాని, నాణ్యత పాటించని పనులకు రికార్డులు తయారు చేసి బిల్లులు ఎత్తే పనిని సదరు డీఈ విజయవంతంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యాడు. దీనికోసం ఏఈలు, సహచర డీఈలపై బెదిరింపులకు దిగుతున్నాడు. సంతకాలు పెట్టకపోతే మీ సంగతి చెబుతానంటూ బూతులందుకుంటున్నాడు.

మళ్లీ వేధింపులు షురూ

బల్దియాలో వివాదాస్పద అధికారిగా పేరొందిన సదరు డీఈ బెదిరింపులు మళ్లీ మొదలయ్యాయి. గతంలో ఉన్నతాధికారులను సైతం అసభ్యపదజాలంతో దూషించిన వ్యవహారం అప్పట్లో కలకలం సృష్టించింది. కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న ఆయన నాలుగైదు రోజుల నుంచి కిందిస్థాయి, సహచర, ఉన్నత అనే తేడా లేకుండా ఇంజినీరింగ్ అధికారులపై దూషణలకు దిగుతున్నాడు. వారి పరిధిలోని పనులకు సంబంధించిన బిల్లుల తయారీలో సంతకాలు పెట్టాలంటూ ఒత్తిడి తెస్తున్నాడు.

సెలవుల్లో వెళ్లేందుకు ప్రయత్నం

సదరు డీఈ ఆగడాలు ఎక్కువవుతున్న క్రమంలో సెలవులో వెళ్లేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. నగరపాలకసంస్థలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ముఖ్యంగా ఇంజినీరింగ్ అధికారులు ఒత్తిడిలో ఉన్నారు. ఈ క్రమంలో డీఈ సంతకాల కోసం దౌర్జన్యానికి దిగుతుండడంతో తాము సంతకాలు చేసి ఉద్యోగాలను ఫణంగా పెట్టలేమని అధికారులు పేర్కొంటున్నారు. దీనికన్నా సెలవులో వెళ్లడం మేలని, అవసరమైతే బదిలీకి కూడా సిద్ధపడుతున్నారు. కాగా నగరంలో అభివృద్ధి పనుల్లో జరుగుతున్న అక్రమాలు, సదరు డీఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించి ఆయన ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉన్నతాధికారులపై ఉంది.

క్రైస్తవులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



కరీంనగర్: క్రిస్మస్ సందర్భంగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లా ప్రజలు, క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు మార్గం ఆదర్శం..ఆచరనీయమన్నారు. ప్రతీఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీకి వినతి

కరీంనగర్: పదమూడు జిల్లాల ఉపాధ్యాయ స్పౌజ్ బాధితులను వెంటనే వారు కోరుకున్న జిల్లాలకు బదిలీ చేయాలని జిల్లా స్పౌజ్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. స్పౌజ్ ఫోరం జిల్లా కన్వీనర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, రెండేళ్లకు పైగా అభ్యర్థన చేస్తున్న సమస్య అలాగే ఉందని, ఈ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ఉపాధ్యాయ దంపతుల బదిలీలు కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లో ఉందని, 1655 సర్క్యులర్ ప్రకారం ఉపాధ్యాయ దంపతుల బదిలీలు సరైనదని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు.ఉపాధ్యాయ దంపతుల బదిలీలను మానవీయ కోణంలో సాధ్యమైనంత తొందరగా చేపడతామని, సీఎంకు సమాచారం చేరవేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఫోరం సభ్యులు కె.జీవన్ రెడ్డి, కె.లక్ష్మీపతి, సీహెచ్.రామకృష్ణ, టి.వీరేందర్, జి.శ్రీనివాస్‌రెడ్డి, బి.శంకర్, సీహెచ్ సరిత ఉన్నారు.



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


కాయితి రోహిణి

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ శివారులోని జగ్గారావుపల్లెకు చెందిన కాయితి రోహిణి జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ దుప్పటి రవికుమార్ ఆదివారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. రోహిణి ఈనెల 25 నుంచి 30 వరకు బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్–17 పోటీల్లో పాల్గొంటారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున రోహిణి పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ వివరించారు.

అదృశ్యం కేసు నమోదు


వినోద్‌కుమార్

జమ్మికుంట: పట్టణంలో ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నందికొట్కూర్ గ్రామానికి చెందిన పోతుల వినోద్‌కుమార్ అత్తగారి ఊరు జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని, బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోతుల అరుణ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అదుపుతప్పి లారీ బోల్తా


బోల్తా పడ్డ లారీ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో ఆదివారం యాష్‌లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఎన్టీపీసీ నుంచి యాష్ లోడ్‌తో బేగంపేట వైపు వెళ్లే క్రమంలో హఠాత్తుగా ఆటో అడ్డు రావడంతో అదుపుతప్పిన లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమా దం జరగలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.

లోకానికి వెలుగై...

- అంధకారంలో ఆశాకిరణమై
- లోకప్రభువు క్రీస్తు జననం
- నేడు క్రిస్మస్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముస్తాబైన చర్చిలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు


విద్యుత్ వెలుగుల్లో చర్చి


చర్చి వద్ద క్రిస్టియన్ల సందడి


భక్తి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

కరీంనగర్ కల్చరల్: 2018 సంవత్సరాల క్రితం.. మనిషి జన్మతః పాపి అని భావింపబడే కాలం అది. ప్రజలు తీవ్ర అశాంతి, అసహనం, సామరస్య లేమితో సతమతమవుతున్న జీవనవిధానం. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో పాపులను పరిరక్షించేందుకు అంధకారంలో ఆశాకిరణంలా ఏసు క్రీస్తు జన్మించారు. పాపాత్ముల అంతరంగాలను ప్రక్షాళనం చేసి ప్రశాంత జీవనం వైపు, మోక్షమార్గం వైపు ప్రజలను నడిపించేందుకు సాక్షాత్తు భగవత్‌స్వరూపంగా అవనిపై అవతరించిన మహనీయుడు క్రీస్తు అని అతని విశ్వాసులు భావిస్తుంటారు. బెత్లెహాం అనే ఊరిలో వడ్రంగి కుటుంబానికి చెందిన కన్య మేరీ గర్భంలో క్రీస్తు జన్మించారు. ఏసు జనానికి సంకేతంగా ఆకాశంలో ఓ నక్షత్రం మెరిసిందంటారు. కేవలం ముప్పది మూడున్నర సంవత్సరాలు మాత్రమే జీవించి ఉన్న క్రీస్తు తన శాంతి వచనాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విశ్వాసులకు ఆరాధ్యుడయ్యారు. ఆర్తులు, అన్నార్తులు, అంగవైకల్యులు, వేదనల్లో ఉన్న వాళ్లకు చేరువయ్యారు. బాధల్ని రూపుమాపేందుకు తాను శిలువనెక్కి రక్త తర్పణంతో జనం బాధల్ని విముక్తి చేసి త్యాగశీలుడయ్యారు. ప్రజల కోసం జన్మించి, ప్రజల కోసం మరణించి, తిరిగి వాళ్ల కోసమే పునర్జీవించిన మహానుభావుడు క్రీస్తు. లోకరక్షణకు అవతతరించిన రక్షకుడి జన్మదినం రోజున ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకు విశ్వాసులు ప్రత్యేక ఆరాధనలు జరిపే రోజే క్రిస్మస్. అన్ని దేశాల ప్రజలకు రక్షకుడిగా పాపాలను క్షమించి పునీతులను చేసిన ఏసు శాంతి కాముకుడయ్యాడు. విశ్వ రక్షణ కోసం రక్తాన్ని ధారపోసిన ప్రభువు ఏసు చాటిన మార్గాన్ని అనుసరిస్తే ఈ లోకం నుంచి పరలోకం వరకు చేసే ప్రయాణం క్షేమంగా ఉంటుందనేని విశ్వాసుల అభిప్రాయం.

మరణం విషాదం

పాపరహిత రుధిరంతో మానవాళి పాపాలను కడిగేందుకు ప్రయత్నించిన ఏసుక్రీస్తు బోధనలను యూదులు అంగీకరించలేదు. దైవదూషణ ఆరోపణతో శిలువ వేశారు. పాపుల కోసం బలిదానం చేసే సమయంలోనూ అమాయకత్వంతో యూదులు చేసే అకృత్యాలను క్షమించమని ప్రార్థించడం అంతులేని ఆయన క్షమాగుణానికి పరాకాష్టగా నిలిచింది. అయినా మూడు రోజుల్లోనే మృత్యువును గెలిచి తన శిష్యులకు, విశ్వాసులకు అనేకసార్లు కనిపించి పరలోకానికి ఆరోహణమైనట్లు విశ్వాసులు భావిస్తారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ప్రేమ, క్షమ, శాంతి, సామరస్యాలే క్రీస్తు బోధనల్లోని ప్రధానాంశాలు. ఆత్మవివేచన, పరిపూర్ణ హృదయంతో దేవుడిని ఆరాధించడం, పొరుగు వారిని ప్రేమించడం, సృష్టియావత్తుకు సువార్తను ప్రకటించడం, పాపాన్ని క్షమించడంతో రక్షణపొందడం తదితర బోధనలు ప్రపంచానికి శాంతి ప్రాముఖ్యతను చాటిచెప్పాయి.

ఉత్సాహంగా క్రిస్మస్

క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకుంటారు. ప్రార్థన మందిరాలతోపాటు తమ గృహాలను అందంగా అలంకరించుకుంటారు. నూతన వస్త్రాలు ధరిస్తారు. క్రీస్తు జన్మసంకేతమైన నక్షత్రాలను తమ నివాసాలపై అలంకరిస్తారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతికి కార్యక్రమాలతో, క్రైస్తవ భక్తి గీతాలతో సందడి చేస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన కేక్‌లు కట్ చేసి ప్రభువు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకుంటారు.

క్రిస్మస్ ట్రీ నేపథ్యం

క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్మస్‌ట్రీని నెలకొల్పే ఆచారం 15వ శతాబ్దిలో ఆరంభమైంది. జర్మనీ తత్వవేత్త మార్టిన్ లూథర్ క్రిస్మస్‌కు ముందు రోజు ఆకాశం వంక చూస్తుండగా.. నక్షత్రాలను భూమిపైకి తీసుకొస్తే ఎలా ఉంటుందనే ఆలోచణకు ప్రతిరూపమే క్రిస్మస్‌ట్రీ. ప్రస్తుతం వీటిని ఇళ్లు, చర్చిల్లో ప్రత్యేక అలంకరణగా ఏర్పాటు చేస్తున్నారు.

సీఎస్ఐ వెస్లీ కెథడ్రల్ చర్చి

కరీంనగర్‌లో క్రైస్తవుల దైవప్రార్థనల కోసం ఎస్పీ కార్యాల యం సమీపంలో సీఎస్ఐ చర్చిని బ్రిటీష్ కాలంలో నిర్మించా రు. 1904లో చర్చి నిర్మాణం ప్రారంభమై 1912లో పూర్తయింది.

సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చి

కరీంనగర్‌లోని క్రిస్టియన్‌కాలనీలో మరో సీఎస్ఐ సెంటినరీవెస్లీ చర్చి నిర్మించారు. 1988 మే 15న ప్రారంభమై 1998లో పూర్తయింది. రూ.1.10కోట్లతో అధునాత శైలిలో నిర్మించారు. ఇవి కాకుండా నగరంలో లూర్థుమాత, సెయింట్ మార్క్స్‌చర్చిలతోపాటు నగర పరిసర ప్రాంతాల్లో పలు చర్చిలున్నాయి.

అమరకిరణం పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ, మంథని ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో దూడపాక శ్రీధర్ సంపాదకత్వంలో వెలువడిన అమరకిరణం పుస్తకాన్ని భవానీ సాహిత్యవేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురిని స్ఫూర్తి శిఖరం అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో గిన్నిస్ బుక్ సర్టిఫికెట్ హోల్డర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం, రవి పొర్ల వేణుగోపాలరావు, పర్యావరణవేత్త పిట్టల రవిబాబు, రంగస్థల నటి బీఎస్ కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్– 14 బేస్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన పలువురు బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ఆది వారం తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో బాలికల విభాగంలో బిరుదు మనస్వి, వైసిక, ప్రణవి, ప్రియాన్షు, సహస్రశ్రీ, బాలుర విభాగంలో వినిష్‌రావు, శశిధర్, భరద్వాజ్, కృష్ణ చైతన్య రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని వివరించా రు. మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూర్‌లో ఆది వారం నుంచి నిర్వహిస్తున్న పోటీల్లో వారు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

వార్ వన్‌సైడే..

సుల్తానాబాద్(పెద్దపల్లి): కార్మిక సంఘం ఎన్నికల్లో వార్ వన్ సైడ్‌గానే కార్మికులు సిద్ధమయ్యారని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ బాల్‌రాజు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పనిచేసేది ఏఐటీయూసీ ఒక్కటే అన్నారు. కొత్త బొ గ్గు గనుల అన్వేషణ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే సంఘానికి కార్మికులు అండగా నిలవాలని కోరారు. కొన్ని సంఘాలు ప్రలోభాలకు గురిచేసి ఓట్లను రాబట్టుకునేందుకు చూస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. నరసింహ, కె.సునీల్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


బాధితుడిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే సంజయ్


కాలి బూడిదైన ఇల్లు

- ఇంటి నుంచి వెళ్లిన కొద్దిసేపటికే చెలరేగిన మంటలు
- కాలిపోయిన రూ.4.50 లక్షలు.. పది తులాల బంగారు ఆభరణాలు

మెట్‌పల్లిరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటకు చెందిన గడ్డం సత్తయ్య ఇల్లు ఆదివారం దగ్ధమైంది. సత్తయ్య కుటుంబసభ్యులంతా పొలం పనులకు వెళ్లిన కొద్దిసేపటి ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో ఇంట్లో దాచిపెట్టిన రూ.4.50లక్షలు, 10తులాల బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కాలిపోయిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. తక్షణం సాయం కింద రూ.10 వేలు అందించారు. అన్ని విధాలా ఆదుకుంటానని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మీర్జంపేట గ్రా మ పంచాయతీ పరిధి పోచంపల్లి గ్రామానికి చెందిన కొప్పుల కృపాకర్(31)ఈనెల 22న పురుగుల మందు తాగినట్లు పోలీసులు ఆది వారం తెలిపారు. కృపాకర్ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికిగురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుడి భార్య లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మానసిక వేదనతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన గండికిడి రాము అలియాస్ రాంరెడ్డి(52) గతంలో మెడికల్ షాప్‌లో పని చేసి మానేశాడు. రెండేళ్ల నుంచి ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగకుండా ఉండేందుకు కుటుంబసభ్యులు మూడునెలలు హైదరాబాద్‌లో చికిత్స ఇప్పించారు. తిరిగి ఇంటికి వచ్చిన కొన్ని రోజుల బాగానే ఉన్న రాంరెడ్డి మళ్లీ మద్యం తాగేందుకు ప్రయత్నాలు చేశాడు. కుటుంబసభ్యులు మద్యం తాగవద్దని వారించడంతో తీవ్ర మానసిక వేదనకు గురి అయ్యాడు. ఆదివారం వేకువజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళమేసిన ఇంట్లో చోరీ

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేట గ్రామానికి చెందిన గాజర్ల నివేద ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నివేద తన తండ్రి అనారోగ్యానికి గురికావడంతో ఈనెల 22న ఇంటికి తాళంవేసి వెళ్లింది. దీనిని ఆసరగా చేసుకున్న దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో భద్రపర్చిన ముప్పావు తులం బంగారం, 33తులాల వెండి, రూ.27వేలు ఎత్తుకెళ్లారు. ఇంటి పక్కవారు ఆదివారం ఉదయం గమనించి నివేదకు సమాచారం అందించారు. ఆమె చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెంకటయ్య తెలిపారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ గెలిస్తే కొత్త బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం స్థానిక కాలనీప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఏఐటీయూసీ నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నృసింహాలయంలో బంగారు గొలుసు మాయం

- వెతికిచ్చిన ఆలయ సిబ్బంది


డాక్టర్ దంపతులకు బంగారు గొలుసును అప్పగిస్తున్న తిరుపతి

ధర్మపురి: దైవదర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన మెడలోని బంగారు గొలుసును ఆలయంలో పోగొట్టుకుంది. ఆలయ సిబ్బంది వెదికి అప్పగించారు. ఆలయ సిబ్బంది కథనం ప్రకారం.. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకం జరుగుతుండగా ప్రధాన ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి తన భార్యాపిల్లలతో కలిసి దైవదర్శనానికి వచ్చి అభిషేకంలో పాల్గొన్నారు. ఆ సమయంలో శ్రీనివాసరెడ్డి కూతురు మెడలోని బంగారు గొలుసు పడిపోయింది. కొద్దిసేపటికి చూసుకున్న వారు వెంటనే ఆలయ సిబ్బందికి తెలిపారు. అయితే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న తాత్కాలిక ఉద్యోగి మాదాసు తిరుపతి అభిషేకం టికెట్ల అమ్మకాల ఆధారంగా ఆలయంలోకి ఎవరెవరు వచ్చారు అని తెలుసుకుని సదరు భక్తులను ఆశ్రయించాడు. ఆ భక్తులు కూడా తమకు ఆలయంలో గొలుసు దొరికిందని తిరుపతికి ఇచ్చారు. బంగారు గొలుసును ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ దంపతులకు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలింపు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు


ఎల్లారెడ్డిపేటలో మారుతికి చికిత్స చేస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రం శివారులో ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన ఊరేం మారుతి మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఉంటున్న తన బావ నవీన్ ఇంట్లో పుట్టిన రోజు వేడుకలకు వచ్చాడు. మారుతి తన బంధువు ప్రత్యూషతో కలిసి సిరిసిల్లలో బట్టలు, కేక్ కొనుగోలు చేసుకొని తిరిగి వస్తుండగా.. శ్రీచైతన్య పాఠశాల వద్ద ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లకు వెళ్తున్న ఆటో ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో మారుతి, ప్రత్యూషతోపాటు సిరిసిల్ల మండలం రగుడుకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ రజాక్, మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనదారులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, ఆటోలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న వారిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రినిటి ఒలింపియాడ్ పరీక్షకు స్పందన


మాట్లాడుతున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ట్రినిటి కళాశాల యాజమాన్యం లెవల్–2 పరీక్షను జిల్లా కేంద్రంలోని వివిధ బ్రాంచ్‌లలో నిర్వహించింది. మొదటి లెవల్ పరీక్షను ఆయా స్కూల్స్ సెంటర్‌లలో ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహించారు. మొత్తం 304 స్కూళ్లలో మొదటి పరీక్షను 14,876 మంది విద్యార్థులు రాయగా, రెండో లెవల్‌కు 4,500 మంది అర్హత సాధించారు. ఆదివారం రెండో లెవల్ పరీక్షకు 3,806 మంది విద్యార్థులు (పదో తరగతి స్థాయి) హాజరయ్యారు. గణితం–40, ఫిజికల్ సైన్స్–30, బయోలాజికల్ సైన్స్–10 మార్కులకు 90 నిమిషాల సమయం కేటాయించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామానుజన్ జయంతి సందర్భంగా ఈనెల 26న బహుమతులు ప్రదానం చేయనున్నారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ.5 వేలు, నాల్గో బహుమతి రూ.3 వేలు, ఐదో బహుమతి రూ.2 వేలు, 6 నుంచి 10వ బహుమతి రూ.1,500, 20 కన్సోలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున ఇవ్వబడునని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ట్రినిటి కళాశాలలో చేరితే స్కాలర్‌షిప్‌లు సైతం ఇవ్వబడునని చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.


అమ్మవారికి కుంకుమపూజ నిర్వహిస్తున్న భక్తులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

హరహర మహాదేవ


రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

వేములవాడ: వరుస సెలవులు రావడంతో రాజన్న దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆదివారం దాదాపు 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

నేడు బైక్ ర్యాలీ, శోభాయాత్ర



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ట్రస్టు బాధ్యులు

విద్యానగర్: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో బైక్ ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ట్రస్టు బాధ్యులు తెలిపారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. బైక్ ర్యాలీ, శోభాయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు గాంధీరోడ్‌లోని శ్రీరాయాలయం నుంచి ప్రారంభమై టవర్ సర్కిల్, గంజ్ చౌరస్తా, శాస్త్రీరోడ్, కమాన్ చౌరస్తా, బస్టాండ్, గీతాభవన్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, సివిల్ హాస్పిటల్ మీదుగా శివాజీనగర్‌లోని విశ్వహిందు పరిషత్ కార్యాలయం వరకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో పండ్లు, చీరలు పంపిణీ



పండ్లు, చీరలు అందజేస్తున్న విద్యార్థులు

విద్యానగర్: క్రిస్మస్ సందర్భంగా ఆదివారం కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాంట్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల వసతి గృహంలోని మహిళలకు చీరలు, పురుషులకు దోవతులు అందజేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పద్మానగర్ మార్క్‌ఫెడ్ వాకర్స్ అసోసియేషన్, అపోలో రీచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 250 మంది వాకర్స్, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. వివిధ రకాల పరీక్షలు, డాక్టర్ కన్సల్టేషన్ అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు ప్రమోద్‌రావు, గిరిధర్, రామ్‌రెడ్డి, సూరన్న, రఘునందన్‌రాజు, ఉమాశంకర్, అపోలో రీచ్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

కొనే ప్రతీ వస్తువుకు రశీదు తీసుకోవాలి

కరీంనగర్: వస్తు సేవల విషయంలో అన్యాయం జరిగితే ఫిర్యాదు చేసి తగిన పరిహారం పొందే హక్కు కలిగి వినియోగదారుడే రారాజుగా మారే అవకాశం వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2020 కల్పించిందని వినియోగదారుల మండలి జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వినియోగదారుల హక్కుల పర్యవేక్షణలో ప్రజాచైతన్యం కీలకమని, కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసే ప్రతీ వస్తువుకు తగిన రశీదు తీసుకోవాలన్నారు. వస్తువుల నాణ్యత విషయంలో తమకు హక్కులు ఉంటాయని అన్నారు. మండలి సలహాదారు చంద్రప్రభాకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీలు పెరగడంతో వినియోగదారులకు కష్టాలు అధికమయ్యాయని, హైటెక్ పద్ధతుల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించడానికి ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ముజాఫర్, రామచంద్రారెడ్డి, రఘురాం, గంగాధర్, గంగారాం, మనోహర్, లక్ష్మారెడ్డి, రవీందర్, అరుణ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతం



హనుమత్ వ్రతంలో అర్చకులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని పరంధామాశ్రమం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ వ్రతాన్ని వైభవంగా చేపట్టారు. పరబ్రహ్మ నందగిరిస్వామి ఆధ్వర్యంలో పండితులు నమిలకొండ రమణాచార్య నిర్వహణలో మార్గశిర త్రయోదశి సందర్భంగా వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో బుస్స శ్రీనివాస్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రెండేళ్లయినా పూర్తికాలే..

- నత్తనడకన మల్టీపర్పస్ పార్క్ పనులు
- ఎన్నిసార్లు హెచ్చరించినా మారని తీరు



పనుల జాడ లేని మల్టీపర్పస్ పార్క్

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా నగరంలో చేపడుతున్న పనులు కొన్నిచోట్ల నత్తనడకను తలపిస్తున్నాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఓవైపు ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నా.. కాంట్రాక్టర్లు, అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. ప్రధానంగా నగరంలోని మల్టీపర్పస్ పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న పార్క్ పనులు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి.

రూ.5కోట్లు కేటాయింపు

నగరంలోని తెలంగాణ చౌక్ పక్కనున్న మల్టీపర్పస్ పాఠశాల ఆవరణలో అన్ని హంగులతో పార్క్‌ను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ.5కోట్లు కేటాయించారు. వీటితో దాదాపు రెండేళ్ల క్రితం పనులు మొదలుపెట్టారు. కాని రెండు సంవత్సరాలు దాటినా 30 శాతం పనులు కూడా ఇప్పటివరకు పూర్తి కాలేదు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఫౌంటేన్‌లు, గ్రీనరీ, స్కేటింగ్ తదితర ఆధునిక నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. సంబంధిత కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు సంవత్సరాలు గడుస్తున్నా కొనసాగుతూనే ఉన్నాయి.

మేయర్ హెచ్చరించినా..

పనుల్లో విపరీత జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ సునీల్‌రావు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెడుతామని గతంలో హెచ్చరించారు. అయినా పనుల్లో పురోగతి మాత్రం కనిపించడం లేదు. రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు సగం పనులు కూడా పూర్తి కాకపోవడం పనులు జరుగుతున్న తీరును తెలియజేస్తోంది. కేవలం వాకింగ్ ట్రాక్ పనులు మాత్రమే ప్రస్తుతం జరుగుతున్నాయి. అవి కూడా పూర్తి కావాల్సి ఉంది. ఇక టైల్స్, ఫౌంటేన్, గ్రీనరీ, స్కేటింగ్ తదితర పనుల జాడ కూడా కనిపించడం లేదు. గతంలో పార్క్ అభివృద్ధి పనుల ప్రగతిని ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షించినా ఫలితం మాత్రం ఉండడం లేదు. ఇప్పటికైనా పార్క్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ అధికారులపై ఉంది.

వేద భవనానికి దేవనాథ జీయర్‌స్వామి



ప్రవచనం చేస్తున్న దేవనాథ రామానుజ జీయర్‌స్వామి



హాజరైన విద్యార్థులు, భక్తులు

కరీంనగర్‌కల్చరల్: ధనుర్మాస పర్యటనలో భాగంగా ఆదివారం దేవనాథ రామానుజ జీయర్‌స్వామి వేద భవనం చేరుకున్నారు. స్వామిజీకి వికాస తరంగిణి కార్యకర్తలు, భక్తులు, వేదభవనం విద్యార్థులు, పండితులు స్వాగతం పలికారు. అనంతరం గీతాజయంతి సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు భగవద్గీతావధానం చేశారు. అవధానం చేసిన, పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులను స్వామిజీ అభినందించి మంగళాశాసనాలందించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేసి, ధనుర్మాస వైశిష్ట్యాన్ని వివరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కె.గౌతమరావు, సభ్యులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపొందాలి

చొప్పదండి: వచ్చే ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. మండలంలోని గుమ్లాపూర్ గుట్ట వద్ద గల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. వెంట మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఎంపీపీ రవీందర్, ర వీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: తొర్రూర్‌లో జరుగుతున్న 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్- 14 బేస్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన ఈశ్వర్, అక్షయ్ కార్తీక్, హర్షవర్ధన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని సూచించారు. విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీ జహదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆటం- 23 విజ్ఞాన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్ర విజ్ఞానాన్ని పుణికిపుచ్చుకోవాలని, విజ్ఞాన రంగంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థి దశలో తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పొల్యూషన్ ఫ్రీ, ట్రాన్స్‌పోర్టు, హైడ్రాలిక్ జాక్, మెడికల్ క్యాంపు, బ్లడ్ టెస్టింగ్, ఎకో సిస్టం, డ్రోన్ తదితర అంశాలను చక్కగా ప్రదర్శించారు. అనంతరం ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు చికెన్ కట్లెట్స్, వెజ్ కట్లెట్, చికెన్ బిర్యాని, బ్రెడ్ ఆమ్లెట్ తదితర వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ ఆర్.పృథ్వీరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'రసమయి బాలకిషన్ జోలికి రావొద్దు'



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జోలికి వస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోలీస్ స్టేషన్ ఎదుట రాజీవ్ రహదారిపై ఆదివారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు నుంచి వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సుభాష్‌నగర్ స్టేజీ వద్ద ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. కార్యక్రమంలో నాయకులు పాశం అశోక్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, బొజ్జ తిరుపతి, వడ్లూరి శంకర్, ల్యాగల వీరారెడ్డి, సల్ల రవీందర్, బోయిని కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, మల్లయ్య, జలపతి, తిరుపతి, ఆంజనేయులు, కృష్ణ, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా అరికట్టాలి

వీణవంక: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక రవాణాను నిలిపివేయాలని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అధికారులను కోరారు. మండలంలోని ఇసుక రీచ్‌లను ఆదివారం పరిశీలించారు. టీఎస్ఎండీసీలో ఓ మహిళా ఉన్నతాధికారి అక్రమాలకు పాల్పడుతోందని, గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం కేవలం ఉన్న స్టాక్ మాత్రమే అమ్ముకోవాలని, ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని తీర్పు ఇచ్చిందని, కానీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్న తదితరులు ఉన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ముందుగా సంఘం 17వ వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా వంగాల విజేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కొత్త తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్నం చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా వంగల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వంగల శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వంగల రాజిరెడ్డి, కార్యవర్గ, సలహా సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని కార్యవర్గం సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అందని సేవలు.. నెరవేరని లక్ష్యం

- ప్రారంభానికి నోచుకోని టీ ఫైబర్ నెట్
- గ్రామపంచాయతీల్లో నిరుపయోగంగా పరికరాలు



చామనపల్లి పంచాయతీలో టీ ఫైబర్ పరికరాలు



చామనపల్లి పంచాయతీ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్

కరీంనగర్‌రూరల్: పల్లెల్లో కాగిత రహిత సేవలందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. గతంలో ఎంపిక చేసిన క్లస్టర్ పంచాయతీలకు అందించిన కంప్యూటర్లు మూలన పడేయగా, పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలందించేందుకు ఫైబర్ నెట్ సేవలు ప్రారంభానికి నోచుకోవడంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైపులైన్ వేసే సమయంలో టీ ఫైబర్ కేబుల్ వేశారు. జిల్లా కేంద్రాల నుంచి గ్రామాలకు ఫైబర్ లైన్ వేసినప్పటికీ ఇంటర్నెట్ కేబుళ్ల లింకేజీ చేయకపోవడంతో పంచాయతీల్లో సాంకేతిక సేవలు పొందలేక పోతున్నారు.

పరికరాలు నిరుపయోగం

కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీలకు సాంకేతిక సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 2017లో టీ ఫైబర్ ఇంటర్నెట్ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ గ్రామపంచాయతీకి అవసరమైన టీ ఫైబర్ పైపులైన్ వేసి కేబుల్ బిగించారు. రెండేళ్ల క్రితం కంప్యూటర్లు, ఇంటర్నెట్ పరికరాలు, విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్లేట్లను అందించారు. గతేడాదినుంచి సాంకేతిక సిబ్బంది పంచాయతీలకు వచ్చి ట్రయల్స్ మాత్రమే నిర్వహిస్తున్నారే తప్ప పూర్తిస్థాయి సేవలందించడంలేదు. గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు, ఖర్చు, పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు, ఆదాయ, వ్యయాలు, మరణ, జనన ధ్రువీకరణ పత్రాల జారీ వంటివి డిజిటల్‌రూపంలో అందుబాటులోకి తీసుకరావాలన్నదే టీ ఫైబర్ ప్రధాన ఉద్దేశం. అయితే ఇప్పటివరకు టీ ఫైబర్ ఇంటర్నెట్ సేవలను వినియోగంలోకి తీసుకరాకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం ఆచరణలో విఫలమవుతోంది. ప్రజల్లో ఆధునిక సాంకేతిక పెరుగుతున్నప్పటికీ పంచాయతీల్లో మాత్రం పాత పద్ధతిలోనే సేవలందుతున్నాయి. గ్రామపంచాయతీ పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్న వారికి పంచాయతీ కార్యదర్శులు చేతిరాత రశీదులను జారీ చేసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

టీ ఫైబర్ సేవలు ప్రారంభం కాలేదు

గ్రామపంచాయతీల్లో టీ ఫైబర్ సేవలు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌ల ద్వారా ప్రతీ పంచాయతీ వివరాలను చూసుకునే అవకాశముంది.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో, కరీంనగర్ మండలం

మరుగుదొడ్లు వాడుతున్నారా..?

- స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో సర్వే
- పాత బిల్లులు చెల్లించేందుకు చర్యలు
- జిల్లాలో 994 మరుగుదొడ్ల నిర్మాణం
- రూ.1.05 కోట్ల పెండింగ్ బిల్లులు



మరుగుదొడ్లపై సర్వే చేస్తున్న ఎస్‌బీఎం సిబ్బంది

కరీంనగర్‌రూరల్: పల్లెలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లను నిర్మించింది. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేల బిల్లు చెల్లించారు. అయితే 2021 సెప్టెంబరు నుంచి ఎస్‌బీఎం కింద నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్త లబ్ధిదారులు సైతం బిల్లులు రావడంలేదనే కారణంతో నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఇంటింటా మరుగుదొడ్ల సర్వే చేయాలని ఆదేశించింది. అయితే ఎన్నికల నిర్వహణతో వాయిదా పడిన సర్వేను గత నాలుగు రోజుల నుంచి అధికారులు చేపట్టారు.

క్షేత్రస్థాయిలో విచారణ

గతంలో నిర్మించిన మరుగుదొడ్లు ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగంలో ఉన్నాయా లేదా అనేది క్షేత్రస్థాయిలో ఎస్‌బీఎం సిబ్బంది సర్వే చేస్తున్నారు. అధికారుల వద్ద ఉన్న జాబితా ప్రకారం లబ్ధిదారులు వారే ఉన్నారా లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. మరుగుదొడ్లను వాడుతున్నారా లేకుంటే వినియోగించాలని, ఏమైనా పెండింగ్ పనులుంటే పూర్తి చేయాలని లేకుంటే బిల్లు చెల్లించరని సూచిస్తున్నారు.

పాత బిల్లులకు మోక్షం

మరుగుదొడ్ల సర్వే పూర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులకు మోక్షం లభించే అవకాశాలున్నాయి. జిల్లాలో 994 మరుగుదొడ్లను నిర్మించగా రూ.1.05 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు రెండేళ్లుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎస్‌బీఎం సిబ్బంది గ్రామాల్లో సర్వే చేస్తూ లబ్ధిదారుల ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు.

28వరకు సర్వే పూర్తి..

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పక్కాగా సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎస్‌బీఎం సిబ్బంది సర్వే చేస్తుండగా, ఈ నెల 28వరకు పూర్తవుతోంది. నిబంధనల ప్రకారం నిర్మించిన మరుగుదొడ్లకు సర్వే పూర్తయిన అనంతరం బిల్లులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

– ఎల్.శ్రీలత, డీఆర్‌డీవో



నగునూర్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



దుర్శేడ్ హైస్కూల్‌లో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాలలోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయుల క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయికి చేరుకున్నామని పలువురు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కె.చుక్కారెడ్డి, మధుకర్, భారతలక్ష్మి, మమత, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ముకుందం, మునీర్‌అహ్మద్ ఖాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శిరీషా, గౌతమి, రవళి, స్వరూప, నవ్య, శ్రీనివాస్, సంజీవ్, ఉదయభాస్కర్, శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో..

కరీంనగర్ మండలం దుర్శేడ్ హైస్కూల్‌లో 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కూడా ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఉప సర్పంచు సుంకిశాల సంపత్‌రావు, వార్డుసభ్యులు కల్లెపల్లి అశోక్, ఆశాలు, తిరుపతి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, హరికృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళా నైపుణ్యం ప్రదర్శించాలి

రామడుగు: ఈ నెల 29న జరిగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో యువత కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు ఒక ప్రకటనలో కోరారు. ఎనిమిది అంశాల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



తిరుమల: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పుష్కరిణిలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ స్నపన తిరుమంజనం, శ్రీ సుద ర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని చేపట్టారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణా కరరెడ్డి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొ న్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ‘కూచిపూడి డ్యాన్స్ లెసన్’

గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారుల ప్రదర్శన

గచ్చిబౌలి (హైదరాబాద్): తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యంచేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలా ఏడు నిమిషాలపాటు కళాకారులు నృత్యంచేస్తూ అలరించారు. గురువు పసుమర్తి శేషబాబు ఆధ్వర్యంలో కళాకారులు ఏకకాలంలో నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రిషినాథ్ నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. 2020లో త్యాగరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలో ఏకకాలంలో 1,183 మంది కళాకారులు కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారని రిషినాథ్ తెలిపారు. కళలను ప్రోత్సహించి ప్రేరణ కల్గించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలోనే కళలను ప్రోత్సహించే సంఘాలుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ కూచిపూడి నృత్యం తెలుగువారికి ఎంతో ఇష్టమైందని, ఈ నృత్యరూపకం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లలిత, వ్యవస్థాపక అధ్యక్షుడు రమణారావు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న కళాకారులు... గిన్నిస్ రికార్డుతో మంత్రులు జూపల్లి, సీతక్క తదితరులు



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్

క్రిస్మస్ ప్రార్థనల్లో ఏపీ సీఎం జగన్

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు

సాక్షి కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇడుపులపాయలో ఉదయం 9.10 గంటల ప్రాంతంలో తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్దకు చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ బరువెక్కిన హృదయంతో ఘాట్ ప్రాంగణంలో అందరినీ పలుకరిస్తూ ముందుకు కదిలారు. ఇడుపులపాయలోని చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్ కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు.



ఇడుపులపాయ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విజయవాడకు సమీపంలోని పెనమలూరుకు చెందిన ఆటోడ్రైవర్ వెంకట్ (38)కు ఇటీవల ఆకస్మికంగా కాలు, చేయి చచ్చుబడిపోయాయి. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన నగరపాలక సంస్థ డ్రైయినేజీ విభాగ ఉద్యోగి రాజేష్ (42) విధుల్లో ఉండగా.. చేయి చచ్చుబడింది. క్షణాల్లోనే గుర్తించిన స్థానికులు వెంకట్, రాజేష్‌లను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తక్షణమే సీటీ స్కాన్ చేసిన వైద్యులు వారు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినట్టు గుర్తించారు. వెంటనే త్రోంబొలైసిస్ ఇంజెక్షన్స్ ఇచ్చారు. వైకల్యం రాకుండా ఇద్దరినీ కాపాడగలిగారు. సాధారణంగా 55-60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) సంభవించేది. ఇటీవల కాలంలో 45 ఏళ్లలోపు వారిలో ఈ కేసులు అధికమవుతున్నాయి.

యంగ్ స్ట్రోక్

- 30-45 ఏళ్లలోపు వారిలో పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- మహిళల్లో హార్మోన్ల ఇబ్బందులతో స్ట్రోక్
- వంశపారంపర్యం, జీవనశైలే కారణమంటున్న వైద్యులు
- స్మోకింగ్, డ్రగ్స్ కూడా స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయని వెల్లడి


లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఇటీవల కాలంలో స్ట్రోకింగ్ యంగ్ (45 ఏళ్లలోపు వారిలో బ్రెయిన్ స్ట్రోక్) కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్న వారిలో స్ట్రోకింగ్ యంగ్ కేసులు ఎక్కువగా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కదలిక లేని జీవన విధానం.. తీవ్రమైన వత్తిళ్లు.. రక్తం, రక్తనాళాల్లో లోపాలు.. ధూమపానం.. హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల వినియోగం.. వంశపారంపర్య కారణాలు 30 ఏళ్లకే బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి.

25% 'స్ట్రోకింగ్ యంగ్' కేసులే

ఒకప్పుడు వయస్సు 55, 60 ఏళ్ల వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారు. కానీ.. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారిలో 25 నుంచి 30 శాతం మంది 30-45 ఏళ్లలోపు యువతే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్నారు. స్ట్రోక్ తీవ్రతను బట్టి జనరల్ మెడిసిన్, ఏఎంసీ, న్యూరాలజీ విభాగాల్లో చికిత్స అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్న వారిలో రక్తంలో గడ్డలు ఏర్పడి మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వలన వచ్చే స్ట్రోక్ (ఇస్కిమిక్) 80 శాతం మంది, రక్తనాళాలు చిట్లిపోయి (హెమరైజ్) 20 శాతం మంది ఉంటున్నారు.

గోల్డెన్ అవర్‌లో గుర్తించడం ముఖ్యం

ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షణాలను గుర్తించి.. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే స్ట్రోక్ కారణంగా వైకల్యం బారినపడకుండా వైద్యులు కాపాడగలుగుతున్నారు. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చిన వారికి త్రోంబొలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తంలోని పూడికలు కరిగేలా చేస్తున్నారు. ముఖం, చేయి, కాలు ముఖ్యంగా శరీరం ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి, బలహీనత ఏర్పడటం, ఆకస్మికంగా గందరగోళం ఏర్పడటం, మాట్లాడటం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, కంటి చూపు మందగించడం, తల తిరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మికంగా తీవ్రమైన తలనొప్పి వంటివి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు.



యువకుల్లోనూ కేసులు



ఇటీవల 45 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతోంది. స్ట్రోక్ కేసుల్లో 25% యువతే ఉండటం గమనార్హం. బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు 4 గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే వైకల్యం లేకుండా కాపాడవచ్చు.

– డాక్టర్ దారా వెంకట రమణ, న్యూరాలజిస్ట్, జీజీహెచ్

స్ట్రోక్‌కు కారణాలివీ

పెద్ద వయసుల వారిలో రక్తపోటు, మధుమేహం స్ట్రోక్‌కు కారణమవుతోంది. అయితే.. 45 ఏళ్లలోపు వారిలో హోమోసిస్టీన్, సికిల్ సెల్ అనీమియా, రక్తంలో జన్యుపరమైన లోపాలు, హెరాయిన్ వంటి డ్రగ్స్ వినియోగం, మితిమీరిన మద్యపానం, ధూమపానం, ప్రమాదాల్లో తలకు గాయాలైన వారిలో ఎక్కువగా స్ట్రోక్ వస్తున్నట్టు వైద్యులు చెపుతున్నారు. వీటితో పాటు కదలిక లేని జీవన విధానం కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి స్ట్రోక్‌కు గురవుతున్న కేసులూ ఉంటున్నాయి. మహిళల్లో హార్మోన్స్ ఇబ్బందులు, రక్తనాళాల్లో లోపాల కారణంగా స్ట్రోక్ రావచ్చంటున్నారు. గుండె లోపాలు ఉన్న వారిలోనూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కడెం: మండలంలోని మారుమూల అల్లంపల్లి జీయర్ గురుకుల పాఠశాలలో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పలువురు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో జీయర్ గురుకులం విద్యార్థులు రోహిత్, హరిఓం, దిలీప్, జగన్, ఖానాపూర్ ఆశ్రమ పాఠశాలకు చెందిన నితిన్, ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సునీల్, బాలికల విభాగంలో జీయర్ గురుకులంతోపాటు, మామిడిగూడ, చికుగట్, మంచిర్యాల ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు లక్ష్మి, రూప, శ్రీజ, జారు, నిహారిక, మీనాక్షి, రుషిత ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, శాంతారాం స్వామిజీ, హెచ్ఎం చక్రధర్, ఆర్చరీ సంఘం జిల్లా సెక్రటరీ భుక్యా రమేశ్, పీడీ రవీందర్‌గౌడ్, కోచ్‌లు మారుతి, జగదిరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణిస్తా



అల్లంపల్లి జీయర్ గురుకులం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఇక్కడ రాణించి ప్రథమస్థానం సాధిస్తాననే నమ్మకం ఉంది. – రోహిత్, విద్యార్థి

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



అల్లంపల్లి జీయర్ గురుకులం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆర్చరీ నేర్చుకుంటున్నాను. జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో రాణించడం సంతోషంగా ఉంది. – దిలీప్‌కుమార్, విద్యార్థి

సంతోషంగా ఉంది



అల్లంపల్లి జీయర్ గురుకులంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాను. ప్రతీరోజు ఆర్చరీ ప్రాక్టీస్ ఎంతగానో ఉపయోగపడింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. – ఎం.హరిఓం, విద్యార్థి

మినీ అంగన్‌వాడీలకు మహర్దశ

- 25 మినీ సెంటర్లకు మోక్షం
- అప్‌గ్రేడ్ ఫైల్‌పై మంత్రి సీతక్క తొలిసంతకం
- పెరగనున్న వేతనాలు



అంగన్‌వాడీ సెంటర్

కరీంనగర్: ఏళ్లుగా నిరీక్షిస్తున్న మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసేందుకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీతక్క అప్‌గ్రేడ్ చేసే ఫైల్‌పై తొలిసంతకం చేయడంతో మినీ అంగన్‌వాడీలకు మహర్దశ పట్టనుంది. గతంలో వెయ్యి మంది జనాభా ఉన్న ప్రాంతానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పలురకాల సేవలందిస్తున్న విషయం తెలిసిందే. కాగా, వెయ్యిలోపు జనాభా ఉండి ప్రధాన కేంద్రాలకు దూరంగా ఉన్న ఆబాది గ్రామాలు, శివారు కాలనీ ప్రజల ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో 2014 వరకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే ఆ కేంద్రాల్లో ఒక ఉపాధ్యాయురాలిని మాత్రమే విధులు నిర్వహించాల్సి రావడంతో నాణ్యమైన సేవలు అందించడం గగనంగా మారింది. ఆయా కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఐసీడీఎస్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ కలగనుంది.

జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు..

కుటుంబ సర్వే ఆధారంగా అంగన్‌వాడీల నివేదికలు అందజేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించగా, జిల్లాలో నాలుగు ప్రాజెక్ట్‌లోని మినీ అంగన్‌వాడీల పరిధిలో గల కుటుంబాల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను గతంలోనే పంపారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనసాగుతున్న 25 మినీ సెంటర్లు ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయి. ఆయా కేంద్రాలకు ఆయాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించనుంది. జిల్లాలోని కరీంనగర్ అర్బన్, రూరల్, గంగాధర, హుజూరాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 752 మెయిన్, 25 మినీ సెంటర్లు ఉన్నాయి. కరీంనగర్ రూరల్‌లో 3, కరీంనగర్ అర్బన్‌లో 4, హుజూరాబాద్ పరిధిలో 18 మినీ కేంద్రాలున్నాయి. దశాబ్దంన్నర క్రితం ఆయా ప్రాంతాల్లోని జనాభా ప్రకారం రెవెన్యూ గ్రామాలకు దూరంగా ఉన్న చోట మినీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాలక్రమేణ బాలింతలు, గర్భిణులు, చిన్నారుల సంఖ్య పెరిగింది. దీనిని గమనించిన ప్రభుత్వం వీటిని అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రాల పెంపుతో ఆయాలు కూడా పెరిగి, అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఆయా కేంద్రాల్లోని టీచర్లకు వేతనం కూడా పెరగనుంది. ప్రస్తుతం వారి వేతనం రూ.7,500లు చెల్లిస్తుండగా మెయిన్ సెంటర్‌గా మారితే రూ.13,500 వరకు వేతనం పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ నిర్ణయం మేరకు



మినీ అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిని పెంచేందుకు ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. మినీ కేంద్రాల్లో టీచర్ మాత్రమే ఉండగా కేంద్రాలకు వచ్చే వారికి సేవలందించడానికి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొనసాగుతున్న 25 మినీ సెంటర్లు ప్రధాన కేంద్రాలుగా మారేందుకు అర్హత కలిగి ఉన్నాయి. లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉంటుంది.

– సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి

ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా రఘునాథ్‌రెడ్డి



రామకృష్ణాపూర్: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణాపూర్‌కు చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో రఘునాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రఘునాథ్ గతంలో రాష్ట్రకమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా పనిచేశారు. మరోసారి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కావటంతో స్థానిక ఫుట్‌బాల్ క్రీడాకారులు రఘునాథ్‌ను అభినందించారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

- అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి
- అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న భోజారెడ్డి, పార్థసారథి

ఆదిలాబాద్: ప్రతిభగల క్రీడాకారులకు పేదరికం అడ్డంకి కాదని, వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఎంపిక పోటీలను జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఆటల్లో సత్తాచాటేలా జిల్లా క్రీడాకారులకు శిక్షకులు మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన పలువురు క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు శంకర్, డీసీసీబీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్, పీ ఈటీలు రాకేశ్, జ్యోతిస్వరన్, సౌమ్య పాల్గొన్నారు.

కన్నిబాయికి అవార్డు

కెరమెరి(ఆసిఫాబాద్): సాహస కృత్యాల్లో ఇప్పటి వరకు ఎన్నో అవార్డులను అందుకున్న కెరమెరి మండలం భీమన్ గొంధికి చెందిన అడ్వెంచర్ క్లబ్ బ్రాండ్ అంబాసిడర్ మడావి కన్నిబాయిని మరో అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అడ్వెంచర్ ఆఫ్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ కె.రంగారావు ఆధ్వర్యంలో 'భారతదేశ హిమాలయా ప్రేమికురాలు' అవార్డు ప్రదానం చేశారు. ఢిల్లీ అడ్వెంచర్ క్లబ్ ప్రతినిధి కల్పేష్ బంద్రాంగ్ అవార్డు అందించారు. అడ్వెంచర్ క్లబ్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, శివలాల్ పాల్గొన్నారు. నిజామాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ డిస్కరీ అకాడమీ స్కూల్ ఉపాధ్యాయుల విన్నపం మేరకు 120 మంది విద్యార్థులకు ట్రెక్కింగ్, బోటింగ్, సాహస క్రీడలపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు.

అవార్డును అందుకుంటున్న కన్నిబాయి →



‘పెట్టుబడిదారీ’ సవాళ్లను అధిగమించాలి



మాట్లాడుతున్న రమ



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- బలమైన మూడు విప్లవ పార్టీల ఐక్యత నిర్మాణం అవసరం
- వచ్చే ఏడాది ఖమ్మంలో మూడురోజులపాటు మహాసభలు
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.రమ

రామగుండం: పెట్టుబడిదారీ సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవోద్యమంలో అనేక మార్పులు చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.రమ అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామంలో ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల సాధారణ సర్వ సభ్యసమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత విప్లవోద్యమం అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటోందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విప్లవ పార్టీల పంథా లేదన్నారు. దేశంలోని 14 రాష్ట్రాల్లో పనిచేసే మూడు విప్లవ పార్టీలు కలిసి చర్చించుకొని ఒక అవగాహనతో ఐక్యం కావాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగానే పీసీసీ(సీపీఐ- ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్సియేటివ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలు ఒక్కటి కానున్నాయన్నారు. ఈ మేరకు 2024 మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐక్యతా మహాసభలు నిర్వహిస్తామని అన్నారు. సభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, మార్త రాములు, పెండ్యాల రమేశ్, గొల్లపల్లి చంద్రయ్య, గూడూరి వైకుంఠం, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాధ, కట్ట తేజేశ్వర్, రెండు ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విప్లపార్టీల కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ప్రత్యేకం

సాక్షి ఫ్యామిలీ

కరీంనగర్
సోమవారం ॥ 25-12-2023



దివిలోను.. భువిలోనా... సంబరం

క్రిస్మస్ పర్వదినం

క్రీస్తు పుట్టుక సర్వ సృష్టికి పర్వదినం.. మనుజ కుమారుడిగా ఆ దేవాది దేవుడే ఈ భూతలంపైకి అరుదెంచిన అపురూప ఘట్టం. సర్వ మానవాళికి రక్షణ సౌభాగ్యం. ప్రతి ఒక్కరికి దేవుడు అందించిన శుభదినం.

■ పరలోకం పరవశించిన వేళ

మానవాళి రక్షణకు యేసు జననం అనివార్యమయినప్పుడు అది విశ్వవేడుకగా మారిపోయింది. రెండు వేల సంవత్సరాల క్రితం ఆ దేవాదిదేవుడే నరరూపిగా అరుదెంచేందుకు సిద్ధపడ్డాడు. నశించిపోతున్న మానవులందరికి తనని తాను బలి అర్పణగా అర్పించుకునేందుకు సిద్ధపడ్డ కరుణామయుని జననం కోసం అటు పరలోకం ఇటు భూలోకం సమాయత్తమయ్యాయి. దైవ సంకల్పం నెరవేర్చేందుకు పరలోక దూతాళి దిగివచ్చింది. గలిలయలోని నజరేతు గ్రామంలో దావీదు వంశస్థుడైన యోసేపునకు ప్రదానం చేయబడిన కన్యయైన మరియ వద్దకు పరలోకం నుంచి ముందుగా శుభవార్త తీసుకవచ్చారు. దయాప్రాప్తురాలా నీకు శుభం. ఆ దేవాది దేవుని కృపపొందిన నీవు ఒక కుమారుని కంటావు.. ఆ శిశువు గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడతాడు ఆయన రాజ్యం అంతం లేనిదై ఉంటుంది. ఇదంతా పరిశుద్ధాత్మ ద్వారా జరుగుతుంది కాబట్టి నీవు భయపడాల్సిన పనిలేదు. సర్వోన్నతుని శక్తి నీకు తోడుగా ఉంటుందని అభయమిచ్చాడు. మరియతో పాటు దేవదూత యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై ఇదంతా దేవుని సంకల్పంతో జరుగుతుంది కాబట్టి నీ భార్యను చేర్చుకొనుటకు సందేహింప వద్దని, పుట్టబోవు శిశువు తన ప్రజలను వారి పాపాల నుంచి రక్షిస్తాడు కాబట్టి యేసు అని నామకరణం చేయాలని చెబుతాడు. ఈ విధంగా మానవ ప్రమేయం లేకుండా పరమ దేవుడు పరిశుద్ధాత్మ శక్తి తో మరియ ద్వారా అవని మీద అవతరించడానికి మార్గం సుగమం అయింది.

■ భూలోకం మైమరచిపోయిన వేళ

యేసు పుట్టుక సమయంలో యోసేపు మరియను తీసుకుని తన సొంత గ్రామమైన బెత్లెహేముకు బయలుదేరతాడు. నిండు చూలాలైన మరియకు స్థలం లేకపోవడం వలన ఓ పశువు పాకే ప్రభు జన్మస్థలమైంది. ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి ఓ సత్రములో పరుండియుండుట మీరు చూచెదరన్న ప్రవచనం ఆ విధంగా నెరవేరింది. ఆ రాత్రి ఊరి వెలుపల గొర్రెలు కాచుకుంటున్న కాపరులకు రక్షకుని జనన వార్త ముందుగా చేరింది. దేవదూత కాపరుల వద్దకు వచ్చి భయపడవద్దని, ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానం నేను మీకు తెచ్చానని దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కోసం పుట్టాడని ఆయన ప్రభువైన క్రీస్తని చెప్పాడు. ఆ సమయంలో దేవుని దగ్గర నుంచి పరలోక దూత సైన్య సమూహం దిగివచ్చి 'సర్వోన్నతమైన స్థలాలలో దేవునికి మహిమ ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానం కలుగును గాక' అంటూ దేవునికి స్తోత్రాలు చెల్లిస్తూ పాటలు పాడారు.

ఇదే సమయంలో ఆకాశంలో ఓ అరుదైన వింతైన కాంతివంతమైన నక్షత్రము కనుగొని ముగ్గురు తూర్పుదేశపు జ్ఞానులు దానిని వెంబడించి బెత్లెహేము చేరుకొని ఇతడే యూదుల రాజంటూ అత్యానందభరితులై తాము తెచ్చిన బంగారం, సాంబ్రాణి, బోళము కానుకగా అర్పించి తిరిగి వెళతారు.

■ చీకటిని తరిమేసిన గొప్ప వెలుగు

క్రిస్మస్ ఈ లోకానికి ఎన్నో శుభములు సమకూర్చింది. చీకటితో నిండిన హృదయాలను వెలుగుతో నింపింది. ఆది మానవుడైన ఆదాము దేవుని ఆజ్ఞమీరి చీకటి అనే మరణాన్ని అందించాడు. అయితే ఆదాము చేసిన పాపం మానవుల మీద రాజ్యమేలకుండ ఉండటానికి దేవాది దేవుడే శరీరధారుడై ఈ భువికి ఏతెంచాల్సి వచ్చింది. పాపకూపములోకి దిగిపోకుండ నరుల ప్రాణము విమోచించేందుకు దేవుడు సల్పిన గొప్ప యాగమే క్రిస్మస్. వెలుగు రక్షణల సంగమం. ఇది ముందుగానే గ్రహించిన భక్తులు మరణములో నుండి నా ప్రాణమును తప్పించావు, జీవపు వెలుగులో దేవుని సన్నిధిని సంచరించునట్లు జారి పడకుండా నా పాదములు తప్పించావు అంటూ కొనియాడారు. యెషయా ప్రవక్త 'చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగు చూచుచున్నారు. మరణచ్ఛాయ గల దేశ నివాసుల మీద వెలుగు ప్రకాశించును' అంటూ ప్రవచించాడు. 'జనములు నీ వెలుగునకు వచ్చెదరు రాజులు నీ ఉదయ కాంతికి వచ్చెదరని' ప్రస్తుతించాడు. క్రీస్తు పుట్టుకతో ఈ ప్రవచనం నెరవేరింది. అనేక ప్రవచనాల నెరవేర్పు ఈ సమయంలో నెరవేరింది.

సాతాను చెరలో బందీలై చీకటిలో మగ్గే ప్రజలు వెలుగు క్రియలు ఇష్టపడని వారిని సైతం ప్రేమించి క్రీస్తు వెలుగు ప్రసాదించాడు. నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి ఉందురని ఏసు ప్రభువు చెప్పాడు. తనను అనుసరించే వారంతా వెలుగు సంబంధులుగా పేర్కొన్నాడు. నా యందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచియుండకుండునట్లు నేను ఈ లోకానికి వెలుగుగా వచ్చానని స్పష్టం చేశాడు. అంధకారమయమైన ప్రతి హృదయం వెలుగుతో ప్రకాశించడమే ఈ పర్వదినాన క్రీస్తు మనందిరినుంచి కోరుకునేది. క్రీస్తు అందించే వెలుగు ఫలాలు మంచితనం, నీతి, సత్యం ఈ ఫలాలు భువిలో శాంతి సమాధానాలు వెదజల్లేందుకు దోహదం చేస్తాయి. క్రీస్తు వెలుగులోనున్న ప్రకారం మనం వెలుగులో నడిస్తే అన్యోన్య సహవాసము గలవారముగా ఈ భువిపైన జీవించగలం.



■ క్రిస్మస్ అంటే అంతులేని ఆనందం

క్రిస్మస్ ప్రతి హృదయంలో ఆనందంతో నింపుతుంది. ఆ రోజున తల్లి మరియ తండ్రి యేసేపు బెత్లెహేములోని పశుపాకలో పవళించిన బాల యేసుని చూసి మురిసిపోయారు. పరలోకం నుంచి వచ్చిన దూతల వర్తమానంతో తొలుత కలవరపడినా మానవ ప్రమేయం లేని దేవాదిదేవుని జననం ఆశ్చర్యాన్ని కలిగించినా ఏసు జననంతో వారు తమ ప్రయాస అంతా మరిచిపోయి లోక రక్షకుడ్ని చూసి మురిసిపోయారు. ఈ గొప్ప వేడుకలో అమితానందం ఎవరైనా పొందారంటే గొర్రెల కాపరులే. దేవుని దూతలు వచ్చి స్వయంగా క్రీస్తు జనన వార్త తెలపడంతో అమితాశ్చర్యం, ఆనందంలో తేలిపోయారు. దూర దేశం నుంచి వచ్చిన జ్ఞానులకు ఆకాశంలో అందమైన తార కనిపించడంతో సుదూర ప్రాంతం అతి ప్రయాస కోర్చి క్రీస్తును గాంచి అత్యానంద భరితులయ్యారు. రెండు వేల సంవత్సరాల క్రితం జరిగిన ఈ అద్భుతం క్రీస్తుని రక్షకుడిగా అంగీకరించిన ప్రతి హృదయంలో నేటికి జరుగుతుంది. అలా ఏసు పరలోకానికి భూలోకానికి వారధిగా నిలబడి ప్రతి హృదిని ఇప్పటికి వెలిగిస్తూనే ఉన్నాడు. అందుకే ఓ భక్తుడు ఇలా పాడాడు 'ఓ యేసు పొన్నుగనా ఆత్మ జేకొని శ్రేయముగ బవళించు శ్రీకర వరసుత' అని.

■ లోక రక్షకుడిగా అవతరించిన తరుణం

యేసు క్రీస్తు జననంలో గొర్రెల కాపరులతో దేవదూత అన్నమాట ఒకసారి గుర్తు చేసుకుంటే 'ఇది ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానం..దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు' అది కేవలం వారికే కాదు ఈ భూమి మీద ఉన్న వారందరికి శుభవార్త. ఈ లోకాన్ని ఎంతో ప్రేమించిన దేవుడు ఎవ్వరూ నశించిపోకుండా నిత్యజీవం అనుగ్రహించేందుకే ఏసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు. రాజుల చేతనైనను నరుల చేతనైనను రక్షణ కలుగదు వారిని నమ్ముకొనవద్దని కీర్తనకారుడు చెప్పిన విధంగా మానవులందరి రక్షణకు కారణభూతుడగు దేవుడు చేసిన మహోపకారం. పాపం వల్ల వచ్చు జీతం మరణం. మనందరం అపరాధముల చేత, పాపం చేత చచ్చిన వారమై ఉండగా మనలను బతికించేందుకు నిత్యజీవం అనుగ్రహించేందుకు బలి అర్పణగా తనను తాను సమర్పించుకున్నాడు. ఆయన చేసిన ఆ గొప్ప ఉపకారం క్రీస్తు జన్మతోనే ప్రారంభమవడం అత్యంత ముదావహం.

అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు

– బందెల స్టెర్జిరాజన్

సినిమా



● మహేశ్‌బాబు

ఫారిన్‌కి వేళాయె!

'గుంటూరు కారం' సినిమాకు గుమ్మడికాయ కొట్టే సమయం ఆసన్నమైంది. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, హీరోయిన్ మీనాక్షీ చౌదరి, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో జరుగుతోంది. మహేశ్ బాబుతో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా, ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట యూనిట్. ఈ పాట పూర్తయితే షూటింగ్ దాదాపు పూర్తయినట్లేనని టాక్. చిన్న చిన్న ప్యాచ్ వర్క్‌లు కూడా కంప్లీట్ చేసి, ఈ నెలాఖరుకు 'గుంటూరు కారం' షూటింగ్ పూర్తి అయ్యేలా చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అలాగే 'గుంటూరు కారం' సినిమా షూటింగ్ పూర్తికాగానే ఫ్యామిలీతో కలిసి ఫారిన్ వెకేషన్‌కు వెళతారట మహేశ్‌బాబు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే చేసుకుంటారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఫారిన్ నుంచి తిరిగి రాగానే 'గుంటూరు కారం' ప్రమోషన్స్‌తో బిజీ అవుతారు మహేశ్. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న 'గుంటూరు కారం' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది.

మంగళూరులో భీమా...



● గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ.హర్ష తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న 'భీమా' తాజా షెడ్యూల్ మంగళూరులో ఆదివారం ప్రారంభమైంది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. మాస్, యాక్షన్‌తో కూడిన ఈ సినిమాలో కుటుంబ ప్రేక్షకులను మెప్పించే అంశాలు ఉంటాయి. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ మూవీ రూపొందుతోంది. మంగళూరులోని ఓ దట్టమైన అడవిలో గోపీచంద్‌తో పాటు ఇతర తారాగణంపై ఓ పాట, యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నాం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏక కాలంలో జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె.గౌడ, సంగీతం: రవి బస్రూర్.

జాతర ముగిసింది!



● అల్లు అర్జున్

జాతరను పూర్తి చేశారట పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ మూవీలోని తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' 2021లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం 'పుష్ప' మలిభాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో హీరోయిన్ రష్మికా మందన్న నటిస్తున్నారు. కాగా 'పుష్ప: ది రూల్' సినిమాలో ఇంటర్వెల్ సమయంలో గంగమ్మ జాతర నేపథ్యంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుంది. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ ప్రముఖ స్టూడియోలో మొదలైన ఈ జాతర సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ ముగిసిందని సమాచారం. ఆ తర్వాత అల్లు అర్జున్, రష్మికలపై కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించారని తెలిసింది. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను జనవరి మొదటివారంలో జరిగేలా చిత్రయూనిట్ ప్లాన్ చేసిందట. ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాని మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.



● పూజా హెగ్డే

నాకు సవాల్‌గా అనిపించింది

– ఇంద్రసేన



''ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మోసాలు, బెదిరింపుల చుట్టూ అల్లుకున్న కథ 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. పూర్తి వినోదంతో పాటు పతాక సన్నివేశాల్లో మంచి సందేశం ఉంటుంది. ఈ సినిమా యువ తరంతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో ఇంద్రసేన అన్నారు. 'శాసనసభ' వంటి హిట్ చిత్రం తర్వాత ఇంద్రసేన నటించిన సినిమా 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. రవి చావలి దర్శకత్వం వహించారు. ఎస్.రమేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఇంద్రసేన మాట్లాడుతూ–''శాసనసభ' కంటే ముందే 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్' ఒప్పుకున్నా. రవిచావలి దర్శకత్వంలో నేను ఇంతకు ముందు 'సూపర్ స్కెచ్' సినిమాలో నటించాను. ఆయనలాంటి ప్రతిభ గల దర్శకుడితో రెండోసారి నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నా పాత్ర వినోదాత్మకంగా ఉంటుంది. ఈ పాత్ర నటుడిగా నాకు సవాల్‌గా అనిపించింది. ఈ చిత్రం కూడా నా కెరీర్‌ను మరో మెట్టు ఎక్కిస్తుంది. రమేష్ కుమార్‌గారు రాజీ పడకుండా ఈ మూవీ నిర్మించారు. విజయ్ సి. కుమార్ కెమెరా, భోలే షావలి సంగీతం, మార్తాండ్ కె.వెంకటేష్ ఎడిటింగ్ ఈ సినిమాకు అదనపు బలాలు. నా పాత్ర, కథ నచ్చితే విలన్‌గా నటిస్తాను. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రానున్న చిత్రంలో నెగిటివ్ రోల్‌లో కనిపించబోతున్నాను. నేను హీరోగా రెండు చిత్రాలు త్వరలో ప్రారంభం కానున్నాయి'' అన్నారు.

పరిశోధన మొదలు



● షాహిద్ కపూర్

షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవా'. ఈ మూవీలో పూజాహెగ్డే హీరోయిన్. ఈ చిత్రంతో మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్ బాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఇటీవల ముంబైలో మొదలైన తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తి అయింది. వరుణ్–పూజ కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటుగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను దర్శకుడు రోషన్ చిత్రీకరించారని బీ టౌన్ టాక్. ''దేవా' తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది'' అంటూ చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి హత్య కేసును పరిశోధన చేసే పోలీస్ దేవాగా షాహిద్‌కపూర్ నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. జీ స్టూడియోస్, రాయ్‌కపూర్ ఫిలింస్ నిర్మిస్తున్న 'దేవా' 2024 దసరా సందర్భంగా విడుదల కానుంది.

చందమామ కోపం



● ధనుష్

నటుడిగా ఫుల్ బిజీగా ఉంటుంటారు హీరో ధనుష్. వీలైనప్పుడు దర్శకుడిగా, నిర్మాతగా కూడా సినిమాలు చేస్తుంటారాయన. 2017లో వచ్చిన 'పా. పాండి' చిత్రం దర్శకుడిగా ధనుష్‌కు తొలి మూవీ. కాగా తన కెరీర్‌లో 50వ సినిమాలో(డి50 వర్కింగ్ టైటిల్) నటించి, దర్శకత్వం వహించారు ధనుష్. ఈ సినిమా విడుదల కాకముందే తన దర్శకత్వంలో మూడో సినిమాకు 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' (చందమామకు నా మీద ఎందుకు కోపం అని అర్థం) టైటిల్ ఖరారైనట్లు వెల్లడించి, ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను షేర్ చేశారు ధనుష్. 'యాన్ యూజువల్ లవ్‌స్టోరీ' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పవీష్, అనిఖా, మాథ్యూ థామస్, ప్రియా వారియర్, రబియా, వెంకీ, రమ్య ప్రధాన పాత్రల్లో నటించనున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇక నటుడిగా ధనుష్ చేసిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ సంక్రాంతికి విడుదల కానుంది. తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ములతో చేయాల్సిన సినిమాతో పాటుగా, తమిళ, హిందీ భాషల్లో వరుస సినిమాల్లో నటించేందుకు ధనుష్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.


పర్యావరణం నేపథ్యంలో...



● ఆదిత్య ఓం

సింగిల్ క్యారెక్టర్‌తో సాగే సినిమా 'బందీ'. ఇందులో ఆదిత్య ఓం నటించారు. తిరు రఘు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. దగ్గు వెంకటేశ్వర రావు ఈ సినిమాకు మరో నిర్మాత. ''దేశంలోని పలు అటవీ ప్రాంతాల్లో ఈ సినిమా తీశాం. ఎలాంటి డూప్ లేకుండా ఆదిత్య అన్ని రకాల స్టంట్స్‌ను ఈ సినిమా కోసం చేశారు. ఓ ఏడాదిలో ఉండే అన్ని ఋతువులను కవర్ చేయడానికి, మూడు సంవత్సరాలు కష్టపడి ఈ సినిమా తీశాం. పర్యావరణ సంరక్షణ అంశంపై తీసిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

వైవిధ్యమైన కథతో...



● రఘు కుంచె

నూతన ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ, సరికొత్త చిత్రాలను నిర్మించాలనే ఉద్దేశంతో ఏఏ క్రియేషన్స్, ఆర్‌కే సినిమా కలయికలో నూతన చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఫణి ముత్యాల, రఘు కుంచె నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ మూవీ ద్వారా సూర్య ప్రకాష్ వేద దర్శకుడిగా పరిచయమవుతున్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరుపుకుంది. ''వైవిధ్యమైన కథతో ఈ మూవీ తెరకెక్కనుంది. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను స్టార్ట్ చేసి ఏకధాటిగా చిత్రీకరణ జరపాలని ప్రణాళిక సిద్ధం చేశాం. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జగన్ చావలి, సంగీతం: రఘు కుంచె.



సింగిల్స్ విజేత సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి చాంపియన్‌గా అవతరించింది. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో సహజ 6-4, 6-3తో రెండో సీడ్ ఎకతెరీనా మకరోవా (రష్యా)పై సంచలన విజయం సాధించింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. సహజ కెరీర్‌లో ఇది మూడో ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్. గత ఏడాది ఆమె గురుగ్రామ్, నాగ్‌పూర్‌లలో జరిగిన టోర్నీల్లో విజేతగా నిలిచింది.

ఇంగ్లండ్ అసిస్టెంట్ కోచ్‌గా పొలార్డ్

వెస్టిండీస్ మాజీ కెప్టెన్ కీరన్ పొలార్డ్ ఇంగ్లండ్ క్రికెట్ జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. వచ్చే ఏడాది విండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వబోయే టి20 ప్రపంచకప్ కోసం అతన్ని ఇంగ్లండ్ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా నియమించారు. టి20 కెరీర్‌లో పొలార్డ్ అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా ఫ్రాంచైజీ లీగ్, దేశవాళీ, క్లబ్ ఇలా మొత్తం కలిపి 637 మ్యాచ్‌లు ఆడాడు.



పవన్ పోరాటం వృథా

తెలుగు టైటాన్స్‌కు ఆరో ఓటమి

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో వరుసగా ఐదు పరాజయాల తర్వాత ఆరో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టిన తెలుగు టైటాన్స్ మళ్లీ ఓటమి బాటలోకి వెళ్లింది. ఆదివారం జరిగిన తమ ఏడో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 31-33తో బెంగళూరు బుల్స్ చేతిలో పోరాడి ఓడిపోయింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేసిన తన జట్టును గెలిపించలేకపోయాడు. అజిత్ పవార్ 5 పాయింట్లు, రజనీశ్ 3 పాయింట్లు సాధించారు. బెంగళూరు బుల్స్ తరఫున సుర్జీత్ సింగ్ (7), భరత్ (6), వికాశ్ కండోలా (5), నీరజ్ నర్వాల్ (5) రాణించారు. మరో మ్యాచ్‌లో యు ముంబా 39-37తో బెంగాల్ వారియర్స్ జట్టును ఓడించింది. యు ముంబా జట్టు తరఫున అమీర్ మొహమ్మద్ 8 పాయింట్లు, గుమన్ సింగ్ 6 పాయింట్లు సాధించారు. వారియర్స్ తరఫున మణీందర్ సింగ్ అత్యధికంగా 11 పాయింట్లు స్కోరు చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తమిళ్ తలైవాస్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.



పవన్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	7	3	2	2	22
యు ముంబా	6	4	2	0	21
హరియాణా స్టీలర్స్	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
పట్నా పైరేట్స్	6	3	3	0	17
యూపీ యోధాస్	7	2	4	1	15
దబంగ్ ఢిల్లీ	5	2	3	0	12
తమిళ్ తలైవాస్	6	2	4	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



ఆసీస్‌ను ఓడించాం

తొలిసారి టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై గెలిచిన భారత మహిళల జట్టు

ముంబై: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు పదకొండో ప్రయత్నంలో ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత జట్టు తొలిసారి టెస్టు విజయాన్ని అందుకుంది. ఇక్కడి వాంఖెడె మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు రోజుల ఏకైక టెస్టులో భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా సమష్టిగా ఆడితే ఎంతటి మేటి జట్టునైనా ఓడించవచ్చని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం నిరూపించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 75 పరుగుల విజయలక్ష్యాన్ని టీమిండియా 18.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. మ్యాచ్ మొత్తంలో ఏడు వికెట్లు తీసిన భారత ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పటిష్టమైన ఇంగ్లండ్‌తో గత ఆదివారం డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఏకైక టెస్టులో 347 పరుగుల తేడాతో రికార్డు విజయం సాధించిన భారత జట్టు... వారం తిరిగేలోపు మరో మేటి జట్టు ఆస్ట్రేలియాను బోల్తా కొట్టించి ఈ ఏడాదిని దిగ్విజయంగా ముగించింది.

రాణించిన స్నేహ్, రాజేశ్వరి

ఆట చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 233/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా కేవలం 28 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 261 పరుగుల వద్ద ఆలౌటైంది. యాష్లే గార్డ్‌నర్ (7)ను ఆట రెండో ఓవర్‌లోనే పూజ వస్త్రకర్ వికెట్లముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ పతనం మొదలైంది. మరోవైపు క్రీజులో పాతుకుపోయిన అనాబెల్ సదర్లాండ్ (102 బంతుల్లో 27; 3 ఫోర్లు)ను...అలానా కింగ్ (0)ను వరుస బంతుల్లో స్నేహ్ రాణా అవుట్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ఎక్కువసేపు కొనసాగలేదు. చివరి రెండు వికెట్లను రాజేశ్వరి గైక్వాడ్ తీయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ 261 పరుగులవద్ద ముగిసింది. 75 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు తొలి ఓవర్‌లోనే దెబ్బ పడింది. షఫాలీ వర్మ (4) నాలుగో బంతికి పెవిలియన్ చేరింది. ఆ తర్వాత రిచా ఘోష్ (32 బంతుల్లో 13; 3 ఫోర్లు)తో కలిసి స్మృతి మంధాన (61 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు) రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించింది. రిచా అవుటయ్యాక జెమీమా రోడ్రిగ్స్ (15 బంతుల్లో 12 నాటౌట్; 2 ఫోర్లు)తో కలిసి స్మృతి భారత్‌ను విజయతీరానికి చేర్చింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 219; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 406; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** బెత్ మూనీ (రనౌట్) 33; లిచ్‌ఫీల్డ్ (బి) స్నేహ్ రాణా 18; ఎలీస్ పెరీ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 45; తాలియా మెక్‌గ్రాత్ (బి) హర్మన్‌ప్రీత్ 73; అలీసా హీలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్మన్‌ప్రీత్ 32; అనాబెల్ సదర్లాండ్ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 27; యాష్లే గార్డ్‌నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పూజ 7; జెస్ జొనాసెన్ (బి) రాజేశ్వరి 9; అలానా కింగ్ (బి) స్నేహ్ రాణా 0; కిమ్ గార్త్ (బి) రాజేశ్వరి 4; లారెన్ చీట్లె (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (105.4 ఓవర్లలో ఆలౌట్) 261. వికెట్ల పతనం:** 1-49, 2-56, 3-140, 4-206, 5-221, 6-233, 7-251, 8-251, 9-260, 10-261. **బౌలింగ్:** రేణుక 11-4-32-0, పూజ వస్త్రకర్ 11-1-40-1, స్నేహ్ రాణా 22-5-66-4, దీప్తి శర్మ 22-7-35-0, రాజేశ్వరి గైక్వాడ్ 28.4-11 -42-2, జెమీమా 2-0-13-0, హర్మన్‌ప్రీత్ 9-0-23-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) అలీసా (బి) గార్త్ 4; స్మృతి మంధాన (నాటౌట్) 38; రిచా ఘోష్ (సి) తాలియా (బి) గార్డ్‌నర్ 13; జెమీమా (నాటౌట్)12; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.4 ఓవర్లలో రెండు వికెట్లకు) 75. వికెట్ల పతనం:** 1-4, 2-55. **బౌలింగ్:** కిమ్ గార్త్ 5-1-19-1, యాష్లే గార్డ్‌నర్ 9-2-18-1, తాలియా 2-0-14-0, జెస్ జొనాసెన్ 2.4-0-16-0.

7 ఓవరాల్‌గా టెస్టు ఫార్మాట్‌లో భారత మహిళల జట్టు గెలిచిన టెస్టుల సంఖ్య. 1976 నుంచి 2023 వరకు భారత జట్టు 40 టెస్టులు ఆడింది. ఇందులో ఏడింటిలో గెలిచి, ఆరింటిలో ఓడిపోయింది. మిగతా 27 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

11 ఆస్ట్రేలియా జట్టుతో 1977 నుంచి 2023 మధ్యకాలంలో భారత్ 11 టెస్టులు ఆడింది. ఈ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా చేతిలో భారత్ నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది.

2 స్వదేశంలో భారత జట్టు ఒకే ఏడాది రెండు టెస్టుల్లో గెలవడం ఇదే తొలిసారి. భారత్ నెగ్గిన ఏడు టెస్టుల్లో నాలుగు స్వదేశంలో, మూడు విదేశీ గడ్డపై వచ్చాయి. హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో భారత జట్టు ఆడిన రెండు టెస్టుల్లోనూ నెగ్గడం విశేషం.

9 గత 17 ఏళ్లలో భారత జట్టు తొమ్మిది టెస్టులు ఆడింది. ఇందులో ఒక టెస్టులో ఓడి, ఐదు టెస్టుల్లో గెలిచి, మూడింటిని 'డ్రా' చేసుకుంది.

రెజ్లింగ్ సమాఖ్యపై వేటు

కొత్త అధ్యక్షుడి ఏకపక్ష విధానంపై ఆగ్రహం

- కేంద్ర క్రీడాశాఖ అనూహ్య నిర్ణయం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఓ అడుగు ముందుకేస్తే... రెండడుగులు వెనక్కి అన్నట్లుంది వ్యవహారం. మహిళా రెజ్లర్ల పోరాటం, పోలీసు కేసులు, హైకోర్టు స్టేలను దాటుకొని ఎట్టకేలకు సమాఖ్యకు ఎన్నికలు జరిగి, కొత్త కార్యవర్గం ఏర్పాటైందన్న ముచ్చట మూణ్నాళ్ల ముచ్చటే అయింది. డబ్ల్యూఎఫ్‌ఐపై కేంద్ర క్రీడాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్‌కు విధేయుడైన సంజయ్ సింగ్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఇలా ఎన్నికయ్యారో లేదో అప్పుడే స్వామిభక్తి మొదలుపెట్టారు. అండర్-15, అండర్-20 జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలను బ్రిజ్‌భూషణ్ హవా నడిచే గోండా (యూపీ) పట్టణంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ ఏకపక్ష విధానంపై కేంద్ర క్రీడాశాఖకు డబ్ల్యూఎఫ్‌ఐ కార్యదర్శి ప్రేమ్‌చంద్ ఫిర్యాదు చేయడంతో వెంటనే సమాఖ్యను సస్పెండ్ చేసింది. 'కొత్త కార్యవర్గం ఏకపక్ష నిర్ణయంతో డబ్ల్యూఎఫ్‌ఐ నియమావళిని అతిక్రమించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సస్పెన్షన్ వేటు వేశాం. ఇది అమల్లో ఉన్నంతవరకు సమాఖ్య రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం లేదు' అని క్రీడాశాఖ వర్గాలు వెల్లడించాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఏ జూనియర్, సబ్-జూనియర్, సీనియర్ టోర్నమెంట్ అయినా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం ఎగ్జిక్యూటివ్ కమిటీలోనే చర్చించి నిర్ణయించాలి. కానీ సంజయ్ మితిమీరిన స్వామిభక్తితో ఏకపక్ష నిర్ణయం తీసుకొని అడ్డంగా బుక్కయ్యారు. తాజా సస్పెన్షన్‌తో గోండాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరగాల్సిన పోటీలు వాయిదా పడ్డాయి.



"సస్పెన్షన్‌ను ఎత్తేయాలని కేంద్ర క్రీడా శాఖను కోరుతున్నాం. మాకు సమయమిస్తే నిర్ణయాలు తీసుకోవడంలో నిబంధనల్ని అతిక్రమించ లేదని నిరూపిస్తాం. కాదని సస్పెన్షన్‌ను కొనసాగిస్తే మాత్రం సహించం. కోర్టులోనే తేల్చుకుంటాం. టోర్నీల నిర్వహణ విషయంలో డబ్ల్యూఎఫ్‌ఐ 'నియమావళి' ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నాం. ఇది నా ఒక్కడి ఏకపక్ష నిర్ణయం కానేకాదు. 24 రాష్ట్ర సంఘాలను సంప్రదించిన మీదటే టోర్నీ ఆతిథ్య వేదికను ఖరారు చేశాం. అన్నింటికి ఈ-మెయిల్ సాక్ష్యాలున్నాయి. కావాలంటే వీటిని నిరూపిస్తాం.
–సంజయ్ సింగ్, డబ్ల్యూఎఫ్‌ఐ కొత్త అధ్యక్షుడు



నేను 12 ఏళ్ల పాటు సమాఖ్యకు సేవలందించాను. మంచో, చెడో ఏం చేశానో కాలమే సమాధానమిస్తుంది. ఇప్పుడైతే నేను రెజ్లింగ్ నుంచి రిటైర్ అయ్యాను. సమాఖ్యతో సంబంధాల్ని పూర్తిగా తెంచుకున్నాను. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల (లోక్‌సభ)పైనే దృష్టి పెట్టాను. డబ్ల్యూఎఫ్‌ఐలో ఏం జరిగినా అది కొత్త కార్యవర్గానికి చెందిన వ్యవహారమే తప్ప నాకు సంబంధించింది కాదు."
–బ్రిజ్‌భూషణ్, డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు



రెజ్లర్లు ఏమన్నారంటే...

రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ సస్పెన్షన్‌ను స్వాగతించారు. 'డబ్ల్యూఎఫ్‌ఐ మంచికి ఇది తొలి అడుగుగా భావిస్తున్నా. మేం ఎందుకిలా పోరాడుతున్నామనే విషయం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వానికి బోధపడుతుందని ఆశిస్తున్నా. మహిళా అధ్యక్షురాలుంటే దేశంలోని అమ్మాయిలకెంతో మేలు జరుగుతుంది' అని ఆమె అన్నారు. 'పద్మశ్రీ'ని వెనక్కిచ్చిన టోక్యో ఒలింపిక్స్ పతక విజేత బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఇప్పటికే నా పురస్కారాన్ని తిరిగిచ్చేశాను. మళ్లీ ఆ అవార్డును స్వీకరించే యోచన లేదు. మాకు న్యాయం జరిగినపుడు 'పద్మశ్రీ'ని తీసుకుంటా. మన అక్కాచెల్లెళ్లు, కుమార్తెల గౌరవం కంటే ఏ అవార్డు పెద్దది కాదు. ప్రస్తుతం సమాఖ్య వ్యవహారాల్ని అందరు గమనిస్తున్నారు' అని అన్నారు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(1), 2024.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)-2024(1) నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 457
» **అర్హతలు:** మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నావల్ అకాడమీ ఉద్యోగాలకు ఇంజినీరింగ్ ఉత్తీర్ణులు అర్హులు. ఎయిర్‌ఫోర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు. చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.01.2024 నుంచి 16.01.2024 వరకు
» **పరీక్ష తేది:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** http://upsc.gov.in

యూపీఎస్సీ- ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ ఎగ్జామినేషన్(1) 2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. 2024 సంవత్సరానికి సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) మొదటి విడత నోటిఫికేషన్ వెలువడింది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 400
» **కోర్సులు:** నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ, నేవీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సులో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.
» **అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేయాలనుకుంటే.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీనితో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు అర్హులే.
» **వయసు:** 02.07.2005కి ముందు 01.07.2008కి తర్వాత జన్మించి ఉండకూడదు.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. రాతపరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్,ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు. రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **ఉపసంహరణ తేదీలు:** 10.01.2024 నుంచి 16.01.2024 వరకు
» **ఆన్‌లైన్ రాతపరీక్ష:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** http://upsc.gov.in

నంద్యాల జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 13 ఆఫీస్ స్టాఫ్ పోస్టులు

నంద్యాల జిల్లా సాంకేతిక విద్యా శాఖ బేతంచర్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** గ్రేడ్2 ల్యాబ్ అటెండర్-05, గ్రేడ్2 ఆఫీస్ సబార్డినేట్-03, గ్రేడ్3 వాచ్‌మెన్-02, గ్రేడ్ 8 వెంజర్-01, గ్రేడ్8 స్వీపర్-01, టెక్నికల్ ఎలక్ట్రీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఐదో, ఏడు, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రభుత్వ పాలిటెక్నిక్, బేతంచెర్ల, నంద్యాల జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in

సీసీఎంబీ,హైదరాబాద్‌లో 15 పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1-04, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్-03, రీసెర్చ్ అసోసియేట్1-01, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-01, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-01, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-02, రీసెర్చ్ అసోసియేట్-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-01, ప్రాజెక్ట్ అసోసియేట్1-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:**పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **వెబ్‌సైట్:** www.ccmb.res.in

ఇంటర్వ్యూలో మెరిసేలా!

» సివిల్స్-2023 మెయిన్స్ ఫలితాల వెల్లడి
» జనవరి 2వ తేదీ నుంచి పర్సనాలిటీ టెస్ట్
» ఇందులో ప్రతిభతోనే తుది నియామకాలు
» భావ వ్యక్తీకరణ, విశ్లేషణ నైపుణ్యాలతో విజయం

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి.. 21 కేంద్ర సర్వీసుల్లో అధికారుల ఎంపికకు చేపట్టే నియామక ప్రక్రియ! ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. ఇలా మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. సివిల్స్ 2023కి సంబంధించి రెండో దశ.. మెయిన్ ఎగ్జామినేషన్ ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఎంపిక ప్రక్రియలో అత్యంత కీలకమైన చివరి దశ ఇంటర్వ్యూలు (పర్సనాలిటీ టెస్ట్).. జనవరి 2 నుంచి ప్రారంభమవుతాయని యూపీఎస్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్‌లో సత్తా చాటి తుది విజేతలుగా నిలిచేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275. ఇందులో పది, పదిహేను మార్కుల వ్యత్యాసంతో సర్వీసులు, ర్యాంకులు తారుమారు అయ్యే పరిస్థితి ఉంటుంది. రాత పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినా.. ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కుల సాధించి.. తుది ఫలితాల్లో మంచి సర్వీసులు పొందిన వారు ఎందరో! కాబట్టి మెయిన్స్ విజేతలు..ఇంటర్వ్యూలో రాణించేందుకు సమగ్రంగా సన్నద్ధమవ్వాలి అంటున్నారు నిపుణులు.

2,916 మంది ఎంపిక

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023కు సంబంధించి.. చివరి దశ పర్సనాలిటీ టెస్ట్/ ఇంటర్వ్యూకు మొత్తం 2,916 మంది ఎంపికయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాలు(ఏపీ, తెలంగాణ) నుంచి 80 నుంచి 100 మంది వరకు ఉంటారని అంచనా. యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ 2023 నోటిఫికేషన్‌లో మొత్తం 1,105 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.

ప్రత్యేక దృష్టి

సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ అకడమిక్ నేపథ్యం,ఉద్యోగం చేస్తున్నట్లయితే ప్రొఫెషన్, కుటుంబ నేపథ్యం, స్థానిక రాష్ట్రం తదితర అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు మెయిన్ ఎగ్జామ్‌కు ముందు అందించిన డీఏఎఫ్-1, ఇంటర్వ్యూకు ముందు ఇవ్వాల్సిన డీఏఎఫ్-2లలో పొందుపరిచిన వివరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

మీ గురించి చెప్పండి

ముందుగా 'మీ గురించి చెప్పండి'అంటూ.. బోర్డ్ అడిగే ప్రశ్నకు మెప్పించే విధంగా సమాధానం చెప్పేలా అభ్యర్థులు సన్నద్ధం కావాలి. ఆ తర్వాత డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాలు, సర్వీస్ ప్రాథమ్యతలు, సమకాలీన అంశాలపై ఇంటర్వ్యూ కొనసాగుతుంది. సివిల్ సర్వీసెస్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణం ఏంటి? అనే ప్రశ్న సాధారణంగా ఎదురవుతుంది. చాలా మంది ఈ ప్రశ్నకు సామాజిక సేవ లక్ష్యం అనే సమాధానం చెబుతుంటారు. అయితే ఈ సమాధానాన్ని బలపరచుకునే సపోర్టింగ్ పాయింట్స్ సిద్ధం చేసుకోవాలి.

సమకాలీన అంశాలపై పట్టు

అభ్యర్థులు తమ ఇంటర్వ్యూ తేదీ వరకు జరిగే సమకాలీన అంశాలపై పట్టు సాధించాలి. ఎందుకంటే..'ఈ రోజు పేపర్‌లోని ముఖ్య వార్తలు ఏంటి? మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న వార్త ఏంటి? అందుకు కారణం.. ఆ వార్త ప్రాధాన్యం? తదితర ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున కూడా కనీసం రెండు ప్రామాణిక దినపత్రికల చదవాలి. వాటిలో ముఖ్యమైన అంశాలకు సంబంధించిన వివరాలు గ్రహించాలి.



ముఖ్యంగా ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, గాజా ఉద్రికత్తలు, మన విదేశాంగ విధానం, జీ-20 నిర్వహణ, పొరుగుదేశాలతో దౌత్య సంబంధాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి. జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారుతున్న అంశాల(ఉదా: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఎల్‌ఐసీ ఐపీఓ, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు తదితర) గురించి అన్ని కోణాల్లో తెలుసుకోవాలి.

భౌగోళిక నేపథ్యం

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ భౌగోళిక నేపథ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. తమ స్వస్థలానికి సంబంధించి ఏదైనా సామాజిక, చారిత్రక ప్రాధాన్యం ఉంటే దాని గురించి తెలుసుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అభ్యర్థులు ఇచ్చే సమాధానాలను సైతం రాబట్టేలా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి స్థానిక పరిస్థితులు, సమస్యలపై అవగాహనతోపాటు, పరిష్కార మార్గాలతో సన్నద్ధంగా ఉండాలి.

అలవాట్లు.. అప్రమత్తంగా

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు.. తాము అప్లికేషన్‌లో పేర్కొన్న హాబీలపై ఇప్పటి నుంచే ప్రత్యేకంగా కసరత్తు చేయాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ, సింగింగ్, ప్లేయింగ్, మూవీస్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూ సమయంలో వీటిపైనా ప్రశ్నలు అడుగుతారనే విషయాన్ని గమనించాలి. బుక్ రీడింగ్ హాబీకి సంబంధించి నిర్దిష్టంగా ఒక రచయిత పేరును పేర్కొన్న అభ్యర్థులు.. సదరు రచయిత ప్రచురణల్లో ముఖ్యమైనవి, వాటిలో పేర్కొన్న ముఖ్యమైన కొటేషన్లు, సదరు రచన సారాంశం వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. సదరు రచయిత రాసిన ఫలానా పుస్తకం చదివారా? అందులో మీకు బాగా నచ్చిన అంశం ఏంటి? లేదా అందులో వివాదాస్పదమైన అంశం ఏంటి? వంటి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.

బలాలు, బలహీనతలు

అభ్యర్థులు వ్యక్తిగత బలాలు, బలహీనతల విషయంలోనూ జాగ్రత్తగా అడుగులు వేయాలి. సివిల్ సర్వీస్ ఆఫీసర్ అంటే..ఒక విభాగానికి, లేదా ఒక ప్రాంతానికి పూర్తి స్థాయి అధికారిక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అలాంటి సందర్భంలో వ్యక్తిగత లక్షణాలు కూడా కీలకంగా నిలుస్తాయి. అందుకే ఇటీవల కాలంలో అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ బలహీనతల గురించి చెప్పేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. 'అగ్రెసివ్‌నెస్', 'సహనం తక్కువ' వంటివి చెప్పకపోవడమే మేలు.

సూటిగా, స్పష్టంగా

ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత వ్యవహార శైలి కూడా విజయాన్ని నిర్దేశిస్తుంది. ప్రధానంగా అభ్యర్థులు తమ అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే నేర్పును అలవర్చుకోవాలి. ఇందుకోసం తమ అభిప్రాయాలను బలపరిచే అంశాలను ఉదహరించేలా వ్యవహరించాలి. సానుకూల లేదా ప్రతికూల అభిప్రాయం ఏదైనా సరే తమ అభిప్రాయాన్ని ఎదుటి వారిని మెప్పించే రీతిలో సూటిగా చెప్పాలి. వ్యవహార శైలి పారదర్శకంగా ఉండాలి. అంతేకాకుండా సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్ కొన్నిసార్లు చర్చ రూపం కూడా సంతరించుకోవచ్చు. ఇంటర్వ్యూ అంటే కేవలం ప్రశ్న, సమాధానం అనే కోణంలోనే కాకుండా.. ఒక చర్చా వేదికగానూ భావించి ముందడుగు వేయాలి.

ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్

గత కొన్నేళ్లుగా ఇంటర్వ్యూల శైలిని పరిగణనలోకి తీసుకుంటే బోర్డ్ సభ్యులు.. అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు..'మీరు ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఫలానా సమస్య ఎదురైంది? దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' వంటివి. ఇలాంటి వాటికి..ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూ.. రాజ్యాంగానికి అనుగుణంగా పరిష్కార చర్యలు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

వస్త్రధారణ

ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వ్యక్తిగత ఆహార్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. పురుష అభ్యర్థులు లైట్ కలర్ షర్ట్స్ ధరించడం హుందాగా ఉంటుంది. అదే విధంగా మహిళా అభ్యర్థులు శారీ, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించి ఇంటర్వ్యూకు హాజరవడం సదభిప్రాయం కలిగేలా చేస్తుంది. ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలిచ్చేటప్పుడు బాడీ లాంగ్వేజ్ కూడా ఎంతో ముఖ్యం. హావభావాలను నియంత్రించుకోవాలి.

ప్రాక్టికల్ అప్రోచ్

సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్‌లో ప్రధానంగా అభ్యర్థుల్లోని ప్రాక్టికల్ అప్రోచ్‌ను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా పాలన దక్షతను, నాయకత్వ లక్షణాలను కూడా పరీక్షిస్తారు. నిర్దిష్టంగా ఒక సమస్య పట్ల స్పందించే తీరు, నిర్ణయాలు తీసుకునే విధానం వంటి వాటిని పరిశీలిస్తారు. ఈ నైపుణ్యాలు పెంచుకోవాలి.

ఇంటర్వ్యూ మార్కులే కీలకం

మొత్తం 2025 మార్కులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో ఇంటర్వ్యూకు కేటాయించిన 275 మార్కులు తుది జాబితాలో నిలిపేందుకు అత్యంత కీలకంగా మారుతున్నాయి. కారణం.. ఇంటర్వ్యూ అంతా ముఖాముఖి విధానంలో ఉండడం, బోర్డ్ సభ్యులు అడిగిన ప్రశ్నలు లేదా ఆయా అంశాలపై అవగాహనను, వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించే విధంగా ఇంటర్వ్యూ జరగడమే. ఈ విషయంలో ఏ మాత్రం తడబాటుకు గురైనా.. కొద్ది మార్కుల తేడాతో విజయం చేజారే ప్రమాదం లేదా కోరుకున్న సర్వీసు రాకపోయే పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు అన్ని కోణాల్లో నైపుణ్యాలు సొంతం చేసుకునే దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	242	71,107
నిఫ్టీ ▲	94	21,349

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,993	▲	29
డోజోన్స్	37,386	▽	18
ఎఫ్‌టీఎస్ఈ 100	7,698	▲	3
డాక్స్	16,706	▲	19
షాంఘై	2,915	▽	4
నికాయ్	33,169	▲	29

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	104.49	107.06
€	యూరో	90.53	92.90
¥	జపాన్ ఎన్ (100)	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	55.55	57.53
S$	సింగపూర్ డాలర్	62.02	63.51
SAR	సౌదీ రియాల్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హమ్	21.74	23.53
¥	చైనా యువాన్	10.55	12.62

ఆస్తుల బదిలీ.. ఇలా ఈజీ!





ప్రతి ఒక్కరికీ ఎస్టేట్ ప్లానింగ్ ఉండాలి

- ఇందులో ఫ్యామిలీ ట్రస్ట్ మెరుగైనది
- ఆస్తుల నిర్వహణ, బదిలీ సులభం
- వీలునామాలో కొన్ని ప్రతికూలతలు
- కోర్టుల్లో సవాలు చేయవచ్చు
- వివాదాలు వద్దనుకుంటే ప్రణాళిక అవసరమే

కుటుంబ సభ్యుల ఆర్థిక భద్రత ప్రతి ఒక్కరికీ ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలి. జీవితాంతం ఎంతో కష్టించి, ఆస్తులు, సంపద కూడబెట్టుకోవడంతోనే సరికాదు. తమ వారికి సాఫీగా బదిలీ అయ్యేలా చర్యలు తీసుకున్నప్పుడే ఆకాంక్ష ఫలిస్తుంది. ఒక ఆస్తికి ఒకటికి మించిన వారసులు ఉంటే పంపకం సమస్యగా మారకూడదు. క్లిష్టమైన కుటుంబ నిర్మాణం ఉన్న వారు ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరించాల్సిందే. దురదృష్ట వశాత్తూ తమకు ఏదైనా జరిగితే, తమ పేరిట ఉన్న ఆస్తులు వారసులకు సాఫీగా బదిలీ అయ్యేది ఎలా? ఆస్తులకు సంబంధించి వివాదాలు ఏర్పడకుండా చూసుకునేది ఎలా..? ఎస్టేట్ (ఆస్తి) ప్లానింగ్ ఇందుకు పరిష్కారం అవుతుంది. వీలునామా రాస్తే సరిపోతుందిలే అనుకోవద్దు. దీనికంటే మెరుగైనది కుటుంబ ట్రస్ట్. ఆస్తులనే కాకుండా, కుటుంబ వ్యాపారాల సాఫీ పంపిణీ సైతం ఎస్టేట్ ప్లానింగ్‌తో సాధ్యపడుతుంది.



ఎస్టేట్ ప్లానింగ్ అంటే..?

ఆస్తుల పంపకాన్నే ఎస్టేట్ ప్లానింగ్‌గా చెబుతారు. తమ మరణానంతరం కుటుంబ సభ్యులకు ఆస్తులు ఎలా పంపిణీ చేయాలన్నది ఇందులో ఉంటుంది. తమ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటే కుటుంబ వ్యాపారానికి ఎవరు నాయకత్వం వహించాలి? అనే వివరాలు కూడా ఇందులో భాగమే. ప్లాట్లు, ఇళ్లు, పొలాలు, బంగారం, ఆభరణాలు, బ్యాంక్ బ్యాలన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు అన్నింటికీ ఇందులో చోటు ఉంటుంది. కాయిన్లు, పెయింటింగ్‌లు తదితర అన్నింటి పంపిణీని ఎస్టేట్ ప్లానింగ్‌తో సులభతరం చేసుకోవచ్చు.

ట్రస్ట్ ఏర్పాటు

కొన్ని కుటుంబాల నిర్మాణం సంక్లిష్టంగా ఉంటుంది. అలాగే, కొన్ని పెద్ద కుంటుంబాలు ఉంటాయి. మొదటి వివాహం ద్వారా పిల్లలు ఉండి, తర్వాత రెండో వివాహం ద్వారా పిల్లలు కన్న వారికి ఆస్తుల పంపిణీలో సహజంగా వివాదాలు ఏర్పడుతుంటాయి. అలాగే, ప్రత్యేక అవసరాల (దివ్యాంగులు) వారూ ఉండొచ్చు. అలాంటి వారికి ఆస్తుల పంపిణీని తమ ఇష్ట ప్రకారం చేసుకోవాలంటే అందుకు వీలునామా లేదా ఫ్యామిలీ ట్రస్ట్ మార్గాలవుతాయి. తమ సంపద సాఫీగా బదిలీ అయ్యేందుకు ట్రస్ట్ వీలు కల్పిస్తుంది. ట్రస్ట్ అంటే ధర్మనిధి. ట్రస్ట్ ఏర్పాటు చేసే వ్యక్తికి, ధర్మ కర్తలకు మధ్య ఒప్పందమే ట్రస్ట్ డీడ్. దీని ద్వారా తనకు సంబంధించిన ఆస్తులను ధర్మకర్తలకు అప్పగిస్తారు. ట్రస్ట్ ఏర్పాటు చేసిన వ్యక్తి మరణానంతరం ట్రస్ట్ డీడ్‌లో పేర్కొన్న విధంగా ఆస్తుల బదిలీ పూర్తి చేయాల్సిన బాధ్యత ట్రస్ట్ నిర్వాహకులపై ఉంటుంది. ట్రస్ట్ ఏర్పాటు చేయాలని అనుకునే వారు ట్రస్ట్ డీడ్ రాయాల్సి ఉంటుంది. సంపదను ఎలా బదిలీ చేయాలన్నది అందులో స్పష్టంగా పేర్కొనాలి. స్థిర, చరాస్తులను ట్రస్ట్‌కు బదిలీ చేయాలి. ట్రస్ట్ డీడ్ రాసిన తర్వాత దాని నిర్వహణకు ట్రస్టీ (ధర్మకర్త)ని నియమించాలి. స్టాంప్ డ్యూటీ చెల్లించి, ట్రస్ట్‌ను రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ట్రస్ట్ ఏర్పాటు ఉద్దేశాన్ని ట్రస్ట్ డీడ్ తెలియజేయాలి. దీని ఏర్పాటు ఉద్దేశం, ఎలా పనిచేయాలన్నది స్పష్టంగా పేర్కొనాలి. ట్రస్టీ లేదంటే ట్రస్టీలుగా ఎవరిని నియమించాలి? అన్న సందేహం రావచ్చు. స్నేహితులు లేదా బంధువులను ట్రస్టీలుగా నియమించుకోవచ్చు. లేదా కార్పొరేట్ సంస్థను అయినా ట్రస్టీగా నియమించొచ్చు. కొన్ని కార్పొరేట్ సంస్థలు ట్రస్ట్ సేవలను అం దిస్తున్నాయి. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరణించినా లేదా తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురైన సందర్భాల్లో ఆస్తులను ఎలా వినియోగించుకోవాలన్న సూచనలను ట్రస్ట్ డీడ్‌లో పేర్కొనొచ్చు. అలాగే, ధర్మకర్త జీవించి లేకపోయినా లేక రిటైర్మెంట్ తీసుకున్నా.. తదుపరి ట్రస్టీగా ఎవరు వ్యవహరించాలన్నది కూడా టస్ట్ డీడ్‌లో పేర్కొనాలి.



ఎవరికి అవసరం..?

నిజానికి ఎస్టేట్ ప్లానింగ్ లేదా వీలునామా అనేవి సంపన్నులకేనన్న ఒక అపోహ నెలకొంది. ఇది నిజం కాదు. ప్రతి ఒక్కరికీ ఇది ఎంతగానో సాయపడుతుంది. తమ పేరిట ఆస్తులు ఉన్నా, లేదా అప్పులు ఉన్నా సరే ఎస్టేట్ ప్లానింగ్‌తో వారసులకు మార్గం స్పష్టంగా మారుతుంది. అకాల మరణం ఎదురైతే, తమ పేరిట ఉన్న ఆస్తులు ఎలా పంచాలి? అప్పులు ఎలా తీర్చాలి? ఏ ఆస్తి విక్రయించి అప్పు చెల్లించాలి? వీటికి ఎవరు బాధ్యత వహించాలి? ఇలాంటి వాటికి స్పష్టత ఇవ్వొచ్చు. నిజానికి మనలో 90 శాతం మంది ఆస్తులకు సంబంధించి భవిష్యత్ ప్రణాళిక గురించి ఆలోచించరు. వీలునామా కూడా రాయరు. తాము క్షేమంగా ఉన్నందున, మరణం గురించి చర్చించడం, ఆస్తులపై చర్చను కోరుకోకపోవడం వల్ల ప్రణాళికకు దూరంగా ఉంటుంటారు. నిజానికి ఎంతో ముఖ్యమైన ఈ పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేయకూడదు. దీని వల్ల ఉపయోగాలే కానీ, నష్టం ఉండదు. కనుక ప్రతి ఒక్కరూ దీనికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్గాలు..

నామినేషన్, వీలునామా (విల్లు), ఫ్యామిలీ ట్రస్ట్ ఇవన్నీ ఎస్టేట్ ప్లానింగ్‌లో పలు రకాల సాధనాలు. ఆర్థిక సాధనాలకు నామినేషన్ సదుపాయం ఉంటుంది. సంబంధిత ఆస్తి ఎవరికి వెళ్లాలని అనుకుంటే వారి పేరును నామినీగా నమోదు చేసుకోవచ్చు. కానీ, అన్నింటికీ నామినేషన్ సదుపాయం ఉండదు. ముఖ్యంగా స్థిరాస్తులకు నామినేషన్ చేసుకోలేరు. కనుక అన్నింటికీ పరిష్కారంగా ఫ్యామిలీ ట్రస్ట్ అక్కరకు వస్తుంది. ఇలాంటి ఏర్పాట్లు ఏవీ లేకుండా ఓ కుటుంబ యజమాని మరణించిన సందర్భాల్లో లేదా వారసులు కాని వ్యక్తి నామినీగా ఉండి వివాదాలు ఏర్పడిన సందర్భాల్లో.. ఆస్తుల పంపిణీ అన్నది ఆయా మతస్థుల వారసత్వ చట్టం ప్రకారం చేసుకోవాల్సి వస్తుంది. దీనికి కోర్టులను ఆశ్రయించాల్సిందే. హిందూ వారసత్వ చట్టం ప్రకారమైతే మరణించిన వ్యక్తి జీవిత భాగస్వామి, అతని తల్లి, పిల్లలకు సమానంగా ఆస్తులు బదిలీ చేసుకోవాలి. ఈ విషయంలో వివాదం ఏర్పడితే అప్పుడు పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

ఇది నిజం కాదు..

ట్రస్ట్ ఏర్పాటు చేస్తే, తమ ఆస్తులన్నీ ట్రస్టీ నిర్వహణలోకి వెళ్లిపోతాయని, వాటిపై తాము నియంత్రణ కోల్పోతామనే అపోహ ఉంది. ట్రస్ట్ ఏర్పాటు చేసి, దానికి తమ ఆస్తులను బదిలీ చేసిన తర్వాత అప్పుడు ట్రస్టీయే యజమాని అవుతారు. నిజానికి ట్రస్ట్ డీల్‌లో పేర్కొన్న మేరకు బాధ్యతలను నిర్వహించడమే ట్రస్టీ పని. అంతేకానీ, సంబంధిత ట్రస్ట్ నిర్వహణలోని ఆస్తులను వినియోగించుకునే, అనుభవించే హక్కులు ట్రస్టీలకు ఉండవు. కేవలం ట్రస్ట్ డీడ్‌లో పేర్కొన్న లబ్ధిదారుల ప్రయోజనాల కోసమే ఆ ఆస్తులను వినియోగించాల్సి ఉంటుంది. ట్రస్ట్ ఏర్పాటు చేసిన వారు జీవించి ఉన్నంత వరకు బదిలీ చేసిన ఆస్తులు, ట్రస్ట్ కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటారు. నేడు పలు ప్రొఫెషనల్ ట్రస్ట్ ఏజెన్సీలు ట్రస్టీ సేవలను అందిస్తున్నాయి. అవి ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరిస్తాయి. ట్రస్ట్ డీడ్‌కు పూర్తి స్థాయి నిర్వాహకుడి మాదిరే పనిచేస్తాయి.

వీలునామా.. కోర్టు విచారణలు!



వీలునామా గురించే ఎక్కువ మందికి తెలుసు. సులభమైన, మెరుగైన సాధనమని చాలా మంది భావిస్తుంటారు. అయితే ఇందులో కొన్ని ప్రతికూలతలు లేకపోలేదు. వీలునామా రిజిస్టర్ చేసినా, చేయకపోయినా దాన్ని కోర్టుల్లో సవాలు చేయవచ్చు. వీలునామా అనేది కేవలం వ్యక్తి మరణానంతరం అమల్లోకి వచ్చే పత్రం. వైకల్యం లేదా తీవ్ర అనారోగ్యం బారిన పడిన సందర్భాల్లో వీలునామా పని చేయదు. మరణించిన వ్యక్తి ఆస్తుల బదిలీకి సంబంధించినదే కానీ, ఆ ఆస్తుల నిర్వహణకు సంబంధించినది కాదు. వీలునామా కింద లబ్ధిదారులు హక్కులను కోర్టులో నిరూపించుకోవాల్సి వస్తుంది. ఇందుకు ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టొచ్చు. అప్పటి వరకు ఆ ఆస్తులను వినియోగించుకోవడానికి వీలు పడదు. మోసం, ఫోర్జరీ, ఒత్తిడితో రాయించినట్టు లేదా మానసిక వైకల్యంతో బాధపడుతున్న సమయంలో రాయించినట్టు, తెలియకుండా రాయించుకున్నట్టు తదితర ఆరోపణలపై వీలునామాను కోర్టులో సవాలు చేయవచ్చు. వీలునామాను రిజిస్టర్ చేసినంత మాత్రాన అది చట్టబద్ధంగా చెల్లుబాటు అయిపోతుందని అనుకోవడం పొరపాటు. రిజిస్టర్ చేయించిన వీలునామా సైతం కోర్టుల విచారణ పరిధిలోకి వస్తుంది. మనదేశంలో ఎస్టేట్ ప్లానింగ్ కోసం హిందు అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఏర్పాటును కొంత మంది అనుసరిస్తుంటారు. ఇది పన్నుకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాటు. ఒక్కసారి హెచ్‌యూఎఫ్ రిజిస్టర్ చేసి, ఆస్తులు దానికి బదలాయించారంటే.. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు దఖలు పడతాయి. హెచ్‌యూఎఫ్ పరిధిలోని ఆస్తులను విభజించడం వివాదాలు, కోర్టు కేసులకు దారితీయవచ్చు. వీటన్నింటిలోకి మెరుగైనది ఫ్యామిలీ ట్రస్ట్.

పిల్లలకు కూడా..

మైనర్ చిన్నారులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఎస్టేట్ ప్లానింగ్ ప్రయోజనకరంగా ఉంటుంది. తాము లేని రోజున తమ పిల్లల బాధ్యతను బంధువులపై మోపడం.. వారు చూస్తారని ఆశించడం అన్ని సందర్భాల్లో సరైనది అనిపించుకోదు. ఇది పూర్తిస్థాయి, పెద్ద బాధ్యత. ట్రస్ట్ ఏర్పాటు చేసి, దాని నిర్వహణ బాధ్యతను కార్పొరేట్ ట్రస్టీకి అప్పగించడం మెరుగైనది అవుతుంది. కార్పొరేట్ ట్రస్టీ అయితే.. ప్రత్యేక అవసరాల పిల్లలకు (దివ్యాంగులు) పూర్తి సమయం పాటు సహాయకుడు/సహాయకురాలిని అందుబాటులో ఉంచుతారు. అలాగే వంట మనిషి, వైద్య సాయం సహాయకులు, స్పెషలిస్ట్ డాక్టర్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. పిల్లలు సాధారణంగా తమ హక్కులను క్లెయిమ్ చేసుకోలేరు. అందుకని వీలునామా రాస్తే, దాని నిర్వహణ బాధ్యతను ఒకరికి అప్పగించాల్సి వస్తుంది. అందుకే వీలునామాలో ఉన్న ప్రతికూలతల దృష్ట్యా పిల్లల కోసం ఫ్యామిలీ ట్రస్ట్ మెరుగైనది అవుతుంది.



స్టాక్ వ్యూ


స్టార్ హెల్త్ | జియోజిత్ ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 524 టార్గెట్: రూ. 653

ఎందుకంటే: 2006లో కార్యకలాపాలు ప్రారంభించిన స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్.. దేశీయంగా తొలి స్టాండెలోన్ ఆరోగ్య బీమా రంగ కంపెనీ. ఆరోగ్యం, వ్యక్తిగత ప్రమాద బీమా సేవలకు తోడు.. దేశ, విదేశీ ప్రయాణ బీమా ప్రొడక్టుల (సర్వీసులు)ను సమకూరుస్తోంది. 14,200 ఆసుపత్రులతో ఒప్పందం ద్వారా భారత్‌లో అతిపెద్ద ఆరోగ్య బీమా సర్వీసుల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికం (క్యూ2)లో నికర ఆర్జనా ప్రీమియం (ఎన్ఈపీ)వార్షికంగా దాదాపు 15% జంప్‌చేసి రూ. 3,206 కోట్లకు చేరింది. ఇందుకు రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ విభాగం సాధించిన రెండంకెల వృద్ధి దోహదపడింది. దీంతో కంబైన్డ్ రేషియో వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం మెరుగుపడి 99.2 శాతాన్ని తాకింది. రిటైల్ హెల్త్ ప్రీమియంలో పటిష్ట పురోగతి, కొత్త ప్రొడక్టుల విడుదల, డిజిటలైజేషన్‌పై నిలకడైన దృష్టి, విస్తారిత పంపిణీ నెట్‌వర్క్, కొత్త బ్యాంకస్యూరెన్స్ భాగస్వామ్యాలు (పాలసీల విక్రయంలో బ్యాంకులతో ఒప్పందాలు), మెరుగైన సాల్వెన్సీ రేషియో వంటి అంశాలు భవిష్యత్‌లో కంపెనీ పటిష్ట పనితీరు చూపేందుకు సహకరించనున్నాయి. డిజిటలైజేషన్ బాటలో ఇటీవల డైనమిక్ యూపీఐ క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టింది. తద్వారా కొత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు లేదా హెల్త్ పాలసీ కొనసాగింపు (రెన్యువల్)ను సులభంగా చేపట్టేందుకు వీలును కల్పించింది. రిటైల్ హెల్త్ విభాగంలో 33% వాటాతో మార్కెట్ లీడర్‌గా కంపెనీ నిలుస్తోంది.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 640 టార్గెట్: రూ. 740

ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో విభా పడాల్కర్‌తో పాటు.. సీఎఫ్‌వో నీరజ్ షాతో ఇటీవలే సమావేశమయ్యాం. తద్వారా కంపెనీలో వృద్ధికి సంబంధించి చోటు చేసుకుంటున్న కీలక అంశాలు, మొత్తంగా జీవిత బీమా రంగంలో పరిస్థితులు తదితరాలపై అభిప్రాయాలకు తెరతీశారు. వీటి ప్రకారం కంపెనీ మార్కెట్‌లో తనకున్న వాటాను మరింత సుస్థిరం చేసుకోనుంది. ఇందుకు వ్యూహాత్మకంగా టెక్నాలజీ వినియోగం, కస్టమర్‌కు సేవల అందుబాటు (ఎక్స్‌పీరియన్స్), బ్రాండ్‌ను పటిష్టపరచుకోవడం, సిబ్బంది అందించే ప్రత్యేక సర్వీసులు వంటివి సహకరించనున్నాయి. వీటికితోడు కొత్త ప్రొడక్టుల విడుదల జత కలవనుంది. బీమా రంగ బిల్లులో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, సవరణలు ఆరోగ్య బీమా విభాగానికి ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. వీరి అభిప్రాయం ప్రకారం కస్టమర్ల ఆరోగ్య బీమా అవసరాలకు తాజా బిల్లు తగిన మార్గాలను చూపనుంది. వెరసి కొత్త ప్రొడక్టులను రూపొందించడం, కస్టమర్లకు అనుగుణమైన సర్వీసులందించడం తదితర అంశాలలో బీమా రంగ కంపెనీలకు మరింత వెసులుబాటు లభించనుంది. ఇది దేశీయంగా బీమా సేవల వ్యవస్థ మరింత వేళ్లూనుకునేందుకు తోడ్పాటునివ్వనుంది. రూ. 5 లక్షలలోపు పాలసీలలో 15-17 శాతం చొప్పున వృద్ధి నమోదవుతోంది. అయితే అధిక టికెట్ పరిమాణంగల పాదుపు పాలసీలు తగ్గడంతో సర్దుబాటు ప్రాతిపదికన ఈ ఏడాది (2023-24) మొత్తం వార్షిక ప్రీమియం (ఏపీఈ) 12-13 శాతం చొప్పున పుంజుకునే వీలుంది. మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చానల్ ద్వారా 60 శాతం అమ్మకాలను సాధిస్తుండటం కంపెనీకి కలిసొచ్చే అంశం!

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఇన్ఫోసిస్‌కు షాక్..

1.5 బిలియన్ డాలర్ల కాంట్రాక్టు రద్దు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితితో టెక్ కంపెనీలకు సవాళ్లు ఎదురుతున్న తరుణంలో దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు ఒక అంతర్జాతీయ క్లయింట్ షాకిచ్చింది. 1.5 బిలియన్ డాలర్ల విలువ చేసే మెగా కాంట్రాక్టును రద్దు చేసుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇన్ఫీ దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం సదరు సంస్థకు ఇన్ఫోసిస్ డిజిటల్, వ్యాపార ఆధునీకరణ తదితర సేవలు అందించాలి. మాస్టర్ అగ్రిమెంటుకు లోబడి క్లయింటు 15 ఏళ్లలో మొత్తం 1.5 బిలియన్ డాలర్లు వెచ్చిస్తుందని అప్పట్లో ఇన్ఫీ తెలిపింది. తాజాగా ఎంవోయూ రద్దు కావడంతో ఈ విషయంలో ముందుకెళ్లడం లేదని ఇన్ఫోసిస్ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-12-2023	
విశాఖ	615-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	610-00
విజయవాడ	610-00
రిటైల్ ధర (డజను)	72.00
24-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	594-00
వరంగల్	596-00
రిటైల్ ధర	6.55

అస్సెట్ అలొకేషన్ అంటే ఇదేనా..?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నా దగ్గరున్న మొత్తంలో 60 శాతాన్ని బ్యాంకు ఎఫ్‌డీలలో ఇన్వెస్ట్ చేశాను. మిగిలిన 40 శాతం మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టాను. ఇప్పుడు చూస్తే ఈక్విటీ పెట్టుబడుల విలువ గణనీయంగా పెరిగింది. దీంతో ఈక్విటీలకు 50 శాతం, ఎఫ్‌డీల్లో 50 శాతం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. అస్సెట్ అలొకేషన్ అంటే.. 50 శాతం మించి ఈక్విటీలలో ఉన్న మొత్తాన్ని వెనక్కి తీసుకుని ఫిక్స్‌డ్ డిపాజిట్లలోకి మళ్లించడమేనా?

– ఎస్‌కే సిన్హా

అస్సెట్ రీబ్యాలన్స్ అంటే ఒక లక్షిత కేటాయింపుల విధానాన్ని అనుకుని.. ఆ మేరకు పెట్టుబడుల మొత్తాన్ని వివిధ పెట్టుబడి సాధనాల మధ్య వర్గీకరించడం. ఒకే కాల వ్యవధిలో కొన్ని సాధనాలు మంచి పనితీరు చూపించడం వల్ల వాటిల్లోని పెట్టుబడుల విలువ ఇతర సాధనాలతో పోలిస్తే గణనీయంగా పెరగొచ్చు. దీంతో అలా మంచి పనితీరు చూపించిన వాటి వెయిటేజీ పెరిగిపోతుంది. అప్పుడు ముందు అనుకున్న కేటాయింపులకు మించి, ఎంత అయితే పెరిగిందో ఆ మొత్తాన్ని తగ్గించుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో పోర్ట్‌ఫోలియోలో వెయిటేజీ పడిపోయిన సాధనాలకు ఆ మేరకు కేటాయింపులు పెంచుకోవాలి. అస్సెట్ రీబ్యాలన్సింగ్ వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. మీ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడుల మధ్య సమతూకాన్ని కొనసాగించుకునే వెసులుబాటు ఈ విధానంతో వస్తుంది. అంటే ఈక్విటీకి 60 శాతం, డెట్‌కు 40 శాతం కేటాయింపులతో అస్సెట్ అలొకేషన్ విధానాన్ని నిర్ణయించుకున్నారని అనుకుందాం. కొంత కాలం తర్వాత మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీ వాటా 80 శాతానికి చేరి డెట్ పెట్టుబడులు 20 శాతానికి తగ్గాయని అనుకుంటే.. అప్పుడు మీ పోర్ట్‌ఫోలియోలో రిస్క్ పెరిగినట్టు అవుతుంది. ఎందుకంటే ఎక్కువ మొత్తం ఈక్విటీల్లో ఉండడంతో మార్కెట్ల ఉద్దాన, పతనాల ప్రభావం పెట్టుబడుల విలువపై ప్రతిఫలిస్తుంటుంది. ఇది పెట్టుబడిదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవచ్చు. ఎక్కువ రిస్క్ తీసుకోవద్దని అనుకునే ఇన్వెస్టర్లు ఈక్విటీల పెట్టుబడులను 60 శాతానికి తగ్గించుకుని, డెట్ పెట్టుబడులు 40 శాతానికి అస్సెట్ రీఅలొకేషన్‌తో పెంచుకోవడం వల్ల తిరిగి వారి విధానానికి తగ్గట్టు పెట్టుబడుల స్వరూపం ఉంటుంది. అస్సెట్ రీబ్యాలన్సింగ్‌తో ఉన్న మరొక ప్రయోజనాన్ని చూస్తే.. అధిక స్థాయిల్లో విక్రయించి, తక్కువలో కొనుగోలు చేయడం సాధ్యపడుతుంది. అంటే విలువ గణనీయంగా పెరిగిన చోట విక్రయించి.. అదే సమయంలో పెద్దగా పెరగని చోట కొనుగోలు చేస్తాం. ఉదాహరణకు పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా పెరిగిందంటే.. ఈక్విటీలు బాగా ర్యాలీ చేశాయని అర్థం. దాంతో అస్సెట్ రీఅలొకేషన్ విధానంలో భాగంగా అధిక వ్యాల్యుయేషన్ల వద్ద పెట్టుబడులను కొంత వెనక్కి తీసుకుని డెట్‌కు మళ్లిస్తాం. తరచుగా కాకుండా.. ఏడాదికోసారి లేదంటే.. ఒక పెట్టుబడి సాధనంలోని పెట్టుబడుల విలువ నిర్దేశిత పరిమితి కంటే 5 శాతానికి మించి పెరిగిపోయిన సందర్భాల్లోనే దీన్ని చేయడం సూచనీయం.



నా వయసు 72 ఏళ్లు. నేను ఈక్విటీ ఆధారిత హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సురక్షితమేనా? లేదంటే సంప్రదాయ లేదా బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఎంపిక చేసుకోవాలా?

– భాస్కర్

ఈక్విటీ మార్కెట్ల అస్థిరతలను ఎదుర్కోవడంలో మీకున్న అనుభవం ఏ మేరకు? అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ఈక్విటీల్లో ముందు నుంచి ఇన్వెస్ట్ చేస్తూ మూడేళ్లకు పైగా అనుభవం ఉండి, మార్కెట్లలో ఎత్తు, పల్లాలను (ర్యాలీలు, దిద్దుబాట్లు) చూసి ఉన్నట్టయితే అప్పుడు ఈక్విటీ ఆధారిత ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే మొత్తం నుంచి ఆదాయం కోరుకోకుండా, పెట్టుబడి కోసమే అయితే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడుల్లో ఎటువంటి అనుభవం లేకుండా, చేసే పెట్టుబడిపై ఆదాయం కోరుకుంటుంటే అప్పుడు కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా గూగుల్‌లో సెర్చ్ చేసిన అంశాలు

న్యూస్‌కు సంబంధించి..
1. ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధం
2. టైటానిక్ సబ్‌మెరైన్
3. టర్కీ భూకంపం

వ్యక్తులు
1. డామర్ హామ్లిన్ (అమెరికన్ ఫుట్‌బాలర్)
2. జెరెమీ రెన్నర్ (అమెరికన్ నటుడు)
3. ఆండ్రూ టేట్ (కిక్‌బాక్సర్–సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్)

సంగీత కళాకారులు
1. షకీరా (కొలంబియా సింగర్)
2. జేసన్ ఆల్డీన్ (అమెరికన్ సింగర్)
3. జో జోనాస్ (అమెరికన్ సింగర్–నటుడు)

సినిమాలు
1. బార్బీ
2. ఓపెన్ హైమర్
3. జవాన్

క్రీడాకారులు
1. డామర్ హామ్లిన్ (అమెరికన్ ఫుట్‌బాలర్)
2. కైలియన్ ఎంబాపే (ఫ్రెంచ్ ఫుట్‌బాలర్)
3. ట్రావిస్ కెల్స్ (అమెరికన్ ఫుట్‌బాలర్)

చనిపోయిన ప్రముఖులు
1. మాథ్యూ పెర్రీ (కెనడా నటుడు)
2. టీనా టర్నర్ (అమెరికన్ సింగర్, నటి)
3. సినీడ్ ఓ కానర్ (ఐరిష్ సింగర్, లిరిసిస్ట్)

మీకోసం సర్‌ప్రైజ్ గిఫ్ట్!

క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. సర్‌ప్రైజ్ గిఫ్టులని, పండగ ఆఫర్లు అంటూ బురిడీ కొట్టిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా మీకు ఉచిత బహుమతులు వచ్చాయంటూ వచ్చే మెసేజ్‌లను, ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని తెలంగాణ సైబర్ బ్యూరో అధికారులు హెచ్చరించారు. న్యూ ఇయర్ పేరిట దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు, ఇతర గృహోపకరణాలపై భారీ ఆఫర్లు ఉన్నాయంటూ వచ్చే ఎస్సెమ్మెస్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని వారు సూచిస్తున్నారు. ఇలాంటి లింక్‌లలో సైబర్ నేరగాళ్లు ఫోన్, ల్యాప్‌లాప్‌లలోకి వైరస్‌ను చొప్పించే ప్రమాదం ఉందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరించారు. లింక్ ఓపెన్ చేస్తే మన బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు తీసుకుని అకౌంట్‌లోని డబ్బులు కొల్లగొట్టే ప్రమాదం ఉందని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లు, ఎస్సెమ్మెస్‌లపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా **cybercrime.gov.in** లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



గోవర్ధనగిరిధారిగా యాదాద్రీశుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉదయం శ్రీస్వామి వారిని మురళీకృష్ణుడిగా (శ్రీవేణు గోపాల స్వామి), రాత్రి గోవర్ధనగిరి ధారిగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం అలంకార సేవలను ఆచార్యులు ఆలయ తిరు, మాడ వీధుల్లో భక్తుల మధ్య ఊరేగించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.



'బొచ్చె'డు బరువుంది!

మత్స్యకారుడి వలకు చిక్కిన 20 కిలోల చేప

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్‌కు 20 కిలోల భారీ చేప ఒకటి వచ్చింది. స్థానిక బోయవాడకు చెందిన మత్స్యకారుడు మానుకోల రాజు ఆదివారం తెల్లవారుజామున మిడ్‌మానేరు జలాశయంలో వలవేయగా 20 కిలోల బొచ్చె చేప చిక్కింది. భారీ బొచ్చె రకం చేపను స్థానికులు ఆసక్తిగా చూశారు. ఆ చేపను రూ.150 కిలో చొప్పున విక్రయించారు.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పోలీసులకు–మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. దంతెవాడ జిల్లా కట్టేకల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమక్‌పాల్, దబ్బకున్న గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు తుమక్‌పాల్ క్యాంపునకు చెందిన బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగడంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఎదురుకాల్పుల్లో ముగ్గురు దర్భా డివిజన్ కమిటీకి చెందిన మావోయిస్టులు మృతి చెందారని బస్తర్ రేంజ్ ఐజీ సుందరరాజ్ ఆదివారం చెప్పారు. కాగా, కాల్పులు జరిగిన ప్రాంతంలో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి, ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతిచెందిన నక్సల్స్ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.